# శ్రావణ మాసంలో
# వచ్చే నిండు చందమామ...!
# శ్రావణి

వేణుగోపాల రెడ్డి ఏ

BlueRose ONE.com
Stories Matter
NewDelhi • London

**BLUEROSE PUBLISHERS**
India | U.K.

Copyright © Venugopala Reddy A 2025

All rights reserved by author. No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means, electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior permission of the author. Although every precaution has been taken to verify the accuracy of the information contained herein, the publisher assumes no responsibility for any errors or omissions. No liability is assumed for damages that may result from the use of information contained within.

BlueRose Publishers takes no responsibility for any damages, losses, or liabilities that may arise from the use or misuse of the information, products, or services provided in this publication.

For permissions requests or inquiries regarding this publication,
please contact:

BLUEROSE PUBLISHERS
www.BlueRoseONE.com
info@bluerosepublishers.com
+91 8882 898 898
+4407342408967

ISBN: 978-93-7139-664-6

Cover Design: Shubham Verma
Typesetting: Sagar

First Edition: July 2025

# అమ్మ-నాన్నకి ప్రేమతో...

నువ్వు చదవబోయే ఈ కథ, నీకే అంకితం...!

ఎందుకంటే ఖచ్చితంగా నువ్వు,

ఎవరినైనా ప్రేమించి ఉంటావు,

లేదా ప్రేమించబడి ఉంటావు...!

రెండు సందర్భాల్లోనూ, నీ జీవితంలో ప్రేమ ఉంది...!

కథ అయితే రాశాను కానీ చాలా స్పెల్లింగ్ మిస్టేక్స్. నా వైఫ్ కి స్పెషల్ థాంక్స్, ఎందుకంటే తనే కరెక్ట్ చేసింది, పైగా భర్త చేసిన తప్పులు భార్యకి దొరికినంతగా ఎవరికి దొరకవు కదా...😁, ఇంకా ఏదైనా తప్పులు ఉంటే మన్నించండి.

ఈ కథ నీకు చేరడానికి ముందు, నలుగురు మాత్రమే చదివారు. ఆ నలుగురి ఫీడ్ బ్యాక్ తర్వాత, కథ నీకు కూడా నచ్చుతుందని నమ్మకం కుదిరింది...! ఈ కథని ఎంటర్టైన్మెంట్ గా చెప్పడం కోసం, సినిమాటిక్ వే ఎంచుకున్నాను...! సినిమా కథ లాగా చెప్పబోతున్నాను.

**ఇంకెందుకు ఆలస్యం,**

**పేజీ తిప్పండి కథ మొదలవుతుంది...!**

# 1

## ట్రైలర్

“వెంకట్ గా, సారీ వెంకటేశ్వర్లు గారు, నీ అంత మంచి వాడు నా ఫ్రెండ్ గా ఉన్నందుకు గర్వపడుతున్నారా..! పురాణ పురుషుడు అంటే పాత రోజుల్లోనే ఉండేవారు అనుకున్నా, కానీ ఈ రోజు నువ్వు నా కంటికి పురాణ పురుషుడి లాగా, పుణ్యమూర్తి లాగా కనిపిస్తున్నావు. మహానుభావుడు కి అన్న లాంటి వాడివి రా...!”

“రేయ్, నీకు పుణ్యం ఉంటుంది, దయచేసి పొరపాటున కూడా నాకు గౌరవం ఇవ్వకు, నా మీద ప్రేమ చూపించకు, నాతో పద్ధతి గా మాట్లాడకు.”

“వెంకట్ సార్...”

“వద్దురా, నాకు నీ మర్యాద వద్దు. కావాలంటే తిట్టు, అమ్మనా బూతులు తిట్టు, అంతే కానీ నా జీవితాన్ని నాశనం చేయకురా...!”

“అది కాదండీ వెంకటేశ్వర్లు గారు...”

“నీ జీవితంలో నువ్వు గౌరవించి, ప్రేమించి, పద్ధతి గా మాట్లాడింది ఇద్దరితోనే. అందులో ఒకరిని పైకి పంపించావు, ఇంకొకరిని కంటికి

కనపడనంత దూరం పంపావు. నాకు ఇప్పుడిప్పుడే జీవితం మీద ఆశలు వస్తున్నాయి" అని వెంకట్ గాడు తన రెండు చేతులతో దండం పెడుతూ చెప్పాడు.

అవును, వెంకట్ గాడు చెప్పింది నిజం. నా జీవితంలో నేను ఎక్కువగా ప్రేమించింది, విలువ నిచ్చింది ఆ ఇద్దరికే…!

**ఒకరు మా అమ్మ, ఇంకొకరు శ్రావణి.** అమ్మ ఆకాశంలో ఇల్లు కట్టుకోని వెళ్ళిపోయింది. అమ్మాయి కలుసుకోలేనంత, మాట్లాడుకోలేనంత దూరానికి వెళ్ళింది.

మా అమ్మ అందంగా ఉండేది, అందంగా మాట్లాడేది. తను ఆ రోజుల్లోనే ఏడోవ తరగతి చదివింది. నా చిన్నప్పుడు అందమైన కథలు, కవితలు చెప్పేది.

నాన్నకి ముక్కు మీద కోపం, మాటల్లో వెటకారం, చేతల్లో ప్రేమ ఉంటుంది కానీ కనపడనివ్వడు. చేతల్లో ప్రేమ కనపడకూడదని అదే చేతులతో నన్ను అప్పుడప్పుడు బాదుతూ ఉంటాడు.

అమ్మలాంటి అందం, మాట్లాడే విధానం నాకు రాలేదు, కానీ బాగా ఎమోషనల్ అయితే, నా మాటలు కవితలు అవుతాయి. కానీ సమస్య ఏంటంటే నాకు ఎమోషన్ చాలా తక్కువ, ఏది సీరియస్ గా తీసుకోను. నేను నా జీవితంలో సీరియస్ గా, ఎమోషనల్ గా తీసుకున్న రెండే రెండు ప్రేమలు అమ్మ మరియు శ్రావణి. చివరికి మా నాన్న అయినా, నా బెస్ట్ ఫ్రెండ్ అయినా, నాకు అంత ఎమోషన్ లేదు.

ఆ రెండు ప్రేమల్లో తప్పితే, జీవితంలో ఏది పోయిన, ఏం జరిగినా, ఎలాంటి పరిస్థితులు వచ్చినా, పెద్దగా పట్టించుకుంది లేదు, బాధపడింది అంతకంటే లేదు.

నా కష్టం నాకు జోక్ లాంటిది, ఇక అవతలి వాడి కష్టాన్ని ఎలా చూస్తానో, నీ ఊహలకే వదిలేస్తున్నా...!

ఇదంతా విన్న తర్వాత, నా నుంచి నువ్వు గౌరవాన్ని కోరుకోవు అని అనుకుంటున్నా...! ఒకవేళ కోరుకున్నా, అది నీకు దొరకదు.”

**ట్రైలర్ అయిపోయింది. ఇక సినిమా మొదలుపెడదామా?**

**********

# 2

# ఇంట్రడక్షన్ & టైటిల్స్

"చంద్రుని వెన్నెల కురుస్తున్న రాత్రిలో, పన్నెండు గంటలకు, దెయ్యాలు ముద్దు ముచ్చట్లు పెట్టుకునే సమయాన, ఊరికి చివర, పచ్చని పొలాల మధ్య, తల కింద చేతులు పెట్టుకొని, నడి రోడ్డు మీద అడ్డంగా పడుకొని, ఆకాశం వైపు చూస్తున్నాడు, అసలు ఎవడు వీడు" అని అనుకుంటున్నావా నువ్వు...?

ఒకవేళ అలా అనుకోకపోతే అనుకో, ఎందుకంటే నువ్వు అలా అనుకుంటేనే నేను ఇలా పడుకోడానికి కారణమైన నా ప్రేమ కథ అందులో ఉన్న దివిలో తారక గురించి నీకు చెప్పాలనుకుంటున్నాను.

"వీడే దిష్టి పిడకలా ఉన్నాడు, మళ్లీ వీడికి ఒక ప్రేమకథ, అందులో దివిలో తారక" ఇదేగా నీ ఫీలింగ్...!

ఫీల్ అవ్వు అలానే, తప్పులేదు లే...!

అవును, ఇంతకీ నా పేరు తెలుసా నీకు?"

"వీడే తెలియకపోతే, వీడి పేరు, చిరునామా ఇవన్నీ ఎలా తెలుస్తాయి" అని కప్పలా నా వైపు చూడకు? మనిద్దరం పరిచయం పెంచుకుందాం రా…!

ఒక చిన్న హింట్ ఇస్తా, నా పేరు కనుక్కో?

దుబాయ్ శ్రీను సినిమా చూశారా? ఆ సినిమాలో నా పేరు ఫేమస్.

"ఏంటి శ్రీను అనుకుంటున్నావా…!" మనకు అంత సీన్ లేదు, నేనేమీ హీరో మెటీరియల్ కాదు.

"చెప్పలేదా రామకృష్ణ" అనే డైలాగ్ గుర్తుందా నీకు.

"హ, నవ్వుతున్నావు" అంటే గుర్తుకు వచ్చింది నీకు.

నాది బ్రహ్మానందం క్యారెక్టర్ పేరు రామకృష్ణ. నాన్న పేరు గోపాల కృష్ణ, ఊరు పేరు గోపాల పురం.

మొత్తానికి నా గురించి చెప్పేశా నీకు…!

ఇంతకీ నీ పేరు ఏంటి? వద్దులే చెప్పకు. నువ్వు ఎవరో తెలియకుండా, నీతో మాట్లాడుతున్నాను అంటే, నేను ఎంత మంచోన్నో, అమాయకుడునో కదా…! కాబట్టి, నీకు తెలిసిన వాళ్ళందరికీ చెప్పు, రామకృష్ణ మంచోడు అని, అంతేగాని మైదానం గాడు అని ఎవరితో చెప్పకు.

సరే, ఒకసారి ఆకాశం వైపు చూడు…

చూస్తున్నావా ? లేదా?

"కోపంగా చూడకు", చూస్తున్నావు అని అర్థమైంది…!

ఆకాశంలో చాలా చుక్కలు కనిపిస్తున్నాయా, అందులో ఆ మూల ఒంటరిగా, ఒక చుక్క కనబడుతుంది కదా...! ఆ దిక్కులేని చుక్కని నేనే అని నా చిన్నప్పటి నుంచి నాకున్న నమ్మకం.

"అది నమ్మకం కాదు, మూఢ నమ్మకం లేక పిచ్చి" అని నువ్వు అనుకోవద్దు. ఎందుకంటే నా జీవితంలో నిజమైన ఒక నమ్మకం. **ప్రతి ఒక్కరి జీవితంలో ఏదో ఒక మూఢ నమ్మకం, నమ్మకం గా మారుతుంది. నమ్మకం, మూఢ నమ్మకం గా మారుతుంది.**

దిక్కు లేని చుక్క అన్నా కదా అని, నేనేమీ అనాధను కాదు, ఎప్పుడు నన్ను తిట్టే, కొట్టే, ప్రేమించే నాన్న ఉన్నాడు, నేను బాధలో ఉంటే నన్ను చూసి నవ్వే, ఓదార్చే మంచి స్నేహితుడు ఉన్నాడు. **నేను చెప్పబోయే ముచ్చట్లు వినడానికి నువ్వు కూడా ఉన్నావు.**

మా నాన్నకి నాకు రిలేషన్షిప్ మామూలుగా ఉండదు.

ఒకసారి ఎవడో గొట్టం గాడు ఒకడు, డాడీ అని వాళ్ళ నాన్నని పిలుస్తుంటే విని, నేను కూడా డాడీ అని మా నాన్నని ప్రేమగా పిలిచా. అంతే ఏందిరా నా కొడకా, నన్ను తిడుతున్నావు అని ఎగరేసి మరి తన్నాడు. మా నాన్న కనీసం టీవీ కూడా చూడడు, కష్టపడటమే తెలుసు, మొరటోడు, మొండోడు, మా నాన్న వెనకపడ్డాడు, కొన్నిసార్లు వెనుకబడి మరి కొట్టాడు. నన్ను కొడితే మా నాన్న మాత్రమే కొట్టాలి. అలా కాకుండా, ఎవరైనా నా మీద చేయి వేస్తే, ఎందుకురా చేతకాని వాడిలా తన్నులు తిన్నావు అని మళ్ళీ చితక్కొట్టేవాడు.

చదువు విషయంలో మాత్రం ఏమనే వాడు కాదు, ఎందుకంటే మా నాన్నకి చదువు రాదు కాబట్టి. పైగా నేనేదో చదువులో పొడుస్తా అనే

నమ్మకం కూడా మా నాన్నకి లేదు. నాన్న కదా, పుట్టక నుండి మన ప్రతిభా పాటవాలు తెలుస్తాయి కదా...!

సరే నాన్న గురించి కొంచెం సేపు పక్కన పెట్టి, పిల్ల గురించి చెప్తా...

“ఏ పిల్ల అనుకుంటున్నావా?”

నా ప్రేమ కథలో ఉన్న పిల్ల..?

“వీడేమో చపాతీ కర్ర కి అంటుకున్న పిండిలా, కాలి పోయిన పిడకలా ఉన్నాడు, ఇక వీడి పిల్ల అంటే చేతబడి చేసేదానిలా ఉంటుందేమో” అని నీ ఫీలింగ్.

సరే, తను ఎలా ఉంటుందో, కొన్ని పదాల్లో చెప్తా విను..!

“దేవుడే ప్రేమికుడై తన ప్రేయసి రూపాన్ని తయారు చేస్తే ఎలా ఉంటుందో, అంత అందంగా ఉంటుంది !

నదుల్లోని నీరు కొండల్లోకి, కొండల్లోని నీరు కాలువల్లోకి చేరేటప్పుడు ఉండే ప్రవాహం, తను నడుస్తుంటే తెలుస్తుంది, జలపాతం లాగా నడుస్తుంది...!

తను నవ్వినప్పుడు, హరివిల్లులోని ప్రతి రంగు తన మోముని తాకినట్టు ఉంటుంది...!

ఆకాశ వీధిలో ఎన్ని చుక్కలు ఉన్న, ఒక చుక్క మాత్రమే భూమికి సరైన వెలుగుని పరిచయం చేసినట్లు, ఈ చక్కని చుక్క నాకు యవ్వన ప్రేమను పరిచయం చేసింది.

శ్రావణి...! అందానికి కనుక అవధి ఉంటే అది తన రూపం మాత్రమే”

**శ్రావణ మాసంలో వచ్చే నిండు చందమామ...! శ్రావణి**

**పెట్టిన టైటిల్ కి జస్టిఫికేషన్ వచ్చినట్టే కదా...!**

ఇక, మా జంట ఎలా ఉంటుందో చెప్తే, మీరు ఊహిస్తే, ఖచ్చితంగా నన్ను చూసి కుళ్లుకుంటారు.

“పీచు మిఠాయి లాగా తనుంటే, నేను కొబ్బరి పీచు...

జున్ను తనైతే, నల్ల మన్ను నేను.

తను అప్పుడే పెట్టిన మామిడి కాయ పచ్చడి లాగా హాట్ గా ఉంటే, నేనేమో ఎండిపోయిన తాటి బుర్రలాగా ఉంటాను.

తను నెయ్యి అయితే, నేను ఇంజినాయిలు.

తను మంచు కురిసే వేళలో వచ్చే పొగ లాంటిది, చూడడానికి ఆస్వాదించడానికి బాగుంటుంది. నేను, కాలినప్పుడు వచ్చే పొగలాగా, కొరబోతుంది, దగ్గు వస్తుంది, అప్పుడప్పుడు ప్రాణాలు కూడా పోతాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే, తను చిలక కొట్టిన పండు, నేను పండును కొట్టడానికి విసిరే రాయిని.”

అసలు ఈ కాంబినేషన్ ఎలా కుదిరింది, నీకు ఆ పిల్ల ఎలా పడిందిరా అనే కదా నీ అనుమానం...!

సమాజాన్ని చూస్తున్నావుగా, అందమైన అమ్మాయిలు నాలాంటి వాళ్ళకే పడతారు. నీకు తెలియాల్సింది ఏంటంటే, ప్రేమలో టైమింగ్ ముఖ్యం, మిగతావి అంత ప్రభావం చూపించవు.

టైమ్ తప్పి పుట్టినట్టు ఉండే వీడు, టైమింగ్ గురించి మాట్లాడుతున్నాడు అని అనుకుంటున్నావా...?

అనుకోవట్లేదా...!

నీ మొహం చెప్తుంది, అలానే అనుకుంటున్నావు అని.

ప్రతి సారి నా మీద సెటైర్ వేస్తున్నావు కదా. సరేలే, నా బెస్ట్ ఫ్రెండ్ వెంకట్ గాడు కూడా అలాగే చేస్తాడు, కానీ వాడికి నా మీద గౌరవం, నేనంటే భయం లేకపోయినా, నా మీద ప్రేమ ఉంది. ఆ ప్రేమ నీకు నా మీద ఉందో, లేదో కథ చివరిలో అర్థమవుతుంది.

ఇలాంటి ఒక **మేడ్ ఫర్ నాట్ ఈచ్ అదర్** ప్రేమ కథ ఎలా ఉండబోతుందో అని ఆత్రంగా ఉంటే కొంచెం సేపు ఆ ఆత్రాన్ని ఆపుకో...!

"వీడేంటి, పిల్ల గురించి చెప్పేటప్పుడు పద్ధతిగా పొయిటిక్ గా చెప్తున్నాడు, మిగతా మాటలు అన్ని తిక్కగా లేదా శాడిస్టిక్ గా ఉన్నాయి" అని నీకు అనుమానం వస్తే, నీకు నా జన్మ రహస్యం చెప్పాల్సిందే.

ఈ సారి నువ్వు మనసులో ఏమనుకుంటున్నావో చెప్పమంటావా ?

"కారణజన్ముడు కూడా ఇంత బిల్డప్ ఇవ్వడు. వీడు జన్మించడమే తప్పు, మళ్ళీ అలాంటి జన్మకి ఒక రహస్యం, నా కర్మ" అని ఫీల్ అవుతున్నావు కదా...!

నీ గురించి తెలియకుండానే, నీకు నా కథ చెప్తున్నా కదా, లోకువ నేనంటే నీకు. సరేలే అసలు నేనెందుకు అలా ఉంటానంటే, కొంచెం ఆగు, ఆల్రెడీ నీకు ట్రైలర్ లో చెప్పా కదా, గుర్తు లేకపోతే మళ్ళీ ఒకసారి చదువుకో. ఇక్కడ కూడా అదే చెప్పి, ఇప్పటికే డ్రాగ్ అయిన కథని ఇంకా డ్రాగ్ చేయదలచుకోలేదు.

నా ప్రేమ కథని క్రిస్టోఫర్ నోలన్ లాగా మలుపులు మలుపులు గా, అర్థం కాకుండా చెప్పకుండా, సింపుల్ గా చెప్తాను.


**సినిమా పేర్లు పడ్డాయి, పరిచయాలు అయిపోయాయి,**

**ఇక కథ లోకి వెళ్దాం పద..!**

**********

3

# 1998 సంవత్సరం -
# మలిచూపు & తొలిచూపు



ఏడోవ తరగతి చదువుతున్నాను. స్కూల్ నుంచి ఐదున్నరకి ఇంటికి వచ్చాను. నాయనమ్మని టీ పెట్టమని అడుగుదామంటే, ఎవరితోనో మాట్లాడుతుంది. క్రమంగా మబ్బులు కమ్ముకున్నాయి, అకాల వర్షం మొదలైంది. ఎందుకో, ఎప్పుడు వర్షం పడిన సంతోషంగా ఉండే నాకు, ఆరోజు ఏదో ఆందోళనగా అనిపించింది. వాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నారో అర్థం కావట్లేదు కానీ, నా మనసు ఏదో కీడు శంకిస్తుంది. వర్షం ఆగకుండా ధారాళంగా పడుతుంది, కరెంట్ కూడా పోయింది. కొంచెం సేపటికి వాన

తగ్గింది, ఆ సమయంలో వారి మాటలు మా అమ్మ గురించి అని అర్థమైంది, కానీ పూర్తిగా అర్థం కావట్లేదు. చాలా సమయం తరువాత, వచ్చిన వాళ్ళు వెళ్లారు.

టైం రాత్రి పది అవుతుంది. అప్పుడే అన్నం తిని, ఆరుబయట మంచం మీద పడుకొని ఆకాశం వంక చూస్తున్నాను. నాకు ఎందుకో నిద్ర రావట్లేదు. కాసేపటికి మా నాన్న వచ్చాడు, ముభావంగా ఉన్నాడు. స్నానం చేసి ఏమి తినకుండా నాకు కొంచెం దూరంగా, ఆరుబయట మంచం వేసుకుని పడుకున్నాడు. మా నాయనమ్మ తినమంటే, ఏమి వద్దు అన్నాడు. వాళ్ళు ఇద్దరు ఏదో మాట్లాడుకుంటున్నారు.

ఆ తర్వాత మెల్లగా నా కళ్ళు మూతపడ్డాయి.

తెల్లవారగానే కొంతమంది ఇంటికి వస్తున్నారు, పోతున్నారు. పరిస్థితి నాకు అర్థం కావట్లేదు కానీ భయంగా ఉంది. సరేలే అని పక్కనే ఉన్న సందులో క్రికెట్ ఆడదామని వెళ్ళాను.

ఒక గంటన్నర తర్వాత, ఎవరో వచ్చి, “మీ అమ్మని తీసుకొచ్చారు” అని చెప్పారు. మా అమ్మని దగ్గరగా చూసి ఒక నెల అవుతుంది, ఎంతో ఆనందంతో మా అమ్మని చూడడానికి పరిగెత్తుకుంటూ వెళ్ళాను.

అచేతనంగా ఉన్న మా అమ్మని ఇద్దరు ముగ్గురు కలిసి కారులో నుంచి దింపుతున్నారు. అర్థం కాలేదు ఆ క్షణం ఏం జరుగుతుందో అని.

మా నాన్న వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటున్నాడు. తనని మా ఇంటి వరండాలో తెచ్చి ఐస్ మీద పడుకోబెట్టారు. అమ్మని అలా

చూస్తుంటే నా కళ్ళు తట్టుకోలేక మంటగా ఉన్నాయి. నాకు నిద్ర పట్టకపోతే, మా అమ్మ నిద్రపోకుండా నన్ను జోకొడుతూ నిద్రపుచ్చేది. కానీ ఈరోజు తను పడుకుంది ఇక లేవదు అని అంటున్నారు.

కొంచెం సేపటికి ఎవరో వచ్చి, తను నిన్న సాయంత్రమే చనిపోయింది కదా, ఇంకా ఉంచితే మంచిది కాదు వాసన వస్తుంది అని అన్నాడు. పట్టరాని కోపంతో అతని వైపు చూశాను. మా అమ్మ కనీసం ముఖానికి పౌడర్ కూడా పూసుకోదు. కానీ మా అమ్మ దగ్గర ఉన్నప్పుడు వచ్చే తన పరిమళం ఈ ప్రపంచంలో ఉన్న ఏ పుష్పానికి కూడా ఉండదు.

నాకు కడుపునిండా అన్నం తినిపించిన మా అమ్మకు, నా చేత చెంచాతో తులసి నీళ్ళు పోయించారు.

అమ్మని పట్టుకున్నాను. చాలా చల్లగా ఉంది. ఎరుపు తెలుపు కలయికలో మా అమ్మ రంగు ఉంటుంది. కానీ ఈరోజు పాలిపోయి కనబడుతుంది. పెదవులు ఎండిపోయాయి. చుట్టూ ఉన్న ఆడవాళ్లు కనీసం మా అమ్మ నీ మనస్ఫూర్తిగా పట్టుకోనివ్వట్లేదు. ఎన్నో రోదనలు, ఏడుపుల మధ్య, మా అమ్మని ఆరుబయట కుర్చీలో కూర్చో పెడుతున్నారు.

అమ్మ నిలబడితే ఐదున్నర అడుగుల పైన ఉండే అందమైన శిల్పం లాగా ఉంటుంది. కానీ, ఈరోజు ముగ్గురు పట్టుకున్న కానీ సరిగ్గా నిలబడలేకపోయింది. అలాగే తెచ్చి మా అమ్మని ప్లాస్టిక్ కుర్చీలో కూర్చోబెట్టారు.

మా అమ్మ నాకు స్నానం చేయించి తయారు చేసేది. పక్క పాపిడి దువ్వి, కొంచెం పౌడర్ అద్ది స్కూల్ కి పంపేది. కానీ ఇప్పుడు మా అమ్మని ముస్తాబు చేస్తున్నారు. నీళ్లు పోస్తున్నారు తన మీద. అలా పడిన ప్రతి నీటి చుక్క, నా కళ్ళలోకి వస్తున్నాయి. కళ్ళు చెమ్మగిల్లాయి. నేను మా అమ్మ కొంగుతో ఎన్నో సార్లు నా చేతికి ఉన్న తడిని, మూతిని తుడిచాను. కానీ తన మీద పడిన నీళ్లను, ఆ తడిని ఎవరు తుడవట్లేదు. ఎందుకో, నా ఏడుపు నా గొంతు నుండి బయటకు రావట్లేదు, బహుశా బ్రతికి ఉన్నప్పుడు మా అమ్మ చెప్పిన ధైర్యమైన మాటల వల్ల కావొచ్చు లేదా మా నాన్న పద్ధతి వల్ల కావొచ్చు.

మా అమ్మను ముస్తాబు చేశారు, పువ్వులు చల్లుతూ, చిల్లర పడేస్తూ, స్మశానానికి తీసుకువెళ్తున్నారు. మా అమ్మతో నాకున్న ప్రతి జ్ఞాపకం కళ్ళ ముందు కనపడుతున్నాయి. నన్ను అమ్మ కడుపులో ఆనందంగా నవమాసాలు మోసింది, కానీ ఇప్పుడు అదే అమ్మని నలుగురు మోస్తుంటే నాకు బాధేస్తుంది. నేను పుట్టడానికి మా అమ్మ పడ్డ పురిటి నొప్పుల బాధ నాకు తెలీదు కానీ, అమ్మని సాగనంపడానికి నేను కూడా అలాంటి బాధని పడుతున్నాను.

మా అమ్మ నన్ను నిద్రపుచ్చేది. నేను ఎప్పుడూ మా అమ్మని వాటేసుకొని పడుకునేవాన్ని. కానీ ఈరోజు తను ఒంటరిగా చితిమీద పడుకొని ఉంది. నన్ను దగ్గరకు వెళ్ళనివ్వట్లేదు. **నేను నిద్రలేచాక చూసే తొలిమొహం మా అమ్మ, అలాంటి అమ్మ మొహాన్ని కనపడకుండా మూసేశారు.**

చలికాలంలో మా అమ్మ నాకు చలి తగ్గడానికి చలిమంటలు వేసేది. అలాంటి మా అమ్మ, ఈ చలికాలంలో చితిమంటల్లో కాలుతుంటే ఆకాశానికి కాదు, నా మనసుకి ముసురు పట్టింది.

**"గుర్తుంచుకో, నువ్వు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా ఈ ప్రపంచంలో తల్లిని మించిన గొప్పది ఏది లేదు.**

**ఒక పిల్లాడు దొంగతనం చేస్తే, నాన్న ఆ పిల్లాడు దొంగలాగా మారకూడదు అని బాధ్యతతో మందలిస్తాడు. అదే అమ్మ అయితే, నువ్వు దొంగగా మారితే ఎప్పటికీ సంతోషంగా బ్రతకలేవు అని ప్రేమతో మందలిస్తుంది. నువ్వు అంబానీలని శాసించే పరిస్థితిలో ఉన్న, అడుక్కుతినే పరిస్థితిలో ఉన్న, మీ అమ్మ నీ మీద చూపించే ప్రేమ ఒకే రకంగా ఉంటుంది. మీ అమ్మని ఉన్నప్పుడు బాగా చూసుకోండి. తను మీ దగ్గర లేనప్పుడు మంచి జ్ఞాపకాలు ఉంటాయి."**

నేను మా అమ్మ విషయంలో ఒక తప్పు చేశాను. నాలాగా మాత్రం చేయకండి. తాత్కాలికంగా కొన్నిసార్లు ఉపశమనం లభించిన, అది ఎప్పటికీ సరిదిద్దుకోలేనిది. నేను పోయే వరకు ఆ తప్పు నన్ను వెంటాడుతూనే ఉంటుంది.

అమ్మ దహన సంస్కారాల తర్వాత, వెనుతిరిగి చూడకుండా ఇంటికి వచ్చాను. ఆకాశానికి పట్టిన ముసురు తగ్గింది, నా మనసుకు పట్టిన ముసురు తగ్గలేదు. రాత్రి ఎంత ప్రయత్నించినా నిద్ర రావడం లేదు. చివరికి రెండు గంటలకు నిద్ర పట్టింది. కానీ విపరీతమైన కలలు. మా అమ్మ నాకు ఇడ్లీ తినపించబోతే నేను

వద్దన్నాను అని, గట్టిగా ఏడుస్తుంది. ఉలిక్కిపడి లేచాను, చేసిన తప్పు గుర్తొచ్చింది.

నెల క్రితం మా అమ్మ హాస్పిటల్ లో ఉంటే, నన్ను మా నాన్న అక్కడికి తీసుకెళ్లాడు. మా అమ్మ చాలా నీరసంగా ఉంది, సన్నబడింది. మమ్మల్ని చూడగానే చాలా సంతోషపడింది. నన్ను ప్రేమతో దగ్గరకు తీసుకుంది. అమ్మ గొంతు ప్రేమగా ఉంటుంది, కానీ ఆరోజు తనకు మాటలు సరిగా రావట్లేదు. కొంచెంసేపు తర్వాత నాన్న ఇడ్లీలు తెచ్చాడు. మా అమ్మమ్మ, అమ్మకు పెడుతుంది కానీ అమ్మ తినలేకపోతుంది. మెల్లగా ఒక ఇడ్లీ తిని కొన్ని మందులు వేసుకుంది.

అమ్మని అలా చూసేసరికి, నాకు ఆకలిగా ఉన్నా, తినాలనిపించక చెప్పలేదు. అమ్మమ్మ మమ్మల్ని కూడా తినమంది. అప్పుడు అమ్మ నేను తినిపిస్తా పిల్లాడికి అని, చాలా కష్టంగా ప్లేట్ చేత్తో పట్టుకుంది. మా అమ్మ చేయి వణుకుతోంది, చేతికి ఇంజెక్షన్లు చేయించుకోవడం వల్ల ఆ గాయాలు తెలుస్తున్నాయి. ఎప్పుడైనా మా అమ్మ కలిపి పెడితే కడుపు నిండినా కూడా ఇంకా తినేవాడిని. అలాంటి నేను, అమ్మ చేతిని అలా చూసి, ఒక ముక్క ఇడ్లీ తిని, నాకు ఆకలి కావట్లేదు అని చెప్పాను.

హాస్పిటల్ బయటకు వచ్చి, చెట్టు కింద కూర్చున్నాను. కొన్ని జ్ఞాపకాలు గుర్తుకు వచ్చిన తర్వాత నా తప్పు నాకు అర్థమైంది. **నా తొలి స్పర్శని, నా తొలి ప్రేమని బాధపెట్టాను.** వెంటనే అమ్మ దగ్గరికి వెళ్ళాను, కానీ తనని ట్రీట్మెంట్ కోసం వేరే రూమ్ కి తీసుకెళ్ళారు.

తనకోసం మధ్యాహ్నం తినకుండా ఎదురుచూశాను. కానీ తను రాలేదు.

అమ్మమ్మ భోజనం పెడతానంటే, వద్దు అమ్మ వచ్చాక తింటాను అని అన్నాను. కానీ తనని సాయంత్రం వరకు కూడా తీసుకురాలేదు. మేము తిరిగి బయలుదేరాలి, ఎందుకంటే హాస్పిటల్ లో ఉండడానికి కుదరదు, రూములు తీసుకునే అంత డబ్బు నాన్న దగ్గర లేదు, ఎందుకంటే అమ్మ ట్రీట్మెంట్ కి చాలా ఖర్చు అయింది, అవుతుంది. అమ్మ కోసం ఎదురు చూశాను.

మేము తిరిగి వెళ్లేలోపు తను వస్తుందనుకున్నా కానీ రాలేదు. అమ్మ తెలివికల్లది, నేను ఎందుకు తినలేదో తెలుసు తనకి, కానీ నన్ను ఆ టైం లో ఇబ్బంది పెట్టలేదు. ఎందుకంటే మా అమ్మకి నేను ఏం చేసినా, ఎలా ఉన్నా ఇష్టమే...!

అమ్మమ్మ చెప్పింది, ఇంకా పది రోజుల్లో డిశ్చార్జ్ చేస్తారు, పూర్తిగా తగ్గి ఇంటికి వస్తుంది, అప్పుడు తిను మీ అమ్మ చేత్తో అని. ఆ ఆశతోనే అక్కడనుండి వెళ్ళాను. కానీ ఆ ఆశ నిరాశగా మారి నన్ను ప్రతిక్షణం బాధపెడుతుంది.

మనుషులు ఉన్నప్పుడే ప్రేమగా ఉండాలి, నువ్వు ఏ కారణంగా అయినా నిర్లక్ష్యంగా ఉంటే వాళ్ళు పోయాక ఆ నొప్పి మనతోనే ఉంటుంది. **ఇక నుంచి నువ్వు కూడా రూపుని బట్టి, పరిస్థితిని బట్టి అసహ్య భావన ఉండకూడదు అని గుర్తు పెట్టుకో.**

పగలు, రాత్రి తేడా లేదు, నిద్ర రావట్లేదు, ఏదో అలజడి, మా అమ్మ విషయం లో చేసిన తప్పుకి, నా మైండ్ లో నాకు ఏం జరుగుతుందో అర్థం కావట్లేదు.

కొన్ని రోజుల తర్వాత ఒకరోజు ఉదయాన్నే విజయవాడ వెళ్లి, అమ్మ అస్థికలు కృష్ణా నదిలో కలిపాము. అదే రోజు సాయంత్రం, వెంకట్ గాడిని కలవడానికి వాడి ఇంటికి వెళ్ళాను. వాడు అక్కడ లేడు. వాళ్ళ అమ్మ చెప్పింది, వాడి మామ వాళ్ళ ఇంటికి వెళ్లాడని. వాడిని కలిసి ఇంటికి వస్తుంటే, మళ్ళీ వర్షం మొదలైంది, క్షణం లో జడివానగా మారింది.

ఎనిమిది, తొమ్మిది సంవత్సరాలు ఉండే ఒక అమ్మాయి, వాళ్ళ ఇంటి వెనుక వైపు ఉన్న చెట్టు కింద నిల్చొని ఉంది. నేను కూడా వెళ్లి అక్కడ నిల్చున్నాను. నన్ను చూసి చిన్న నవ్వు నవ్వింది. తన మొహం అచ్చం పౌర్ణమి నాడు వచ్చిన చందమామ లాగా ఉంది. నా కంటికి తను చాలా అమాయకంగా, అందంగా కనబడుతుంది. తన పక్కన ఉన్నంత సేపు ఏదో తెలియని హాయి. ఐదు నిమిషాల తర్వాత వర్షం తీవ్రత తగ్గగానే తను అక్కడి నుంచి ఇంట్లోకి ఊరుకుతూ వెళ్ళింది. **నిజానికి, తను ఇంట్లోకి వెళ్లలేదు, నా మనసులోకి వచ్చిందనీ అప్పటికి నాకు తెలీయలేదు.**

చిన్నగా నేను కూడా నడుచుకుంటూ ఇంటికి వెళ్ళాను. తనెవరో కూడా తెలియదు. కానీ తన మొహం మాత్రం ఎప్పటికీ మర్చిపోలేనంతగా నా హృదయంలో బొమ్మ అయింది.

బహుశా అమ్మ అస్థికలు కలపడం వల్ల, అమ్మ ఆత్మ దేవుడితో కలిసిందో, అమ్మ నన్ను మన్నించిందో, లేక ఆ అమ్మాయి నవ్వు, తన మొహం, నాలో ఉన్న బాధకి మందులా పని చేసిందో కానీ, ఆ రోజు హాయిగా నిద్ర పట్టింది.

**కలలో, ఆరుబయట, మా అమ్మ తన ఒళ్ళో పడుకోబెట్టుకొని ఆకాశంలోని చుక్కలని చూపిస్తూ, నా తలని నిమురుతూ నాకు కథలు చెప్తూ ఉన్నప్పుడు, ఆ తెలియని పిల్ల మొహం, తన నవ్వు నా కళ్ళకి కనిపిస్తుంది. కొన్నిరోజుల తర్వాత ఎంతో హాయిగా పడుకున్నాను.**

ఆ రాత్రి హాయి నిద్ర తర్వాత, నాకు తను అప్పుడప్పుడు గుర్తుకువస్తూ ఉండేది. కానీ తను ఎవరో నాకు తెలియదు. ఎందుకు నాకు గుర్తుకు వస్తుందో అర్థం అయ్యేది కాదు.

**అలా డిసెంబర్ నెలలో, చలికాలంలో కురిసిన అకాల వర్షంలో అమ్మ మొహం మలిచూపై దూరమై, అమ్మాయి మొహం తొలి చూపై, నా జీవితంలోకి వచ్చింది.**

నక్క అరుపు వినిపిస్తుందా ..? అదిగో చూడు, నక్క రోడ్డు క్రాస్ చేస్తుంది, కనపడిందా?

కథ చెప్పకుండా, నక్కా తొక్కా అంటున్నాడు ఏంటి ఈ పాపిష్టోడు అని అనుకుంటే మాత్రం, నా కథని తెలుసుకోవాలని బలంగా అనుకుంటున్నావు అని అర్థం.

**********

# 4

# ఉన్నత పాఠశాలలో చదివిన ప్రేమ

**రెండు సంవత్సరాల తర్వాత...**

ఎండాకాలం సెలవులు అయిపోయాయి. ఎనిమిదవ తరగతి నుంచి తొమ్మిదో తరగతి అంటే కొంచెం డబ్బులు ఉన్నోడు, లాగులు నుండి ప్యాంట్ వేసే స్టేజ్ లోకి వచ్చే సంవత్సరం. కానీ నాలాగా చాలామంది ఇంకా లాగులతోనే వచ్చేశాము. నాన్నని తొడలు కనపడుతున్నాయి ప్యాంట్ కొనమని అడిగితే, తొడలు వాస్తాయి రా అని అన్నాడు. తొడలు వాయడం కన్నా, కనపడటం మేలని, భయంతో కూడిన మనసు చెప్పింది.

మా స్కూల్ చాలా బాగుంటుంది. స్కూల్ ఆవరణలో చాల చెట్లు, స్కూల్ పక్కన పెద్ద గ్రౌండ్. ఆరవ తరగతి నుండి పదోవ తరగతి దాకా క్లాసులు. మొదటిరోజు కదా, నిన్నటి హోంవర్క్ లేదు, రేపటి అసైన్మెంట్ లేదు. చాలా రోజుల తర్వాత అందరూ కలుసుకున్నారు. అందరి మొహాల్లో ఏదో తెలియని ఆనందం. ఎందుకో, మా అమ్మ చనిపోయిన దగ్గర నుంచి ఇలాంటి చిన్న చిన్న ఆనందాలు నేను అనుభూతి చెందలేకపోతున్నాను. నాకు

తెలియకుండా, నాలో ఏవేవో మార్పులు. ఎందుకో కొంచెం హార్డ్ గా మార్పు చెందుతున్నాను. నాలో నవ్వు తగ్గింది అని అనడం కంటే ఎమోషన్స్ తగ్గాయి అంటే బాగుంటుంది.

మొదటిరోజు కాబట్టి, మధ్యాహ్నం మూడు గంటల తర్వాత టీచర్ కూడా ఆడుకోవడానికి పర్మిషన్ ఇచ్చారు. ఇంకేముంది క్రికెట్ ఆడాలని డిసైడ్ అయ్యాం. మ్యాచ్ రెండు క్లాసుల మధ్య అది కూడా పదోవ తరగతికి, మా తొమ్మిదో తరగతికి. స్కూల్ లో ఉన్న కిట్ తీస్కొని గ్రౌండ్ కి వెళ్తున్నాం. నాకు క్రికెట్ పెద్దగా రాదు అయిన బ్యాట్ తీసుకొని అటు ఇటు ఊపుకుంటూ, ఎచ్చులు చేస్తూ వెళ్తున్న సమయంలో...

చిన్నగా గాలి వీస్తుంది, చెట్టుకొమ్మలు ఊగుదామా వద్దా అన్నట్లు ఉన్నాయి. నా చూపు ఆరవ తరగతి వైపు మళ్ళింది. ఒక అమ్మాయి మంచినీళ్ళు తాగుతుంది. తన మొహం నాకు కనపడలేదు, కానీ తనని చూడాలని అనుకుంటున్నాను. వెనుక నుండి తనని చూస్తుంటే ఎక్కడో చూసినట్టు ఫీల్ కలుగుతుంది. తను చిన్నగా తిరిగింది. రెండు సంవత్సరాల క్రితం చెట్టు కింద నేను చూసిన పిల్ల చందమామ, ఇప్పుడు బడిలో ఇన్ని చెట్ల మధ్య ఇలా మళ్ళీ నా కళ్ళ ముందు మెరిసింది.

నా చూపుల పయనం మొదలైంది. చూడగానే నా మనసు మైమరపించింది. **పొద్దున్నుంచి లేని సంతోషం నా మొహం లోకి వచ్చింది.** రెండు సంవత్సరాల క్రితానికి ఇప్పటి నాకు కొంచెం తేడా, కానీ తను చాలా మారింది. మారిన తను నా కంటికి మరింత

అందంగా కనిపిస్తుంది. నాకు నాలుగు దిక్కులు తనే కనిపిస్తుంది. తను క్లాస్ లోకి వెళ్ళింది.

అందరు గ్రౌండ్ కి వెళ్లారు. ఏదో తెలియని ఆసక్తి తనని చూడడానికి ప్రేరేపించింది. ప్రాయానికి పాకులాట మొదలైంది కావొచ్చు. కాలం ఆగిపోయింది, నా అడుగులు తనవైపు మళ్ళాయి. తన వైపు వెళుతున్న కొద్దీ నా హృదయం తన గురించి గొప్పగా చెప్తుంది. ఊహలలో కూడా నేను ఇలాంటి అందమైన బొమ్మను ఊహించలేను. నిజంలో కూడా తనకు మించిన అందాన్ని ఇప్పటివరకు చూడలేదు. తన పెదవులలో ఉండే చిరునవ్వు నా గుండెల్లో చేరి వేగంగా కొట్టుకుంటుంది. తన కాటుక కళ్ళల్లో నేను బందీని అయిపోయాను.

అప్పుడే వాళ్ళ క్లాస్  మాస్టర్ అటువైపు వస్తూ, "ఏ క్లాస్ రా నీది" అని అడగగానే, "మీ క్లాస్ కాదు సార్" అని అక్కడి నుండి గ్రౌండ్ కి పరిగెత్తాను.

క్రికెట్ అంటే నాకు ఇష్టం, అందుకే ఆడటం రాకపోయినా క్రికెట్ ఆడేవాడిని, అందరి చేత తిట్లు తినేవాడిని. మనం ఆటలో ఉన్నామంటే, గెలవాల్సిన మ్యాచ్ కూడా ఓడిపోవాల్సిందే. బౌలింగ్ వేస్తే ఐదారు వైడ్ లు ఉండాల్సిందే. బ్యాటింగ్ చేస్తే కనీసం రెండు ఓవర్లు అయిన ఆడాల్సిందే కానీ రన్స్ మాత్రం రెండో మూడో అంతే.

**"ఇలాంటి ఆటగాడికి టీం లో ప్లేస్ ఎలా వచ్చింది" అని అనుకుంటున్నావా నువ్వు?**

ఆ టీమ్ కి కెప్టెన్ వెంకటేశ్వర్లు గాడు అదే మన వెంకట్ గాడు. నాలాగ కాదు వాడు, బాగా ఆడతాడు. వాడికి తెలిసిన, వచ్చిన ఆట

అది మాత్రమే. మనం ఫీల్డింగ్ లో కూడా వీక్, అంటే ఐదారు క్యాచ్ లు వస్తే ఒకటో ఆరో పడతాం కాబట్టి, నాకు తగ్గట్టే ఆఫ్ సైడ్ లో బాల్ రాని వైపు నిలబెట్టే వాళ్ళు.

ఆరోజు, ఏవేవో ఆలోచనలు, తనని మళ్ళీ చూడాలని, వెంకట్ గాడితో గొడవ వేసుకొని, ఈరోజు జాంటీరోడ్స్ లాగా ఫీల్డింగ్ చేస్తా అని, లెగ్ సైడ్ లో ఆ పిల్ల క్లాస్ కిటికీ దగ్గరలోనే నిల్చున్నాను. తనని మళ్ళీ చూడడానికి అవకాశం వస్తుంది కదా అని. మధ్య మధ్యలో ఎగిరి చూస్తున్నా, తను కనపడలేదు.

అవతల టీం లో బెస్ట్ బ్యాట్స్మెన్ బ్యాటింగ్ ఆడుతున్నాడు. వాడు అవుట్ అయితే మ్యాచ్ చాలా ఈజీ గా గెలవచ్చు. నా దరిద్రం కొద్దీ, వాడు బాల్ నా వైపు కొట్టాడు. క్యాచ్ నా వైపు వస్తుంది. అందరూ అరుస్తున్నారు, క్యాచ్ క్యాచ్ అని. చూడడానికి క్యాచ్ ఈజీ గానే అనిపిస్తుంది. స్టైల్ గా క్యాచ్ పట్టుకోవడానికి ప్రయత్నించినప్పుడు, మిస్ అయ్యి నా ముక్కు మీద పడింది.

ముక్కు లో నుండి రక్తం, వెంకట్ గాడి నోట్లో నుండి బూతులు ఒకేసారి వస్తున్నాయి. “ఒరేయ్ చెత్త నా కొడకా, జాంటీరోడ్స్ లాగా ఫీల్డింగ్ చేస్తానని చెప్పి, రోడ్ మీద వేసే తారుడబ్బా లాగా నిల్చున్నావు, సిగ్గులేదారా నీకు, మామూలుగా పట్టుకోవచ్చు గా, స్టైల్ కావాలా ముండా” అని తిట్టాడు.

సరిగ్గా, ఆ సమయంలో నా వెనుక వైపు కూడా ఏవో అరుపులు, చూస్తే ఆ పిల్ల మరియు వాళ్ళ క్లాస్మేట్స్ అందరు నన్నే చూస్తున్నారని అర్థమైంది.

**ఆరోజు ముక్కు మాత్రమే పగలలేదు, తన దృష్టిలో నా ఇమేజ్ కూడా పగిలిపోయింది.**

అయిన సిగ్గులేకుండా, నాకు నేనే మోటివేషన్ ఇచ్చుకున్నా, ప్రతి కుక్కకి ఒక అవకాశం వస్తుంది అని, మళ్ళీ నాకు అవకాశం వస్తుందని.

మ్యాచ్ ఓడిపోయి, నా పరువు పూర్తిగా పోయిన తర్వాత...

"ఒరేయ్ గాడిద ముక్కోడా, నిన్నేరా వెంకట్ గా" అని నెత్తి మీద ఒకటి బాదా...

"మ్యాచ్ మింగబెట్టిందే కాకుండా, ఎందుకు బే నన్ను కొడుతున్నావు, తిట్టాను అనా"

"తిట్టినందుకు కాదుబే, ఆ అమ్మాయి ముందు తిట్టినందుకు"

"ఏ అమ్మాయి..?"

చెట్టు కింద చందమామ గురించి చెప్పా..

"అరేయ్ కృష్ణ నాకు నిజంగా తెలియదు రా, తెలిసుంటే నా కొడకా నిన్ను ఆ పిల్ల ముందే కుక్కను కొట్టినట్టు కొట్టేవాడిని. మ్యాచ్ చెడకొట్టింది కాకుండా కథలు చెప్తున్నావా. నీ వల్ల అందరూ నన్ను తిడుతున్నారు, నిన్ను టీం లో వద్దు అని"

"నన్ను టీం లో నుండి తీసేయ్, అప్పుడు చెప్తా మీ అందరి గురించి. అయినా, మీరంతా బుర్ర లేని వాళ్ళు రా. ఈ మ్యాచ్ ఓడిపోతే ఇంకో మ్యాచ్ లో గెలవచ్చు అని చిన్న తెలివి లేకుండా, చా.. వేస్ట్ ఫెలోస్ రా మీరు."

"నువ్వు మన టీం లో ఉంటే, ఏ మ్యాచ్ కూడా గెలవలేము రా"

"గెలుస్తాం లే బే. ఈసారి మాత్రం నాకు బిల్డప్ ఇవ్వు ఆ పిల్ల ముందు."

"ఆ పిల్ల డ్రాయర్లు వేసుకొని రోడ్డు మీద తిరిగే వయసులో చూసి, నీకు ఫీలింగ్స్ కలిగాయ రా."

"ఫీలింగ్స్ కాదు రా, ప్రేమ అని ఇప్పుడు ఈ రోజు తెలిసింది".

"ప్రేమ అంటే?" వెంకట్ గాడు తిక్క ప్రశ్న వేశాడు

"నీలాంటి గొట్టం గాళ్లకి తెలియదులే. అందుకే టీవీలో సినిమాలు చూడమనేది."

"సరేరా, చూసి, ప్రేమంటే ఏంటో తెలుసుకోని నీకు బిల్డప్ ఇస్తాలే...!"

ఇంకేముంది, ఫ్రెండ్ సపోర్ట్ దొరికింది, ప్రేమించడానికి అమ్మాయి రెడీ గా ఉంది పైగా దగ్గరలోనే ఉంది.

స్కూల్ లో ఉదయాన్నే అన్ని క్లాసులకు ప్రేయర్ ఉంటుంది. మూడు జెండాలు కనిపిస్తే అదే జాతీయ జెండా అనుకునే బుర్ర తక్కువ వాళ్ళు ఎవరైనా ఉన్నారంటే అది నేను వెంకట్ గాడు మాత్రమే. బొత్తిగా నాలెడ్జ్ లేని సున్నా గాళ్ళం. దేశ భక్తి అంటే పంతులు గారి నోట్లో నుండి వినడమే కానీ నిజమైన ఫీల్ ఆ వయసులో తెలియదు. ఆగస్టు 15 అయినా, రిపబ్లిక్ డే అయినా, స్కూల్ లో ఇచ్చే లడ్డు బూందీ పంచటం కోసం, ఆటల కోసం జరిపే పండగ అని అనుకునే వయసు తెలివితేటలు మావి. ఆల్

ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్ అనే ప్రతిజ్ఞ కోరస్ చెప్పడం మానేశాను తనను మళ్లీ చూసిన తర్వాత.

ప్రతిజ్ఞ చెప్పడానికి, తొమ్మిదవ, పదోవ తరగతి నుండి రోజు ఒకరు స్టేజి మీదకి వచ్చి చెప్పాలి. ఒకరోజు నా టైమ్ వచ్చింది. నేను ఎవరు లేనప్పుడు స్టేజి మీదకి వెళ్తేనే నాకు కళ్ళు తిరుగుతాయి, అలాంటిది ఇక స్టేజి మీదకి వెళ్లి అందరి ముందు ప్రతిజ్ఞ చెప్పాలంటే వామ్మో, మన వల్ల కానీ పని అది. నా సమయం రాగానే, ఆరోజు ఎండకి పడిపోయినట్టు కింద పడిపోయాను కావాలని. వెంకట్ గాడు నాకు హెల్ప్ చేసినట్టు నన్ను క్లాస్ రూమ్ కి తీసుకొని వచ్చాడు.

క్లాస్ లో కళ్ళు తిరిగిన బ్యాచ్ మరియు వాళ్లకి హెల్ప్ చేసే బ్యాచ్ తప్ప, ప్రేయర్ సమయంలో ఎవరు ఉండరు. నేను క్లాస్ లో ఉంటే, వెంకట్ గాడు వచ్చి, “ఒరేయ్ శ్రావణి కి కూడా కళ్ళు తిరిగాయి అంట” అని చెప్పాడు. వెంటనే తనని చూద్దామని క్లాస్ లో నుండి బయటకు వచ్చే సరికి తను ఎదురుగా ఉంది. మాటలు రాలేదు తనని చూసి. తను, తన ఫ్రెండ్ ఉష వాటర్ బాటిల్ తీసుకొని వచ్చారు. ఎందుకు వచ్చారో తెలియదు కానీ, నా పేస్ వాల్యూ వల్ల, నన్ను చూడగానే స్పీడ్ గా పరిగెత్తుకెళ్లారు.

తనని చూడడానికి ప్రతి అవకాశం ఉపయోగించుకునేవాడిని. తను స్కూల్ కి వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు, బ్రేక్ అప్పుడు, లంచ్ టైమ్ లో కనీసం రోజుకు ఐదారు సార్లు తనని చూసేవాడిని. తనని చూడటం నాకో అలవాటుగా మారింది. తనని చూడలేకపోతే ఏదో వెలితిగా అనిపించేది ఆ క్షణంలో. సెలవు రోజుల్లో వాళ్ళ ఇంటి

చుట్టూ తిరిగేవాడిని, వెంకట్ గాడిని కూడా తోడుకు తీసుకెళ్ళేవాడిని ప్రతిసారి.

అలానే చూపులతో ఒక సంవత్సరం గడిచింది. తను ఏడో క్లాస్ కి వచ్చింది, నేను పదో క్లాస్ కి వెళ్ళాను. మా ఊర్లో పిల్లలందరూ ఏడోవ తరగతికి పదోవ తరగతికి ట్యూషన్ కి వెళ్ళేవారు, ఎందుకంటే ఫెయిల్ అయితే నెక్స్ట్ క్లాస్ కి వెళ్ళలేము కాబట్టి.

"అరేయ్ కృష్ణా, మనం కూడా ట్యూషన్ కి వెళ్దాం రా..."

"ట్యూషన్ కా...! ఎందుకు? అయిన ట్యూషన్ కి వెళ్లి మనం పీకేది ఏమీ లేదురా."

"పది కదరా, పాస్ అవ్వాలి రా."

"పాస్ అవ్వాలంటే చదవాలిరా, ట్యూషన్ వెళ్తే ఏం వస్తుంది. అయిన నీ తెలివితేటలతో స్కూల్ ఫస్ట్ రావాలి అని అనుకుంటున్నావారా."

"అది కాదురా"

"అరేయ్ అందరూ ఏడోవ తరగతిలో కూడా వెళ్ళారు, మనం వెళ్ళామా? లేదు కదా. ట్యూషన్ అంటే తన్నులు తింటావురా. కావాలంటే, ఎగ్జామ్స్ టైం లో, ఎవడో ఒకడి డాబా మీద గుడారం వేసి చదువుదాం."

అలా చివరికి వాన్ని కూడా ట్యూషన్ కి పోకుండా చేశాను. ఒకరోజు అనుకోకుండా, శ్రావణి ట్యూషన్ కి రావడం చూశాను. ట్యూషన్ కి వెళ్తే తనని చూడొచ్చు అని, నేను కూడా ట్యూషన్ కి వెళ్ళాలని

అనుకున్నాను. వెంకట్ గాడికి చెప్పలేను, చెప్తే అమ్మలక్కలు తిడతాడు.

ఎలా అని ఆలోచిస్తే, మిత్ర ద్రోహం మళ్ళీ చేసే సమయం ఆసన్నమైంది. వాడికి చెప్పకుండా ట్యూషన్ జాయిన్ అవ్వాలనుకున్నాను.

“నాన్నా, నేను కూడా ట్యూషన్ కి పోతా.”

“మనం వెలగబెట్టే చదువుకి స్కూల్ కే సరిగా పోవు, మళ్ళీ ట్యూషన్ కి ఎందుకు? నెలకు నూట యాభై బొక్క”

“ఒకవేళ పది తప్పితే నీదే బాధ్యత చెప్తున్నా!”

“వెంకట్ ను చూడరా, వాడు వెళ్ళట్లేదుగా..”

“వాడికి చదువు మీద ధ్యాస లేదు నాన్నా.”

“ఇప్పుడు నిన్ను ట్యూషన్ కి పంపితే స్కూల్ ఫస్ట్ వస్తావా ఏంటి?”

“ఫస్ట్ రాకపోయినా, పాస్ అయితాలే…!”

“సరే చావు, నీ ఇష్టం.”

“సరేలే గాని ఆ గాలోడు వెంకట్ గాడు అడిగితే ట్యూషన్ కి వెళ్ళాడు అని చెప్పకు, నన్ను కూడా చెడగొడతాడు”

“చెడిపోయిన వాన్ని ఎవడు చెడగొట్ట లేరులే ముండా”

“సరే నాన్న సరే”

హమ్మయ్యా మా నాన్న ఒప్పుకున్నాడు. ట్యూషన్ ఆరు గంటలకు స్టార్ట్ అవుతుంది. వెంకట్ గాడికి తెలియకుండా వెళ్ళాలి. అందుకే ఐదున్నర కి వెళ్ళేవాడిని.

బాచపట్లు వేసుకొని, ఏదో ఒక పుస్తకం ముందేసుకుని చదువుతున్నట్టు ఫోజులు కొడుతూ తనని చూస్తూ ఉండేవాడిని. రెండు రోజుల తర్వాత తను కూడా ఐదున్నర లోపు ట్యూషన్ కి రావడం మొదలు పెట్టింది.

**ఒక వారం తరువాత...,**

నేను రోజులాగే ఐదున్నరకి వెళ్లాను ట్యూషన్ కి. శ్రావణి నాకన్నా ముందు వచ్చినట్టుంది. కానీ ఈ రోజు ఇంకోడు కూడా ఉన్నాడు ట్యూషన్ లో, ఎవడో అర్థం కాలేదు. దగ్గరికి వెళ్ళి చూస్తే, వెంకట్ గాడు. వాడికి తెలిసిపోయింది అని అర్థమైంది. నన్ను చూడగానే, పక్కన ఉన్న కర్ర తీసుకున్నాడు. అంతే బుక్ అక్కడ పడేసి అక్కడనుండి ఉరుకుబట్టాను. వాడు నా వెనుకలే పరిగెత్తాడు.

మొత్తానికి నన్ను పట్టుకొని చితకొట్టాడు. ఇద్దరం కలిసి ఒక అగ్రిమెంట్ చేసుకున్నాము. వాడు రోజు ట్యూషన్ కి ఆరుకి రావాలి అని. ఆ తరువాత ఇద్దరం ట్యూషన్ కి వెళ్ళాము. అరగంట లేట్ అయిందని ఇద్దరిని ట్యూషన్ మాస్టర్ కొట్టాడు. తన్నించుకోవడం కొత్త కాదు కానీ, ఆ పిల్ల ముందు తన్నించుకున్నందుకు అదో రకంగా అనిపించింది. కానీ వెంకట్ గాడు కూడా తన్నులు తిన్నందుకు ఆనందంగా ఉంది. ఫ్రెండ్షిప్ అంటే ఇదేనేమో...!

**రోజు తనని దొంగ కోళ్లు పట్టే వాడిలా చూడటం తప్ప మాట్లాడింది లేదు. అప్పుడప్పుడు నాకు అనిపించేది తను నన్ను చూస్తున్నట్టు.**
రోజు తను ట్యూషన్ అయిపోయాక ఉష తో కలిసి వెళ్తుంది.

**మూడు నెలల తర్వాత...,**

ఎందుకో ఆ రోజు స్కూల్ కి వెళ్ళలేదు, కానీ ఎప్పటిలాగే ఆరోజు కూడా నేను ట్యూషన్ కి ఐదున్నరకి వెళ్ళాను. తను ఇంకా రాలేదు ఆ టైమ్ కి. తను రాలేదు కదా అని, పుస్తకాలు పక్కన పడేసి అటు ఇటు తిరుగుతూ ఉన్నా.

సమయం పావు తక్కువ ఆరు అవుతుంది. తను రావడం నాకు కనబడుతుంది. తను అలా వస్తుంటే, నా కళ్ళు అద్భుతాన్ని చూస్తున్నాయి. రోజు చూసే శ్రావణి ఈరోజు మరింత అందంగా కనిపిస్తుంది. కారణం తెలియదు కానీ, ఆ రోజు మాత్రం రెండు రూపాయల కొబ్బరి ఐస్ లాగా చాలా అందంగా ఉంది, చూడడానికి భలే ఉంది. తను వచ్చి ట్యూషన్ లో కూర్చుంది.

**కళ్ళు చూస్తున్న వింత, నిశీధిలో మెరిసిన చుక్క,**
**ఎదురుగా అందం, ఆనందమైన హృదయం...!**
**మనసు చెప్పిన భావం, కలలో మురిసిన కావ్యం...!**
**కొలనులో పువ్వు, మన్ను లో సంపద...!**
**ఆకాశంలో తిరిగే దేవత, భూమి మీద తన రూపం...!**
**తన నుండి చూపు తిప్పుకోలేక పోతున్నా...!**

అలా తనని చూస్తూ ఉండగా, ఎందుకో తను లేచి నా దగ్గరకి వస్తున్నట్టు అనిపించింది. వామ్మో, గుండె కాయ అదురుతుంది ఎందుకు వస్తుందా అని. కొంపతీసి నేను సైట్ కొట్టేది అర్ధమయ్యి నన్ను కొట్టడానికి వస్తుందా అని భయం వేసింది. కానీ తను వచ్చి నా పక్కనే కూర్చుంది. అమ్మాయిలతో మాట్లాడడమే రాని నా పక్కన, ఒక అమ్మాయి కూర్చుంది అది కూడా శ్రావణి. నమ్మశక్యంగా లేదు. ఏం చేయాలో అర్థం కావట్లేదు. చెమటలు వస్తున్నాయి.

“నువ్వు నాకొక హెల్ప్ చేస్తావా” అని శ్రావణి చిన్నగా అడిగింది.

“నన్నేనా” అని అన్నాను

“హా నిన్నే, ఇంకా ఇక్కడ ఎవరున్నారు నువ్వు తప్ప...!”

“అవును కదా” అని సిగ్గుతో “ఏం హెల్ప్ కావాలి” అని అడిగాను.

“మా వీధిలో కుక్కలు ఉన్నాయి, భయంగా ఉంటుంది ట్యూషన్ అయిపోయాక వెళ్లాలంటే. ఈరోజు ఉష ట్యూషన్ కి రాదంటా. నాతో పాటు ఇంటి దాకా వస్తావా ?” అని అడిగింది

“వస్తాను” అని బర్రె లాగా తల ఆడించాను

“థాంక్స్” అని చెప్పింది.

తను వెళ్ళి తన ప్లేస్ లో కూర్చుంది. ట్యూషన్ కి అందరూ రావడం స్టార్ట్ అయింది. వెంకట్ గాడికి గొణుకుత చెప్పాను.

వాడేమో “కుక్కల భయానికి కుక్కలాగా నిన్ను కాపలా రమ్మందా..., మంచిది ఇదే ఛాన్స్, మాటలు కలుపు.”

"ఏం మాట్లాడాలి రా ?"

"ఇంత మంది ఉండగా నిన్నే ఎందుకు రమ్మంది అని అడుగు. తనకి నువ్వంటే ఇష్టం రా లేకపోతే ఎందుకు అడుగుతుంది."

"అంతే అంటావా"

"అంతే రా కానీ..."

ట్యూషన్ అయిపోయింది, పుస్తకాలు సర్దుకుంటూ నా వైపు చూసింది. నేను వస్తున్నా అన్నట్టు తల ఊపాను. వెంకట్ గాడికి చెప్పా, నాతో పాటు రాకుండా, కొంచెం వెనకాలే రారా అని. చాలా గర్వంగా చిన్నగా తనతోపాటు బయలుదేరాను. వెంకట్ గాడు మాకు కొద్ది దూరంలో నడుస్తూ వస్తున్నాడు.

చాలా ఆత్రంగా, ధైర్యం చేసి వెంకట్ గాడు చెప్పినట్టు అడిగా.

"ఇంత మంది ఉండగా నన్నే ఎందుకు రమ్మన్నావు" అని అన్నాను.

"అన్నా, ఏదో అన్నావు అర్థంకాలేదు" అని అంది.

ఆ మాటకి, కళ్లలో గుడ్లు గజగజ వణికాయి. నోట్లో నాలుక మూగబోయింది. ఆ క్షణం నాకు అనిపించింది, ఎవరో భూతద్దం ఎండకి చూపించి వీపు మీద పెట్టినట్టు సుర్ మని అనిపించింది.

అంతే, ఏం మాట్లాడకుండా మాడిన పది రూపాయల బల్బ్ లాగా మాట్లాడకుండా తన పక్కనే నడుస్తున్నా...

వాళ్ళ ఇంటి దగ్గరకు రాగానే...

“ఇవాళ నా పుట్టిన రోజు, ఉష కి ఇవ్వడానికి చాక్లెట్ తెచ్చాను. తను రాలేదు కదా, నువ్వు తీసుకో” అని ఇస్తే సిగ్గులేకుండా తీసుకున్నాను.

తను ఇంట్లోకి వెళ్ళింది, నేను మాత్రం షాక్ కొట్టిన కాకిలా అయ్యి వెనక్కి వచ్చాను.

వెంకట్ గాడు ఎదురొచ్చి

“ఏమైందిరా? ఇంతకీ అడిగావా?”

అడిగాను అన్నట్టు తల ఊపాను.

“ఏమన్నదీ రా మరి.”

“అన్నా, అని చాక్లెట్ ఇచ్చింది రా.”

“అన్నా అందా...! ఇంటిపేర్ల ప్రకారం అది నీకు మరదలు వరుస కదరా, అన్న అని ఎలా అంది రా?”

“నాకేమి అర్థం కావట్లేదు రా వెంకటేశ్వర్లు, చెరువు కి పోదాం పద పుస్తకాలు ఇంట్లో పడేసి.”

డబ్బా తీసుకుని చెరువు కి వెళ్ళాము.

“అరేయ్ అన్నా అని ఎలా అందిరా నిన్ను” అని వెంకట్ గాడు అంటుంటే వాడు నన్ను దెప్పుతున్నాడో, ఓదారుస్తున్నాడో అర్థం కావడం లేదు.

“తిక్కల ముండరా అది, పైగా చిన్నపిల్ల కదా, దానికి తెలియదులే. అసలే పెద్దమనిషి కూడా కాలేదు, దానికి బావ కి అన్నకి తేడా తెలియదు లేరా, నువ్వు బాధపడకు రా” అని వెంకట్ గాడు

బయటకు ఓదారుస్తూ లోపల లోపల నవ్వుతున్నాడు. వాడు అలా నవ్వుతుంటే గచ్చకాయని రాయికేసి రుద్ది రుద్ది పిర్ర మీద పెట్టినట్టు ఉంది. ప్రపంచంలో ఉన్న సమస్యలన్నీ డిస్కషన్ చేయాల్సిన చోట, మౌనంగా ఉండి పోయాను.

వెంకట్ గాడు మళ్ళీ రాత్రి తొమ్మిదింటికి వచ్చాడు తిన్న తర్వాత. మళ్ళీ అదే అడిగి, వాడు ఆనందపడుతున్నాడు.

“అంత ఆనందం ఏంటి బే నీకు...”

“నిన్ను ఆ పిల్ల తోడుకు రమ్మంటే, నన్ను రమ్మనకుండా, వెనకాల రమ్మంటావా? సరిపోయింది కదా. నాకు మిత్ర ద్రోహం చేస్తావా బే...”

“అరేయ్ నన్ను వదిలేయ్ రా..”

“సరేలే రేపు కూడా అన్న అంటే,”

“వామ్మో...! నేను ట్యూషన్ కి వెళ్ళను రా బాబు. ఇదిగో జ్వరం వచ్చింది రా నాకు. రేపు స్కూల్ కి కూడా రాను. నువ్వు అర్జెంట్ గా ఇక్కడి నుండి పో లేదంటే నిన్ను చంపేస్తా నా కొడకా...”

“నన్ను చంపేస్తే పోలీస్ అన్నయ్యలు ఈ అన్నని తోడుకు తీసుకుని వెళ్తారు రా...” అని అక్కడ నుండి నవ్వుతూ వెళ్ళిపోయాడు.

**ఆ తర్వాత అన్న అనే పదం, నాకు రెండు రోజుల జ్వరం తెచ్చింది. దాని మీద ఉన్న ఇష్టమో లేక ఇంకా ఏదో కానీ, తనని చూడకుండా ఉండలేకపోయా ఎక్కువ రోజులు.**

మూడు రోజులు స్కూల్, రెండు రోజుల ట్యూషన్ ఎగ్గొట్టిన తర్వాత...

## సాయంత్రం ట్యూషన్ లో...

ఈసారి ట్యూషన్ కి నేను వెంకట్ గాడు సరిగ్గా ఆరింటికి వెళ్ళాము. తనని చూడాలంటే భయంగా ఉంది. అదే సమయంలో చూడకుండా ఉండలేకపోతున్నాను. వెంకట్ గాడు చెప్పిన మాట నీ మోటివేషన్ గా తీసుకొన్నాను. **ఏ మాట అనేగా...! "పెద్ద మనిషి కానీ పిల్లకి, అన్నకి బావ కి తేడా తెలియదు అనే మాట."**

తను నా వైపే చూస్తున్నట్టు అనిపించి, మళ్ళీ చిన్నగా తన వైపు చూశాను. తను చదువుకుంటుంది. ఆరోజు అలా గడిచింది. ఏదో ట్రై చేస్తున్న కానీ నమ్మకం కుదరడం లేదు. ఎందుకో స్కూల్ లో తనని చూడడానికి ట్రై చేయలేదు. ఆ రోజు సిగ్గులేకుండా మళ్ళీ ట్యూషన్ కి ఐదున్నరకి వెళ్ళాను. తను కూడా వచ్చింది.

"ఏంటి బాలేదా? రెండు రోజులు రాలేదు" అని అడిగింది.

"హా, జ్వరం వచ్చింది."

"ఇప్పుడు తగ్గిందా?"

"హా, తగ్గింది."

"సరే జాగ్రత్తగా ఉండు" అని ప్రేమగా చెప్పింది.

ఆ తర్వాత అప్పుడప్పుడు చూసి నవ్వేది, పలకరించేది. ఉష రానప్పుడు నేను తనని వాళ్ళ ఇంటి దగ్గర వదిలిపెట్టే వాడిని. కాకపోతే పక్కన నడవడానికి భయపడి, వెనుకలే నడిచేవాళ్ళం నేను వెంకట్ గాడు. కాలం తొందరగా గడిచింది.

పదో క్లాస్ వాళ్లకి ట్యూషన్ కి లాస్ట్ రోజు. నేను వెంకట్ గాడు సైకిల్ మీద వచ్చాము. ఆ రోజు ఉష రాకపోవటం వల్ల, నేనే వదిలిపెట్టాలి.

"సైకిల్ మీద వదిలిపెట్టనా, లేక నడిచా" అని తనని అడిగాను.

"నీ ఇష్టం" అని అంది.

**తనని సైకిల్ మీద వాళ్ళ ఇంటి దగ్గర వదిలిపెట్టాను. ఆ రోజే, మొదటి సారి ఆ పిల్ల స్పర్శ తగిలింది.**

**ఆ పిల్ల స్పర్శ నాకు...,**

**ఎండాకాలంలో మా ఊరి కాలువలో కొట్టే ఈత కన్నా ఆహ్లాదంగా ఉంది. చిన్నప్పుడు వానకాలంలో ఇంటి ముందు ఉన్న కాలువలో పేపర్ పడవలు వదిలినంత ఆనందంగా ఉంది. భోగి రోజు వేసే చలిమంటలా హాయిగా ఉంది. మా అమ్మ స్పర్శ గుర్తుకు వచ్చింది. ఏదో పెద్ద ఎగ్జామ్ రాసి టాప్ వచ్చినంత ఫీలింగ్ వచ్చింది. చివరి ఎగ్జామ్ అయిన సోషల్ సబ్జెక్ట్ ముట్టుకోకుండానే, ఆ పిల్ల ముట్టుకుందన్న ఆనందంతో రాశాను.**

అదృష్టమో లేక ఇంకా ఏదో కానీ నేను వెంకట్ గాడు పదో తరగతి పాస్ మార్కులతోనే పాస్ అయ్యాము. తను కూడా ఏడోవ తరగతి పాస్ అయింది మాలాగే.

నేను స్కూల్ నుండి కాలేజీ అంటే నిక్కర్ నుండి ప్యాంట్ వేసే స్టేజ్ కి మారాము. కాలేజ్ అంటే పేదోడు అయినా, పెద్దోడు అయిన ప్యాంట్ వేయాల్సిందే.

కాలేజ్ కి వెళ్ళిన తర్వాత, తనని చూడటం ఇంతకు ముందు లాగా కుదరటంలేదు. పండగలకి, సెలవులకీ కూడా సరిగా కనపడటం లేదు. అలా అప్పుడప్పుడు చూస్తూ కాలం గడిచి పోతుంది. ఒకటిన్నర సంవత్సరం గడిచాయి. తనని చూడాలనే తపన తగ్గలేదు కానీ, చూసే అవకాశాలు తక్కువ వస్తున్నాయి. ఇక మాట్లాడే అవకాశం అయితే అసలు రావట్లేదు. తనకి తొమ్మిదో తరగతి కూడా ఇంకో నెలలో అయిపోవడానికి దగ్గరలో ఉంది. నాకు ఇంటర్ ఎగ్జామ్స్ అయిపోయాయి.

ఇంకేముంది రోజు తనని చూడడానికి స్కూల్ నుంచి వచ్చే దారిలో నిల్చోవటం, చూడడం. అంతకు మించి పీకలేని స్థితిలో నేను ఉన్నప్పుడు! తను పదో క్లాస్ కి వెళ్ళింది, నేను డిగ్రీ జాయిన్ అయ్యాను. ప్రతి ఒక్కరి లైఫ్ లో వాడి జీవితాన్ని నాశనం చేసుకోవడానికి ఒక బెస్ట్ ఫ్రెండ్ నీ తయారు చేసుకుంటారు. నేను వెంకట్ గాన్ని తయారు చేసుకున్నట్లు. వెంకట్ గాడు మళ్ళీ సలహాలు ఇవ్వడం మొదలుపెట్టాడు.

“అరేయ్ కిట్టిగా, రోజు రోజుకి నీ లవర్ కి లైన్ వేసే వాళ్ళ నెంబర్ ఎక్కువ అవుతుంది. ఒకవేళ చెప్పాలనుకుంటే తొందరగా చెప్పేయిరా, లేదంటే ఎవడో ఒకడు తగులుకుంటాడు. ఆ అమ్మాయికి వాళ్ళ క్లాస్ లో ఆల్రెడీ ఎవడో ప్రపోజ్ చేశాడంట. అమ్మ నా బూతులు తిట్టిందట వాన్ని. వాళ్ళ మామయ్య వాళ్ళ అబ్బాయి కూడా లైన్ లో ఉన్నాడు. వీళ్ళే కాకుండా సైలెంట్ గా నీలాగా లైన్ వేసే వాళ్ళ నెంబర్ ఇంకా ఎక్కువ ఉంది. నీ మీద ఎలాగూ మంచి అభిప్రాయం ఉంది ప్రపోజ్ చెయ్.”

"ఒరేయ్ ఆ అమ్మాయి ఇంకా పెద్ద మనిషి కూడా కాలేదురా."

**"ప్రపంచంలో ఏ ప్రేమికుడి కి దక్కని అదృష్టం నీకు వచ్చింది రా. నువ్వు ప్రపోజ్ చేశాక తను ఖచ్చితంగా ఒప్పుకుంటుంది. తర్వాత, ఆ అమ్మాయి ఏదో ఒక రోజు పెద్ద మనిషి అయ్యి, ఆ ఫంక్షన్ లో నువ్వు పెద్ద మనిషి హోదాలో వెళ్తే, ఆహా..., ఆ ఊహ ఎంతో అద్భుతంగా ఉందిరా."**

(మనసులో ఆనందపడినా) "నీ అయ్యా, ఏందిబే నువ్వే మాట్లాడేది ?"

"సర్లే ఎవడో ఒకడు తగులుకుంటే అప్పుడు తెలుస్తుంది నొప్పి."

**వాడు అన్నది నిజమే...! ఎవడో ఒకడు తగులుకునే లోపు నేనే తగులుకోవాలి. ప్రపోజ్ చేసే సమయం వచ్చింది.**

**********

5

# ఏప్రిల్ ఫూల్

ప్రపోజ్ చేస్తే తరువాత ఏంటి? నాలో చిన్న భయం, తను ఎలా స్పందిస్తుందో అని.

వాళ్ళ ఇంట్లో చెప్తే మనకి దబిడి దిబిడే. ఊళ్ళో వాళ్ళు ఊస్తారు, ఆ తరువాత మా నాన్న పిచ్చి కుక్కను కొట్టినట్టు కొడతాడు. ఆ ఊహే ఎంతో భయంకరంగా ఉంది. చెప్పకపోతే అసలే అది సూపర్ గా ఉంటుంది, కాంపిటీషన్ ఎక్కువగా ఉంది. ఎవడో ఒకడు కోడిపిల్లని గద్ద తన్నుకు పోయినట్టు తన్నుకుపోతాడు. ఈ ఊహ ఇంకా భయంకరంగా ఉంది.

ప్రపోజ్ చేయాలి, ఒప్పుకుంటే అంతకంటే ఆనందం ఏముంది, ఒకవేళ ఒప్పుకోకపోతే, పెద్ద గొడవ జరిగితే ఎలా? చాలా సేపు ఆలోచించిన తర్వాత కన్నింగ్ ఆలోచన ఒకటి వచ్చింది. ఏప్రిల్ ఒకటి త్వరలో రాబోతుంది. ఆరోజున ప్రపోజ్ చేయాలి అని అనుకున్నాను. తేడా వచ్చినా, తనకి నాకు పరిచయం ఉంది, నా మీద మంచి ఒపీనియన్ ఉంది కాబట్టి ఏప్రిల్ ఫూల్ అని చెప్తాను.

నా ఐడియా నాకు బాగా నచ్చింది, వెంకట్ గాడికి చెప్పాను. “అడవుల్లో లేక ఎక్కడో తిరిగే గుంట నక్క, మనుషుల మధ్యకి వచ్చినట్టు ఉంది” అని అన్నాడు.

పొగిడాడా, తిట్టాడా అర్థం కాలేదు కానీ, ముందుకు వెళ్లవచ్చు అని అర్థం అయింది.

పోలీసులు రెక్కీ చేసినట్టు అంతా చూశాక, ఒక విషయం అర్థమైంది, తనకి డైరెక్ట్ గా ప్రపోజ్ చేయడం కుదరదని, మెసెంజర్ అవసరమని. తన ఫ్రెండ్స్ లో ఒకరిని ఎంచుకోవాలి ఈ మెసెంజర్ పనికి. తనకి ఇద్దరు బెస్ట్ ఫ్రెండ్స్ ఒకరు ఉష, రెండు కుమారి. ఉష తో మాట్లాడే అవకాశం రావట్లేదు, కుమారి అయితే మాట్లాడటం కుదురుతుంది ఎందుకంటే పాల కేంద్రంలో పాలు పోయటానికి మా ఇంటి మీద నుండి వెళ్ళాలి. మెసెంజర్ దొరికింది.

**ఆపరేషన్ కుమారి మొదలైంది.**

“బాగున్నావా కుమారి?”

“హ బాగున్నా అన్నా...”

“బాగా చదువుతున్నావా?”

“నీ అంత కాదులే కానీ అన్న, పర్వాలేదు” అని నా మీద సెటైర్ వేసింది.

సిగ్గులేని నేను, “నాకో హెల్ప్ చేస్తావా” అని అడిగాను.

“ఏంటి శ్రావణి గురించేనా.”

"నీకెలా తెలుసు కుమారి" అని ఆత్రంగా అడిగాను.

"ఆ పిల్లని నువ్వు కక్కుర్తితో చూడటం చాలా సార్లు చూశాలే అన్నా."

నాకు నవ్వొచ్చింది, కొంచెం సిగ్గొచ్చింది.

"అన్నాయ్ సిగ్గు పడింది చాలులే కానీ, ఏం హెల్ప్ చేయాలో చెప్పు."

"చెప్తాలే కానీ ఆ పిల్లకి నా మీద ఒపీనియన్ ఏంటి ?"

"నువ్వేమన్న చిరంజీవివా, నాగార్జునవా, లేక ఉదయ తరుణ్ హా..., నీ గురించి ఒపీనియన్ ఏం లేదు. మంచోడివి అని భ్రమ పడుతుంది."

"భ్రమ ఏందే నిజంగా నేను మంచొన్నే గా"

"నువ్వు చదివే చదువుకు, నీ మొహానికి ఆ పిల్ల కావాల్సి వచ్చిందా అన్నా ?"

"నాకైనా నలభై మార్క్ వచ్చాయి, నీ ఫ్రెండ్ కి ఎన్ని వచ్చాయే ?"

"అందంగా ఉండే అమ్మాయికి మార్క్స్ తో పనేముంది. ఆ పిల్లకి ఆరుగురు లైన్ వేస్తున్నారు నాకు తెలిసి."

"ఎవరికైనా పడిందా ఏంది?" కంగారుగా అడిగాను.

"లేదన్నా...! ఆ పిల్ల ఆ సైపు కాదులే."

"హమ్మయ్య, సరే ఈ లవ్ లెటర్ ఆ పిల్లకి ఇవ్వవా ప్లీజ్.."

"వామ్మో ఆ పిల్ల వాళ్ళ ఇంట్లో చెప్తానంటే,"

"ఏప్రిల్ ఫూల్ అను..."

"నేను ఇవ్వను నాకు భయం"

"ఇవ్వవా..., మొన్న ఆ శ్రీను గాడి ఇంట్లో మీరు ఏంచేస్తున్నారే, నువ్వు ఆ శ్రీను గాడు అదే నీ బావ...!"

"నీకెలా తెలుసన్నా?"

"నువ్వు ఆ శ్రీనుగాడు, రోజు కక్కుర్తి చూపులు, నాకు తెలుసులే"

"సరేలే ఇస్తా"

"ఇవ్వటమే కాదు, ఎటువంటి ఇబ్బంది రాకుండా చూడు"

"సరే అన్నా, సరే"

**మరుసటి రోజు అదే సమయాన...**

"లెటర్ ఇచ్చావా.."

"హ ఇచ్చాను"

"ఏం అన్నది."

"చెప్పుతో కొట్టమన్నది..."

"అసలు ఏం జరిగిందో పూసగుచ్చినట్టు వివరంగా చెప్పు కుమారి, భయంగా ఉంది"

కుమారి చెప్పడం మొదలుపెట్టింది, నేను ఊహించటం మొదలుపెట్టాను...

**స్కూల్ గ్రౌండ్ లో...,**

“శ్రావణి, నీతో మాట్లాడాలి.”

“ఏమైంది కుమారి.”

“కొంచెం పర్సనల్, కొంచెం దూరంగా వెళ్ళి మాట్లాడతాం పద.”

“సరే పదా...”

“ఏంటే ఏదో చెప్పాలన్నావుగా, చెప్పకుండా దిక్కులు చూస్తున్నావు.”

“నేను నీకొకటి ఇస్తా, సీరియస్ అవ్వకూడదు.”

“నేనెందుకు అవుతానే చెప్పు.”

“ఇదిగో ఈ లెటర్ తీస్కో,”

“ఎవరు ఇచ్చారే?” కోపం గా శ్రావణి అంది.

“నీకు ఫాలోయింగ్ ఎక్కువ, చదువుకో ముందు.”

కోపంగా, ఇష్టం లేకుండా, ముభావంగా, శ్రావణి లెటర్ చదవడం మొదలు పెట్టింది.


“ఎప్పటి నుండో చెప్పాలనుకుంటున్నా, ఎందుకో ఇప్పటివరకు చెప్పలేకపోయా...!

ఇప్పుడు చెప్తున్నా,

నీ ఎదురుగా ఎవరో ఒకరు మోకాళ్ళ మీద కూర్చొని నీకు ప్రపోజ్ చేస్తున్నారు అని ఊహించుకో.

శ్రావణి కొన్ని సెకండ్స్ కళ్ళు మూసుకుని అలానే ఊహించి లెటర్ చదవడం మళ్ళీ మొదలు పెట్టింది..

ఊహించుకున్నావు అని అనుకుంటున్నాను. ఇక చదువు మిగతాది కూడా.



"నిన్ను తలవకుండా ఉండలేకపోతున్నా...

నిన్ను చూడకుండా బ్రతకలేకున్నా...

నిశీధిలో రవి కనపడకపోయినా, అమావాస్య కి చందమామ వెలగకపోయిన, పాలపుంతలోని చుక్కల మెరుపులు ఎప్పుడు మెరుస్తున్నట్టు...! నువ్వు కనపడని క్షణం, నీ తలపు నాలో మెరిసి నాకు ఊపిరి నిస్తుంది...!

నీ రూపం పాలవెల్లి, నీ నడక సెలయేరు, నీ నవ్వు ముద్ద మందారం...!

నా చూపులకి నిన్ను చూడటం ఇష్టం, నా హృదయానికి నిన్ను తలుచుకోవటం ఇష్టం...!

నా అడుగులు నీవైపే, నా పయనం నీ వైపే...!

నువ్వంటే నాకు ఎంత ఇష్టం అంటే, నీకు నీ మీద ఉన్న ఇష్టం కంటే ఎక్కువ...!

కలవరంలో ఉన్నప్పుడు నువ్వు కనపడితే వరం అవుతుంది నాకు. నీ ఊహ నన్ను మురిపిస్తుంది, నీ నవ్వు ముద్దొస్తుంది.

నీ ఎదలో చోటు కావాలనుకుంటున్నా...!

నీ శ్వాసలో బ్రతకాలనుకుంటున్నా...!

నీ చేయి పట్టుకోవాలనుకుంటున్నా...!

నీ పక్కన నడవాలనుకుంటున్నా...!

నీతో ఏడు అడుగులు వేయాలనుకుంటున్నా...!

ఇదంతా ఇప్పటికీ ఇప్పుడు కలిగిన అనుభూతి కాదు, నిను చూసిన తొలి క్షణం నుండి మొదలైన నా ప్రేమ భావం.

కృష్ణబిలం లోకి వెళ్ళింది ఏదైనా తిరిగి రానట్టు, నేను నీ ప్రేమలోకి వెళ్ళిపోయాను. దానికి ఉన్న ఆకర్షణ నీలో ఉంది. ఆ ఆకర్షణ నుండి నేను తప్పించుకోలేను.

**నిన్ను ప్రేమించిన, నా ప్రేమ యొక్క ప్రేమని, నీకు చూపిస్తా, నీడలా నీ వెంటే ఉంటా, వెదురు వనంలా నీ పక్కన నిలుచుంటా, నిన్ను పదిలంగా, అపురూపంగా చూసుకుంటా...!**

**నిశీథిలో కొలువున్న నా హృదయానికి వెలుగు ఇచ్చి, నా జీవితంలో ప్రేమ రంగులు నింపవా...!**

దేవతలు బ్రతకాలన్నా, బలంగా ఉండాలన్నా, వాళ్ళకి అమృతం కావాలి. నాకు మాత్రం నీ తోడు కావాలి. నా జీవిత గమనానికి కావలసిన గమ్యం నీ ప్రేమను పొందటం. నన్ను ఆ గమ్యానికి చేర్చు శ్రావణి...!

**ఐ లవ్ యు శ్రావణి...**

నువ్వు నన్ను ఇష్టపడతావనే ఆశతో...,

ఎదురుచూస్తున్న నీ రామకృష్ణ..."

ఎలా రియాక్ట్ అవ్వాలో తెలియని స్థితిలో ఉన్నశ్రావణితో...

"నీకు ఇష్టం లేదని అర్థమైంది, ఇంట్లో చెప్పమాకే గొడవలు అవుతాయి."

"చెప్పను లేవే, ఏదో మంచోడు అనుకొని తనతో మాట్లాడితే, ఇలా చేశాడెంటే. ఇక నుండి ఎవడితో మాట్లాడకూడదు."

"సరేలే నీకు ఇష్టం ఉండదు అని తెలుసు కానీ, నా దగ్గరికి వచ్చి అడుక్కుంటే, తప్పక ఇచ్చానే, సారీ."

"సరేలే వదిలేయ్ ఎవరికి చెప్పకు, మళ్ళీ నా గురించి కూడా తప్పుగా అనుకుంటారు" అని శ్రావణి లెటర్ తీసుకెళ్లింది.

"అన్న, అసలే అది అందంగా ఉండే గయ్యాళి. కానీ నీ అదృష్టం కొద్ది అది గొడవ చేయలేదు. ఇక నుండి నన్ను గెలకకు, దాన్ని గెలకకు" అని కుమారి అక్కడి నుండి వెళ్ళిపోతుంటే...,

“చెప్పుతో కొట్టమన్న డైలాగ్ ఎక్కడ వచ్చింది కుమారి?”

“వచ్చిందిలే అన్నా, ఇంకా ఆ పిల్లని వదిలేయ్, చచ్చినా అది నీకు పడదు” అని కుమారి వెళ్ళిపోయింది.

**********

# 6

# పొద్దు తిరుగుడు పువ్వు

తను నో చెప్పింది అని తెలిశాక అదోరకంగా అనిపించింది. నా మీద నాకే వికారంగా అనిపించింది. తను నాది కాదేమో అని చాలా కంగారుపడుతున్నా...

వెంకట్ గాడు కి చెప్తే,

“ఒరేయ్ కవితల కృష్ణా, తను చూస్తే అలా అనిపిస్తుంది, ఇలా అనిపిస్తుంది అని తెగ కథలు మింగావు. ఇప్పుడు చూడు, అన్నం కోసం ఎదురుచూసే ముష్టోడి చూపులు చూస్తున్నావు. అందుకే తింగరోడా, ఆడ పిల్లలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది ఎందుకంటే ఆడ పిల్లంటే ఆడే, ఉండే, పిల్ల, మన దగ్గరికి రాదు” అని నవ్వుతూ చెప్పాడు.

“చూడరా వెంకట్, నీలాంటి చేతకాని వాళ్ళు ఇలానే చెప్తారు, ఆగిపోతారు, ఆపుతారు, కానీ నా లాంటి సమర్థులు అంత తొందరగా ఏది వదిలేసుకోలేరు. దండయాత్ర చేస్తా.”

“ఎవరి మీద?”

“ఇంకెవరి మీద, ఆ పిల్ల మీదే..!”

“జాగ్రత్త నాయన, వాళ్ళ ఇంట్లో వాళ్ళు నీ మీద దండయాత్ర చేయకుండా చేసుకో.”

“పిరికోడు భయపడతాడు, ప్రేమికుడు బయలుదేరుతాడు గుర్తుంచుకో.”

“యాడికి బయలుదేరేది చెరువుకా...”

“హా, పా పోదాం ప్రస్తుతానికి అక్కడకే.”

పొద్దు తిరుగుడు పువ్వు సూర్యుని వైపుకే తిరిగినట్టు, తను ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్లేవాడిని. వాళ్ళ ఇంట్లో ఉన్నప్పుడు తప్పితే ఎప్పుడు తన చుట్టే తిరిగేవాడిని. నాతోపాటు వెంకట్ గాడిని కూడా తిప్పేవాడిని.

ఊర్లో జరిగే తిరునాళ్లకు, పండగలకి, ఫంక్షన్లకు ఆఖరికి చావులకి, దినాలకి కూడా లైన్ వేయడం మానలేదు. ఊర్లో ఏ ఫంక్షన్ అయినా కుర్రాళ్ళు అందరూ కలిసి వడ్డిస్తారు. ఆ పిల్ల ఎక్కడ ఫంక్షన్ కి వచ్చిన, ఏదొక ఐటమ్ తీసుకొని వెళ్ళేవాడిని, కానీ వద్దు అని చేయి పెట్టేది. పైగా ఎప్పుడూ దాని పక్కనే కూర్చుని కుమారి ఇచ్చే హావభావాలు అయితే పరమ వేస్ట్.

**నా ఈగో హర్ట్ అయింది.**

ఇంతలో ఒక తాత చచ్చిపోతే దినానికి వడ్డిస్తున్నాము. ఆ ముసలాయన వాళ్ళ దగ్గర చుట్టం అవడం వల్ల, వాళ్ళ అమ్మతోపాటు అక్కడికి తను కూడా వచ్చింది. ఈ సారి వాటర్ తీసుకున్నా, ఎలా వద్దు అంటుందో అని. అందరి ప్లేట్స్ లో నీళ్ళు

ఎలా పోస్తున్నానో ప్లేట్స్ కడగటానికి అలానే చెయ్యి అడ్డుపెట్టిన కూడా ఆ పిల్ల ప్లేట్స్ లో కూడా పోశా. వర్కవుట్ అయింది ఐడియా. ఆ తరువాత తాగడానికి ఐదారు సార్లు వాటర్ పోయించుకుంది. ఇక అక్కడినుండి ఏ ఫంక్షన్ కి అయినా వాటర్ బాయ్ అయిపోయా.

ఇలాంటి పనులు ఎన్నో చేశాను దానికి దగ్గర అవ్వడానికి. కొన్నిసార్లు పరువు కూడా పోయింది. ఒకసారి వెంకట్ గాడు, నేను, డబ్బా తీసుకొని చెరువుకి వెళ్తున్నాం. దరిద్రం ఏంటంటే, వెళ్ళే దారికి పక్కనే స్కూల్ గ్రౌండ్ ఉంటుంది. తను మరియు వాళ్ళ ఫ్రెండ్స్ తో గ్రౌండ్ లో ఆడుకుంటున్నారు. కుమారి మమ్మల్ని చూసింది. వెంటనే డబ్బా వెంకట్ గాడు చేతికి ఇచ్చా. అక్కడినుండి నా పరువు తీయడానికి, కుమారి కావాలనే కెలకడం స్టార్ట్ చేసింది.

“ఎక్కడికి వెళ్తున్నావు అన్నా” అని గట్టిగా అడిగింది.

వెంకట్ గాడు నాకన్నా తీటగాడు, వెంటనే “మీ అన్నకి అర్జెంట్ గా వస్తుందట, వస్తావా కడగటానికి అన్నాడు.” ఆ మాటకు అందరూ తెగ నవ్వారు.

ఆ పిల్ల “మా నాన్నకి చెప్తా ఉండు” అని మళ్ళీ అరిచింది కోపంగా.”

“ఎందుకమ్మా మీ నాన్న వస్తాడా కడగటానికి అని వీడు అన్నాడు.”

“ఒరేయ్ వెంకట్ గా” అని అంది..

“ఏంటే కుమారి, రా అంటున్నావు, నరుకుతా నా జోలికి వస్తే” అని ఈడు కోపం గా  అన్నాక అందరూ స్కూల్లోకి జంప్.

మనకి నిజానికి పరువు లేదు కానీ, నా పరువు మళ్ళీ తీశాడు వీడు ఆ సమయంలో. తనకి లైన్ వేసే ప్రయత్నంలో చాలా సార్లు భంగపడ్డాను. పరువు పోగొట్టుకున్నాను.

ఆ తర్వాత కూడా రెండు మూడు సార్లు లెటర్స్ ఇచ్చాను ఏజెంట్ కుమారి సహాయంతో. ఒక లెటర్ లో నా నెంబర్ కూడా రాశా. రెస్పాన్స్ లేదు. అయిన కానీ పట్టు వదలని విక్రమార్కుడిలా, ఇంకో లెటర్ రెడీ చేశాను.

**ఒక రోజు ఉదయాన్నే...**

“కుమారి ఒకసారి ఆగు”

“ మళ్ళీ ఏంటన్నా..”

“ఈ లెటర్ ఒకసారి...”

“ఏంది ఇచ్చేది అది పెద్ద మనిషి అయింది.”

“ఎప్పుడూ అయింది. నాకు తెలియదే.”

“నీకు తెలిస్తే, ఆ పిల్ల ఫంక్షన్ నువ్వు చేస్తావా ఏంది?”

“సరేలే పో, తరువాత చూద్దాం...”

**కాలేజీ కి వెళ్ళేటప్పుడు...**

“ఒరేయ్ వెంకట్, ఆ పిల్ల పెద్దమనిషి అయింది అంట...!”

“హా హా మొత్తానికి నీ పెళ్ళాం పెద్ద మనిషి అయింది”

"ఊరుకో రా" సిగ్గుపడుతూ అన్నాను.

"అప్పుడే ఈనిన బర్రె సిగ్గు పడినట్టు పడుతున్నావుగా, సరే ఫంక్షన్ కి వెళ్దాం కిట్టిగా..."

"ఆడవాళ్లు కదురా వెళ్ళేది."

"దగ్గర చుట్టాలు ఎవరైనా వెళ్ళొచ్చులే బే..."

"దగ్గరి చుట్టాలు ఎవరున్నారు రా..."

"ఆ పిల్ల అందరి కన్నా దగ్గరి చుట్టం నీకే, నీ పెళ్ళాం కదా..."

మళ్ళీ సిగ్గుతో మెలికలు తిరిగాను.

ఫంక్షన్ రోజు వచ్చింది.

కొంచెం సిగ్గుతో, కొంచెం ధైర్యంతో ఫంక్షన్ కి వెళ్ళాము. ఆ రోజు తనని మొదటిసారి ఓనిలో చూశాను. మొహంలో పసితనం అలానే ఉంది. తను నవ్వుతుంటే లక్ష దీపాల వెలుగులు నా మనసులో వెలుగుతున్నాయి.

కొంచెం దూరంగా ఉండి తన వైపు చూస్తున్నాను. ఆ సమయంలో ఆ పిల్లకి బావ వరుసయ్యే వాళ్ళ బంధువు ఒకడు మా దగ్గరకు వచ్చాడు. నేను ఆ పిల్లని చూస్తుంది వాడు గమనించాడు.

"మీరెందిరా ఆడాళ్ళ లాగా ఈ ఫంక్షన్ కి వచ్చారు."

"మా ఇళ్లల్లో ఆడ వాళ్ళు మొగాళ్లని పంపారులే. మీ ఇంట్లో ఆడాళ్ళు మాత్రమే వచ్చినట్టు ఉన్నారు" అని వెంకట్ అనగానే వాడి మొహం పాలిపోయింది.

"మిమ్మల్ని ఎవరు పిలిచారు?"

“మీ చెల్లెలు ఫంక్షన్ కదా, మీ బాబాయ్ పిలిచాడులే” అని అన్నాను.

“ఎవరు చెప్పారు ఆ పిల్ల నాకు చెల్లెలు అని”

“అదిగో అక్కడ కుమారి ఉంది కదా ఆ పిల్ల చెప్పింది” అనగానే వాడు కుమారి దగ్గరకి వెళ్ళిపోయాడు.

“ఒరేయ్ కిట్టిగా, కన్ను కొట్టడం ప్రాక్టీస్ చేయించాగా, ఆ పిల్లకి కన్ను కొట్టు రా...”

“కన్నుతో కొడితే కాళ్లతో తంతారేమో రా...”

“కొట్టుబే ఏం కాదు...”

తను నా వైపు తిరిగినట్టు అనిపించగానే, కన్ను కొట్టాను. ఎందుకో నన్ను చూసి నవ్వినట్టు ఉంది.

“ఒరేయ్ వెంకట్, కన్ను కొడితే ఆ పిల్ల నవ్వుతుంది రా...”

“ఎలా కొట్టావు, చూపించు”

“ఇలా రా..” అని చూపించాను.

“నా కొడకా, నిన్ను కన్నుకొట్టురా అంటే కళ్ళు కలక ఉన్నోడు కళ్ళు అర్పినట్టు ఆపుతున్నావు. అందుకే నవ్వి ఉంటది. భ్రమలో నుండి బయటికి రా.”

ఈలోపు కుమారి మా దగ్గరికి వచ్చింది.

“కృష్ణా అన్నా, మీరేం చెప్పారు, వాడు నాతో సీరియస్ గా మాట్లాడాడు.”

“ఎవడు...?”

“అదుగో వాడే, ఈ పిల్లకి బావ అవుతాడులే...”

“కాదు కుమారి, వాడు నీకు లైన్ వేస్తున్నాడు. మా దగ్గరికి వచ్చి నీ గురించి చెప్పమని అడిగాడు. కుమారి లాంటి అందగత్తె నీకు పడదులే, అయినా కుమారి నీకు చెల్లెలు అవుతుంది కదా అని అన్నాను.”

“అవును అన్న, ఈ మధ్య అందరూ నా వెనకాలే పడుతున్నారు, ఆడపిల్లగా పుట్టడమే పాపం అయింది” అంటూ జడ తిప్పుకుంటూ అక్కడి నుండి వెళ్ళిపోయింది.

“అరేయ్ వెంకట్, కాన్ఫిడెన్స్ అంటే కుమారిదిరా, ఈ మాత్రం కాన్ఫిడెన్స్ ఉంటే మన జీవితం కూడా బాగుంటుంది రా.”

వెంకట్ గాడు మాత్రం నేను చెప్పేది వినకుండా, కుమారి వైపు ఆశ్చర్యంతో అలా చూస్తూ ఉండిపోయాడు.

ఆ తరువాత చాలా సేపు అక్కడే ఉన్నాము.

**“శ్రావణిని ఆరోజు అలా చూస్తుంటే మా అమ్మ చెప్పిన చందమామ కథలు గుర్తుకు వచ్చాయి.**

**కథలో రాణి అంటే తనేనేమో...!**
**సినిమాలో కథ నాయికా అంటే తనేనేమో...!**
**అసలు తను వెన్నెలకి అక్కేమో,**
**లేక చుక్కలకి చెల్లెలేమో...!**
**దేవత ఎవరైనా భూమి మీద పొరపాటున శ్రావణి లాగా పుట్టిందేమో...!”** అని అనిపించింది

**కొన్ని రోజుల తరువాత...,**

తను ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో ఉన్నప్పుడు పబ్లిక్ ఎగ్జామ్స్ కి మా కాలేజీ లో రాయాలి. ఇంకేముంది నాలుగు ఎగ్జామ్ లకు తను ఎగ్జామ్ కి వెళ్తుంటే అక్కడ కూడా సైట్ కొట్టా. పాపం ఆ పిల్లకి ఆ నాలుగు సబ్జెక్టులు పోయాయి. రెండు ఎగ్జామ్స్ కి నాకు కుదరకపోవడం వల్ల వెళ్ళలేదు, ఆ రెండు పాస్ అయింది. తన తెలివి తేటలతో తప్పిందో, మన మొహం చూసి తప్పిందో కానీ మొత్తానికి తప్పింది.

శ్రావణి ఇంటర్ లో ఉన్నప్పుడు, ఎందుకో నాకు ఒకటి రెండు సార్లు ఒక ల్యాండ్ లైన్ నెంబర్ నుండి కాల్ వస్తే, అదే తనే అనుకొని సిగ్గులేకుండా మళ్ళీ లెటర్ రాసి, పైగా దాంట్లో నువ్వు నాకు కాల్ చేశావా అని అడిగా...

మొదటిసారి రిప్లై వచ్చింది. కుమారి లెటర్ తెచ్చి ఇచ్చింది.

“ఏమైంది కుమారి ఒప్పుకుందా...! తనే ఈ లెటర్ రాసిందా...!”

“తొందర ఎందుకన్నా, తనే రాసింది, ఇంటికిపోయి చదువుకో”

ఎంతో ఆనందంగా ఇంటికి వెళ్ళి చదివా. అది చదివాక, నా మనసులో పిడుగులు పడ్డాయి, సునామి వచ్చింది.

**“చూడు, నువ్వు ఎన్ని లెటర్స్ రాసిన నేను నిన్ను ఎప్పటికీ ప్రేమించను. దయచేసి నా జోలికి రావద్దు. నేను చదువుకోవాలి. నేను నీకు కాల్ చేశానా, మొహం చూసుకున్నావా, కుడితి తొట్టిలో పడి లేచిన బొచ్చు కుక్కలాగా ఉంటావు, ఇంకోసారి నాకు లెటర్స్**

**రాయవద్దు, నా వెనుక పడొద్దు. నీకు బాగోదు చెప్తున్నా. ఐ హేట్ యూ.”**

ఈ లెటర్ చదివాక, బాగా హర్ట్ అయ్యా రెండు విషయాలకు. ఒకటి బొచ్చు కుక్క, రెండు తను బాగా చదువుకోవాలి అని అన్నది చూడు ఆ బ్రెయిన్ తో.

ఆ లెటర్ చదివాక, వెంకట్ గాడి ఆయుష్షు కనీసం పదేళ్ల పెరిగి ఉంటుంది.

“ఎందిరా కుడితి తొట్టిలో పడి లేచిన బొచ్చు కుక్కవా నువ్వు, ఇంకా నయం బురదలో దొర్లిన పంది, పానకంలో పాకిన బల్లి అనలేదు. నిజానికి రా, ఈ పేర్లు కూడా నీకు బాగా మ్యాచ్ అవుతాయి అని” వాడు పది రోజులు పైన నవ్వాడు ఆ లెటర్ గుర్తుకు తెచ్చుకొని.

ఆ తరువాత తనకి ఇంటర్ రెండవ సంవత్సరం కూడా అయిపోయింది. ఇక్కడే విధి విచిత్రంగా అనిపించింది. తను అన్ని సబ్జెక్టులు ఫస్ట్ ఇయర్ వి కూడా ఒకేసారి పాస్ అయింది. సమయానికి నా డిగ్రీ ఎగ్జామ్స్ కూడా అయిపోయాయి. రాసిన సబ్జెక్ట్స్ లో పాస్ మార్కులు అయినా వస్తాయో రావో తెలియదు, అయిన కానీ ఐసెట్ కోచింగ్ కి వెళ్ళి స్టేట్ ర్యాంక్ కొట్టాలని, నేను, వెంకట్ గాడు అతి విశ్వాసంతో విజయవాడ కి వెళ్ళాం.

**తనని కొన్ని రోజులు కదిలించకూడదు అని అనుకున్నాను.**

**********

# 7

# పాలపుంతలో రెండు చుక్కలు

అక్కడే ఒక రేకుల రూమ్ రెంట్ కి తీసుకున్నాం. నాలుగో అంతస్తులో పెంట్ హౌస్. ఎక్కితే దిగలేము, దిగితే ఎక్కలేము. పగలు వేడితో మండుతుంది, రాత్రి మాత్రం బాగుంటుంది.

ఫుల్ గా తిని, రూమ్ బయట పడుకొని, పైన ఆకాశాన్ని చూస్తూ, ముచ్చట చెప్పుకుంటూ, అప్పుడప్పుడు బీరు తాగుతూ, ఆహా ఎప్పుడు నిద్రపోయామో కూడా తెలియనంత చల్లటి గాలి, బలే ఉండేది. కోచింగ్ కి తెచ్చిన డబ్బులు, కోచింగ్ ఫీస్ కట్టకుండానే ఇద్దరి దగ్గర అయిపోయాయి. సరేలే, ఎలాగు రూమ్ రెంట్ కట్టాం కదా అని, రెండు నెలలు ఎగ్జామ్ అయ్యేదాకా, ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నాం.

పది రోజుల తర్వాత చేతిలో డబ్బులు లేవు, వెంకట్ గాడి ఫ్రెండ్ ఇస్తా అన్నాడు. కానీ వాన్ని కలవాలంటే గుంటూరు వెళ్ళాలి. గుంటూరు కి వెళ్లేంత డబ్బులు కూడా లేవు. టికెట్ లేకుండా బస్సు లో వెళ్లలేము అని, ట్రైన్ లో వెళ్ళాము. మేమిద్దరం అనుకుంటాము, దరిద్రానికి ఎవరైనా పిల్లలు ఉంటే అది మేమే

అని. గుంటూరు లో దిగగానే, ఎప్పటిలాగే ప్రూవ్ అయింది. టి.సి పట్టుకున్నాడు, పరిగెత్తబోతే, రైల్వే పోలీసులు పట్టుకున్నారు.

మొదటిసారి రైల్వే పోలీస్ స్టేషన్ లోకి అడుగు పెట్టాము, మూల కూర్చోబెట్టారు. అంత దరిద్రంలో కూడా ఒకరి మొహాలు ఒకరు చూసుకొని నవ్వుకున్నాము. ఇద్దరు స్టాఫ్ అందులో ఒక లేడీ కానిస్టేబుల్.

ఎవరో ఇన్స్పెక్టర్ అప్పుడే వచ్చాడు, మేము నవ్వుతుంది గమనించాడు. కోపంగా "ఎవరిదైనా పర్సులు కొట్టేశారా" అని అడిగాడు అక్కడ ఉన్న లేడీ కానిస్టేబుల్ ని.

"కాదు సార్, వీళ్ళ మొహాలకి అంత లేదు సార్, టికెట్ బ్యాచ్" అని చెప్పింది.

"వీళ్ళని చూస్తుంటే అలా లేరే, పర్సులు కొట్టేసే బ్యాచ్ లాగా ఉన్నారే" అని అన్నాడు.

ఆ మాటకి మా ఇద్దరికీ నవ్వొచ్చి నవ్వుతుంటే, ఆ ఇన్స్పెక్టర్ కు కోపమొచ్చింది.

"బట్టలు తీసేయండిరా, నాకు డౌట్ గా ఉంది మీ మీద."

"సార్, మేడం ఉన్నారు, బాగోదు సార్, ప్లీజ్."

"మీ లాంటి దొంగ నాయాల్లాని చాల మందిని చూసింది లే కానీ, తీసేయండి తీసేయండి."

లేడీ కానిస్టేబుల్ తో "వాళ్ళని డ్రాయర్ మీద ఆ మూలాన కూర్చోబెట్టు, నేను వస్తా" అని లోపలికి వెళ్లాడు.

కానిస్టేబుల్ మా దగ్గరికి "షర్ట్ తీయండి రా" అన్నది, తీసేశాము.

"లోపల డ్రాయర్ ఉందా..."

"ఉంది అక్కా",

"ప్యాంటు కూడా తీసేయండి."

"వద్దు అక్కా, ప్లీజ్."

"తీయకపోతే లాఠీ తో నాలుగు తగిలిస్తా."

తప్పక తీశాక, లేడీ కానిస్టేబుల్ పెద్దగా కేక పెట్టింది "వామ్మో" అని,

"ఏమైంది" అని ఇన్స్పెక్టర్ బయటకు వచ్చాడు.

"ఏమైంది మేడం"

"ఒకసారి ఇటు చూడండి సార్.."

"ఆడవాళ్ళకి కిటికీల జాకెట్ లాగా, వీళ్ళు డ్రాయర్లకి కిటికీలు ఉన్నాయి."

"ఒరేయ్ ప్యాంటు తీయ్యమంది ఏమైనా బొక్కలు ఉంటే అర్థం అవుతుందని, కానీ డ్రాయర్ కి ఇన్ని బొక్కలు ఏందిరా, ముందున్న బొక్కలు మా ఇంట్లో ఉన్న కూలర్ కి కూడా ఉండవు రా. వెనక్కి తిరగండి రా సిగ్గులేని వేదవల్లారా..." అనగానే వెనక్కి తిరిగాము.

"జల్లెడకి కూడా ఇన్ని ఉండవు కదరా. మీ దగ్గర ఏదో పట్టుకుందామని వలవేస్తే, మీరే వల వేసుకొని తిరుగుతున్నారు కదరా..."

సిగ్గుతో చెప్పాము, "పదో తరగతి అప్పుడు తిరునాళ్లలో కొన్న డ్రాయర్లు సార్. పేదరికం సార్."

"పేదరికంలాగా లేదు, సమ్మర్ క్యాంప్ ఉన్నట్టు ఉంది, ముందు ఆ ప్యాంటు వేసుకోండి."

**బట్టలు వేసుకున్నాక...**

"సరే ఫైన్ కట్టి వెళ్లిపోండి"

"ఆ డబ్బులే ఉంటే బొక్కలు పూడ్చుకునే వాళ్ళం కదా సర్."

"మూడు రోజులు జైల్లో ఉండాలి రా కట్టకపోతే"

"సార్, నెల అయినా ఉంచండి కానీ, కేసు రాయకండి సర్."

"ఎందుకు రా"

"డిగ్రీ అయిపోతుంది సార్, రేపు ఎప్పుడైనా ఎవడైనా జాబ్ ఇస్తే, దానికి ఇబ్బంది రాకూడదని."

"మీ మొహాలకి డిగ్రీలు అయిపోయాయా రా, అసలు టికెట్ లేకుండా ట్రైన్ ఎందుకు ఎక్కారు రా."

"డబ్బులు లేకపోతే, ఫ్రెండ్ ఒకడు ఇస్తా అని గుంటూరు కి పదకొండు గంటల కల్లా రమ్మన్నాడు సర్. ఇప్పుడు టైం నాలుగు అవుతుంది సర్, వాడు వాళ్ళ ఊరికి కూడా వెళ్లి ఉంటాడు."

"సరేలే వీళ్ళని వదిలేయండి మేడం."

"సార్, ఒక చిన్న హెల్ప్ చేయండి సార్"

"ఏం కావాలి రా మీకు, కొత్త డ్రాయర్లు కొనిపెట్టాలా మీకు..?"

“కాదు సార్, మళ్ళీ విజయవాడ కి వెళ్తాము సర్, ఒకవేళ టికెట్ లేదని అక్కడ మమ్మల్ని పెట్టుకోవద్దని చెప్పండి సార్.”

“దారిద్య్రరేఖకు కింద, దరిద్ర దేవత పైన, దరిద్రమైన స్థితిలో, పక్కపక్కన నిల్చున్న దరిద్రుల లాగా ఉన్నారు రా మీరు” అని రెండు టికెట్స్ తీసుకొని, స్టేషన్ లో ఉన్న ముగ్గురు కలిపి మాకు ఐదు వందల రూపాయలు ఇచ్చారు. ట్రైన్ లో డిసైడ్ అయ్యాం, ఎప్పటికైనా రైల్వే పోలీస్ అయి, టికెట్ కొనలేని వాళ్లందరికీ సాయం చేద్దామని.

విజయవాడ రూమ్ కి నైట్ పన్నెండు గంటలకు చేరాము. టెర్రస్ మీద పడుకుని జరిగిన దరిద్రాన్ని తలుచుకొని నవ్వుకున్నాం బాగా. ఎందుకో ఆకాశం వైపు చూస్తే నా చుక్క పక్కన ఇంకో చుక్క వచ్చింది. ఫస్ట్ టైం ఇలా నా చుక్క పక్కన ఇంకో చుక్క అలా చూడటం.

వెంకట్ గాడికి చుక్క గురించి చెప్పి…,

“ఒకవేళ ఆ రెండో చుక్క శ్రావణి అనుకుంటరా” అని అన్నాను

“మన రూమ్ నుండి బస్టాండ్ ఎంత దూరం రా”

“మూడు కిలోమీటర్లు”

“ఆ మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ పో, అక్కడ హైదరాబాద్ కి వెళ్లే బస్సు లు ఉంటాయి”

“ఉంటే”

“బస్సు లో హైదరాబాద్ పో, అక్కడ ఎర్రగడ్డ హాస్పిటల్ ఉంటది నీలాంటి వాళ్ళ కోసం”

“నవ్విన నాపచేనే పండిద్ది గుర్తు పెట్టుకోరా వెంకట్ గా”

“మూసుకొని పడుకోరా కిట్టిగా” అని వాడు అటు తిరిగి పడుకున్నాడు. ఆ రెండు చుక్కల వైపు చూస్తూ తెలియకుండా నిద్రలోకి జారుకున్నాను.

ఉదయాన్నే ఏడు గంటలు, నా ఫోన్ రింగ్ అవుతుంది, నిద్రమత్తులో కట్ చేసిన, మళ్ళీ మళ్ళీ రింగ్ అయింది, ఎవరా అని చూస్తే ఏదో ల్యాండ్ లైన్ నెంబర్.

నిద్ర మత్తులో “హలో” అన్నాను

“అన్నా నేను ఉష ని, కాయిన్ బాక్స్ నుండి చేస్తున్నా”

“ఏ ఉష, పి టి ఉష నా…”

“నిన్ను శ్రావణి కాల్ చేయమంది. పదిన్నరకు వాళ్ళ ల్యాండ్ ఫోన్ కి కాల్ చెయ్, నెంబర్ చెప్పింది.”

ఏం చెబుతుందో అర్థం అయ్యే లోపు “సరే ఎవరో వస్తున్నారు, తర్వాత చేస్తా” అని కాల్ కట్ చేసింది.

ఉలిక్కిపడి లేచా, ఏం జరిగిందో అర్థం కాలేదు. నిజమా కాదా అని ఫోన్ చెక్ చేశా, నిజంగానే ఫోన్ వచ్చిందా అని. కాల్ వచ్చింది. వెంటనే వెంకట్ గాన్ని లేపుతుంటే, వాడు విసుక్కుంటున్నాడు…

“అరేయ్ లేరా, శ్రావణి నన్ను ఫోన్ చేయమని చెప్పింది అంటరా…”

“నేను నమ్మను రా”

“నేను కూడా నమ్మలేదు రా”

"మరి నమ్మనప్పుడు పడుకోబే"

"చూడు బే, కాయిన్ బాక్స్ నుండి ఉష ఫోన్ చేసి చెప్పింది."

"అయినా ఆ పిల్లకి ఏమైనా మెంటలా నిన్ను కాల్ చేయమనడానికి"

"నాకు అదే డౌట్ రా, ఈ దొంగ ముండ ఉష నన్ను వేర్రోడి ని చేయాలని డిసైడ్ అయినట్టు ఉంది. కానీ ఒకవేళ నిజం అయితే"

"ఒకసారి ఆ టైం కి కాల్ చెయ్, నీ ఫోన్ నుంచి"

"వద్దులే, ఒకవేళ అది నన్ను ఇరికిస్తుంది ఏమో. కానీ ఒకవేళ చుక్క థియరీ నిజమైతే. ఆహా, ఇప్పుడు అర్థమైంది రా, నీకు రాత్రి చుక్క థియరీ చెప్పగా, నువ్వు నన్ను ఎర్రిపప్ప చేయడానికి, ఆ ఉష తో కలిసి స్కెచ్ వేశావా?"

"నేను చాలా సార్లు చెప్పా, స్పెషల్ గా నిన్ను ఎవరు ఎర్రిపువ్వునీ చేయక్కర్లేదు, నిన్ను నువ్వే ఎర్రిపువ్వుని చేసుకుంటావు అని."

"హా, నువ్వు మరి తెలివైన మొగ్గ, నేను ఎర్రిపువ్వు, అవే తగ్గించుకో. ఈ సమాజంలో ఎవరిని నమ్మలేకపోతున్నాను రా. నమ్మక ద్రోహం చేసే వాళ్ళు ఎక్కువ ఉన్నారు రా."

"ఒరేయ్, నమ్మకద్రోహం గురించి మాట్లాడే అర్హత నీకు లేదురా, పైగా నీకున్న ఆ తెలివితేటలకు, ఎప్పుడూ కుదిరితే అప్పుడు మిత్రద్రోహం చేసే నువ్వు  సమాజాన్ని నిందించావు చూడు, నీకు, నీ ఒక గ్రాము బుర్రకి దండం రా దూత."

"అయితే ఇందులో నీ హస్తం లేదు అంటావు."

"నా హస్తమే కాదు, నీ చెవిలో పువ్వు కూడా లేదు."

"స్నేహం అంటేనే అనుమానం రా, స్నేహితుడిని అనుమానించనివాడు అసలు నిజమైన స్నేహితుడు కాలేడురా అందుకే అనుమానించా..."

"ఒరేయ్ నీకు దండం రా, తిక్క తిక్క కొటేషన్ లు ఆపురా, తనకి ఫోన్ చెయ్, నీకు అర్థమవుతుంది"

"ఏందీ అర్థమయ్యేది, తేడా వస్తే మా ఇంట్లో మా నాన్న నరుకుతాడు"

"ఒక పని చెయ్ కాయిన్ బాక్స్ నుండి చెయ్, నువ్వు ఎవరో తెలియదు కదా."

"సెంటర్ కి వెళ్దాం, తొమ్మిదింటికి కల్లా వెళ్ళి టిఫిన్ తిందాం, కాల్ చేద్దాం."

సమయం పదిన్నర, కాయిన్ బాక్స్ నుండి కాల్ చేశా. రింగ్ అవుతుంది, కానీ తీయలేదు. మళ్ళీ చేశా.

ఈసారి తన గొంతుతో "హలో" అనగానే నా మనసుకు తెలియని హాయి కలిగింది.

"ఏంటి కాల్ చేయమన్నావా?" అని అడిగాను

కాల్ కట్ చేసింది. నేనేమో ఎర్రోడి లాగా, కాల్ కట్ అయింది అనుకోని మళ్ళీ కాల్ చేశా, తను ఫోన్ ఎత్తి మళ్ళీ కట్ చేసింది "హలో" అనగానే.

మళ్లిచేశా, ఈసారి వాళ్ళ నాన్న ఎత్తి...

“ఎవడ్రా నువ్వు”

“నేనా, హీరో” అని  కాల్ కట్ చేశా…

“ఏమైంది ?”

“హీరోయిన్ వాళ్ళ బాబు గాడు ఎత్తాడు రా, ఎవడ్రా నువ్వు అన్నాడు”

అదే టైం లో ఆ కాయిన్ బాక్స్ రింగ్ అయింది.

వాళ్ళ బాబే అనుకోని, వెంకట్ గాడు ఎత్తాడు

“ఈ నెంబర్ నుండి కాల్ వచ్చింది ఏ ఊరు అండి”  అనగానే,

“ఇల్లే కోయంబతూరు కేరళ కర్ణాటక నే…, కాల్ కట్ చేసుడి”  అని కట్ చేశాడు.

“ఒరేయ్ నీకు ఆ పిల్ల ఎందుకు కాల్ చేస్తుంది రా. ఆ పిల్ల కి సైట్ కొట్టేవాళ్ళలో అత్యంత పనికిమాలినోడు, పరమ దుర్మార్గుడు, పరమ పాపి, మిత్ర ద్రోహి నువ్వేరా”

“నిజమేరా, ఉషకి నేనంటే ఏంటో చూపిస్తా, ఉషోదయం లేకుండా చేస్తా ఆ పిల్లకి”

“ఆ పిల్ల నోరు అసలే మంచిది కాదు, సరిగా లేని స్పీడ్ బ్రేకర్ లాంటిది,  ఏప్రిల్ ఫూల్ చేసిందనుకొని వదిలేయ్”

“అంతేలేరా నాకు ఆత్మగౌరవం ఉండకూడదు అని అంటున్నావు”

“ఆత్మగౌరవం స్పెల్లింగ్ చెప్పరా ?”

“చూశావా చెప్పలేకపోతున్నావు, అది నీ దగ్గర లేదురా, ఇక పా, పోయి చదివి బాగు పడదాం.”

ఇద్దరికీ రెండు గ్లాసుల బియ్యం వండుకునే మేము, బాధలో నాలుగు గ్లాసుల బియ్యం పోశాను. కడుపు నిండా తిన్నాక, కంటి నిండా నిద్ర వచ్చింది. బిర్రుగా తిని, గట్టిగా కళ్ళు మూసుకున్న కొన్ని నిమిషాల తరువాత...!

మళ్ళీ కాయిన్ బాక్స్ నుండి ఉష...

“హలో అన్నా”

“ఒసేయ్, బొద్దింక కళ్ళ మొహం దాన, ఇంకోసారి నాకు కాల్ చేస్తే, నిన్ను గాల్లోకి ఎగరేసి ముడ్డి మీద తంతానే.”

“నన్ను తరువాత గాల్లోకి ఎగిరేద్దువు గాని, ఇదిగో శ్రావణి కి ఇస్తున్నా, మాట్లాడు” అని నిష్టూరంగా అంది.

“శ్రావణి కా...! నిజంగా”

“హా .. మాట్లాడు”

“హలో”

“హలో” అని తన మాట వినగానే, వెంకట్ గాన్ని దగ్గరికి పిలిచి వాడి చేతిని కోరికా, నిజమా కాదా అని, నిజమే అని అర్థమైంది.

“నిజంగా నువ్వేనా”

“హా, పొద్దున్నే నువ్వు కాల్ చేసినప్పుడు నాన్న ఉన్నాడు, ఎలా చెప్పాలో అర్థం కాలా.”

“నిజంగా నువ్వు నాతో మాట్లాడుతున్నావా”

"మాట్లాడుతున్నాను గా, ఏమైంది నీకు"

"అంటే నాకెందుకు కాల్ చేశావా అని"

"హా, మీ నాన్నకి కోడల్ని అవ్వాలని..."

"ఏమన్నావు?"

"నువ్వు ఏం విన్నవో అదే అన్నాను"

"అయ్యో... అయితే నువ్వు కూడా నన్ను లవ్ చేస్తున్నావా?"

"అందుకే కదా ఇప్పుడు నీతో మాట్లాడుతుంది" అని సిగ్గుతో నవ్వుతో మాట్లాడుతుంది.

"కలలో ఉన్నట్లు ఉంది."

"ఎందుకు అలా"

"విచిత్రాన్ని, అద్భుతాన్ని నమ్మటానికి కొంత సమయం పడుతుంది శ్రావణి "

"మళ్లీ పిలువు"

"ఏమని"

"నా పేరును"

"నా గొంతు అంత బాగుందా"

"నువ్వు హీరోవి అని మా నాన్నతో అన్నావుగా, ఆ హీరో గొంతుతో నా పేరు పిలవడం బాగుంది."

"శ్రావణి శ్రావణి శ్రావణి....."

“ఓయ్, మళ్ళీ చేస్తాలే, ఎవరో వస్తున్నట్టు ఉన్నారు, బాయ్…”

“సరే శ్రావణి”

“ఒరేయ్ వెంకట్ గా, ఆ పిల్ల పడింది రో, చుక్క నిజమేరో…”

“నీకు పడిందరా ఆ పిల్ల…! చా, అయిన కలికాలంలో ఇలాంటి వింతలే జరుగుతాయి రా…”

“అవునా, ఇది కలికాలం కాదురా, నీ లాంటి సింగిల్ గాళ్ళు అందరూ కుళ్లుకునే కాలం…!”

**ఆ విధంగా మొదలైంది, ఒక నిబ్బా నిబ్బిలా రెండు చుక్కల కథ…!**

**********

# 8

# ప్రేమ పలుకులు

లక్షల్లో మాటలు, కోట్లలో ఫీలింగ్స్...

ఎలా మొదలు పెట్టామో గుర్తులేనన్నీ మాటలు...,

హాయ్ దగ్గరనుండి ఏమే దాకా, ఓయ్ దగ్గర నుండి పోవే దాకా,

నువ్వు ఏంచేస్తున్నావే దగ్గరనుండి, దొంగముండా ఏంచేస్తున్నావు దాకా,

నిద్రలేచావా అని అడిగే నుంచి కూర్చోవటం అయిపోయిందా అనే దాకా,

బాగున్నావు అనే దగ్గరనుండి నిన్ను ఏదైనా చేయాలనిపిస్తుందే అనే దాకా,

బుజ్జి బంగారం ప్లీజ్ సారీ థాంక్స్ ఎన్నో ఎమోషన్స్...!

ఊర్లో ఏ టాపిక్ జరిగిన, ప్రపంచంలో దేని గురించి మాట్లాడినా, ఆ విషయాలు మా మాటల్లో నలగాల్సిందే. మాటలు కోటలు దాటుతాయంటారుగా, కానీ మా మధ్య మాటలు కోటలు మాత్రమే

కాదు, సముద్రాలు, ఖండాలు అంతెందుకు గ్రహాలు కూడా దాటాయి.

తనతో మాట్లాడిన ప్రతి మాట అదొక అద్భుత పూల తోటలో పూసినట్టు ఉంటుంది. తనతో మాట్లాడకపోతే పూట గడిచేది కాదు. ఇద్దరం ఎంత పనిలో ఉన్నా, ఎక్కడ ఉన్నా, ఏంచేస్తున్నా, ప్రతిపూట చిన్న మాట అయినా ఉండాల్సిందే. కొన్ని సార్లు రోజు మొత్తం మాటలే. కొన్నికొన్ని సార్లు మాటలు లేక చెప్పు, నువ్వే చెప్పు, హా నువ్వు చెప్పు అనే పదాలే గంటల కాలక్షేపాలు.

తనతో మాట్లాడుతుంటే తనువు పులకరించేది. తనని చూస్తున్న ప్రతిక్షణం పున్నమి వీధుల్లో తిరుగుతున్నట్టు ఉండేది.

ఇక తనని చూస్తూ, మాట్లాడుతూ ఉంటే, ఎంత వర్ణించిన, ఏమని వర్ణించిన అది తక్కువే. తనతో గడిపిన ప్రతి క్షణం లో ప్రపంచం చాలా చిన్నదిగా కనిపించేది.

తన మెసేజ్ తోనో, కాల్ తోనో నిద్ర లేచేవాడిని. తను వాళ్ళ ఇంట్లో ఉన్నప్పుడు కూడా నాతో మాట్లాడటం మానలేదు. కాకపోతే గర్ల్ ఫ్రెండ్ తో మాట్లాడినట్టు మాట్లాడేది.

తనంటే నాకు ఎంత ఇష్టమో, తనకి నా మీద ఉన్న ఇష్టం ఎక్కువలాగ అనిపించేది. తనతో మాటలు ఎన్ని ఉన్నాయో, అంతకంటే ఎక్కువ ఎమోషన్స్ ఫీలింగ్స్ ఉన్నాయి.

వెంకట్ గాడు ఎప్పుడూ అంటుండేవాడు నీ దరిద్రపు జీవితంలో ఉన్న అదృష్ట దేవత రా ఆ పిల్ల, పోగొట్టుకోకు అని...! అలాంటి పిల్లతో మాట్లాడిన ప్రతి మాట, తనతో కలిసి చేసిన ప్రతి పని, తిరిగిన ప్రతి ప్రదేశం గురించి చెప్పాలంటే పుస్తకాలు సరిపోవు, పైగా మీకు వినేంత సమయం కూడా ఉండదు కాబట్టి నాకు గుర్తుకువస్తున్న కొన్ని విషయాలు నీతో పంచుకోవాలి అని అనుకుంటున్నాను.

**********

# 9

# ప్రేమ చూపులు

నేను ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రోజు వచ్చింది. తనను చూడడానికి వెళ్తున్నాను. తనని ఇంతకుముందు చాలాసార్లు చూశాను కానీ తను నా ప్రేమని ఒప్పుకున్న తర్వాత, తనే నన్ను చూడాలని ఉంది అని అన్నాక తనని చూడబోతున్నాను.

పగలు పదకొండు గంటల ముప్పై నిమిషాలకు తన ఇంటి వైపు రమ్మంది. తను నన్ను అడిగింది నీకు ఏ కలర్ అంటే ఇష్టం అని అడిగింది, నేను అన్నాను నీకు నచ్చినట్టు రా అని, ఎందుకంటే, శ్రావణి ఎలా ఉన్నా నాకు నచ్చుతుంది.

ఆరోజు నిజానికి ఏ పండగ కాదు, కానీ ఊరు మొత్తం రంగులు అద్దుకున్నట్లు ఉంది. ఎండకి కూడా వెన్నెల కాస్తున్నట్టు ఉంది. గుండె తన వేగానికి మించి కొట్టుకుంటుంది. నా వంటిలో ఉన్న ప్రతి అణువుకు హార్ట్ ఎటాక్ వచ్చినట్టు ఉంది.

తను చెప్పిన టైం కి వాళ్ళ వీధిలోకి వచ్చాను. తను ఇంటి బయటకి వచ్చింది. సిగ్గు, బిడియం, ప్రేమ, తపన తన మొహం

లో తెలుస్తున్నాయి. తను నా వైపు నడుస్తూ వస్తుంది. నేను తన వైపు నడుస్తూ ప్రపంచాన్ని మర్చిపోయాను.

తన రాకతో నా ఎదలో గుడి వెలిసింది, అందులో తనని ప్రతిష్టించాను. ఈ క్షణాలు ఎంతో మధురంగా ఉన్నాయి. తన గురించి కవితో, పాటో ప్లే అవుతుంది నా హృదయంలో.

నీ మోములో వెన్నెల జాబిలి కనబడుతుంది, నీ నడకలో సముద్రపు అంచులలో కెరటాలు ఎగిసి పడుతున్నాయి.

నీ నవ్వులో నా సంతోషం ఉంది.

గాలిలో ఎగిరిపోతున్న నీ కురులు ఆకాశాన ప్రయాణిస్తున్న నల్లటి మేఘాలు లాగా ఉన్నాయి.

నీ చూపులో వేయి కాంతుల వెలుగు మెరుస్తుంది.

నీ అందమే తీరం లేని సంద్రమే సంద్రమే..

నువ్వు నా దగ్గరకు వస్తున్న కొద్దీ, మధుర క్షణాలు మన గుండెల్లో మందహాసం చేస్తున్నాయి. **నువ్వు నన్ను దాటుతున్న క్షణం నీ ఊపిరి నా శ్వాసలో చేరింది.**

మన చూపులతోనే మాట్లాడుకునే మాటలు ఒకరికొకరికి వినిపిస్తున్నాయి. కొన్ని క్షణాలకున్న విలువ అర్థమవుతుంది.

తన నీడ నన్ను తాకగానే మా దారులు కలిసి, మేమిద్దరం ఒకరి దారిలోకి ఒకరు వెళ్ళాము.

ఏదైనా తన ప్రేయసి ప్రేమ ఒప్పుకున్నాక మొదటిసారి తనని చూసేటప్పుడు ఉండే ఫీలింగ్స్, తను నాదే అనే గర్వం ఉంటుంది చూడు...! నీకు అలాంటి అనుభవం ఉంటే గుర్తుతెచ్చుకొని సంతోషపడు...!

**********

# 10

# ప్రేమ చుక్కలు

ఇంటర్ పాస్ అయ్యాక తనని వాళ్ళ నాన్న ఇంజనీరింగ్ చదివించాలని ఒక కాలేజీలో జాయిన్ చేశాడు. ఐదారు గంటలు ప్రయాణం తన కాలేజీ కి.

**తను కాలేజీ కి వెళ్ళడానికి ముందు రోజు...**

“నీతో మాట్లాడాలి.”

“ఇప్పుడు మాట్లాడుతున్నావుగా.”

“ఆ, అలా కాదు, డైరెక్ట్ గా మాట్లాడాలి”

“ఎలా కుదురుతుందే, రేపు నువు వెళ్తావు, ఊర్లో మాట్లాడలేను, ఎవరైనా చూస్తే బాగోదు. అయినా కాలేజీలో జాయిన్ అయ్యాక వస్తాలే చూడడానికి.”

“నాకు తెలియదు, ఈ రోజే మాట్లాడాలి. నీకు ఒకటి చెప్పాలి.”

“ఎలా కుదురుతుందే. మీ ఇంటికి రావటం ఒక్కటే దారి.”

“అయితే రా మరి.”

“ఎవరైనా చూస్తే నన్ను కుక్కని కొట్టినట్టు కొడతారు.”

“రాత్రి పన్నెండు తర్వాత రా, నేను డాబా మీద ఒక్కదాన్నే ఉంటాను.”

“మీ అమ్మ, బాబు, వదిలేశారేంటే ?”

“నాన్న బాబాయ్ వాళ్ళ ఇంటికి వెళ్ళారు ఫంక్షన్ ఉందని, రేపు పొద్దున్నే వస్తారు. అమ్మ డాబా పైన పడుకోదు. నేను ఒక్కదాన్నే ఉంటా. జాగ్రత్తగా రా, ఒక్కసారి నిన్ను చూస్తా. ఒక విషయం చెప్తా, ఆ తర్వాత వెళ్ళు.”

“సరే, వస్తానే వస్తా.”

నాకు ఎప్పుడూ తనని చూడాలని ఉంటుంది. అలాంటిది తనే నన్ను చూడాలని అంటుంటే, అస్తమించే సమయాన రవి ఇచ్చే రంగు లాగా అందంగా అనిపిస్తుంది.

ఎవరైనా చూస్తారేమో అని చాలా భయంగా ఉన్న, ఆ భయాన్ని, తనతో డైరెక్ట్ గా మాట్లాడబోతున్న అనే ఫీలింగ్ డామినేట్ చేస్తుంది. సమయం పదకొండు గంటల 30 నిమిషాలు. బజారులన్ని నిశ్శబ్ధంగా ఉన్నాయి. దూరాన కుక్కల అరుపులు. సన్న వెన్నెలతో కూడిన నిశీధిలో నడుచుకుంటూ, వాళ్ళ ఇంటి దగ్గరకి చేరాను. వాళ్ళ ఇంటి వెనుక వైపు నుండి స్టెప్స్ ఉన్నాయి. అవి ఎక్కాలంటే ఆరు అడుగుల గోడ దూకాలి. దొంగలని ప్రేరణగా తీసుకొని మొత్తానికి గోడ దూకాను. చిన్నగా స్టెప్స్ పైకి ఎక్కాను.

ఎండాకాలంలో మామూలుగా చాలా మంది డాబాల మీద పడుకుంటారు, కానీ వాళ్ళ ఇంటి పక్కకి మూడు వైపులా రోడ్డు

మరియు ఖాళీ స్థలాలు. ఒక వైపు అప్పుడే కడుతున్న ఇల్లు. అందువలన మమ్మల్ని గమనించే అవకాశాలు చాలా తక్కువ.

తను డాబా మధ్యలో మంచం వేసుకొని పడుకుంది. వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంది మాట్లాడుకోవడానికి అనుకూలంగాను ఉంది. చాలా నిశ్శబ్దంగా ఉంది. చిన్నగా గాలులు వీస్తున్నాయి. చిన్నగా మంచం దగ్గరికి వెళ్ళాను. తను ఒక పక్కకి తిరిగి దుప్పటి కప్పుకొని ఉంది, మొహం మాత్రమే కనబడుతుంది. తన మొహం, ఆ రోజు ఆకాశంలో పూర్తిగా కనపడని చందమామ, తన మోములో మాత్రం నిండుగా కనిపిస్తుంది.

చిన్నగా పిలిచా "శ్రావణి శ్రావణి..." తను లేవట్లేదు. పడుకుందేమో అని అనుకొని వెళ్లబోతుంటే, అప్పుడు...

"బావ" అని చిన్న పిలుపు.

ఆ బావ అనే తన నోటి పిలుపుకి, ఒళ్ళు పులకరించింది, కోటి కవితలు, లక్ష పాటలు నా చెవులకు మనసుకు ఇవ్వలేని సంతోషాన్ని, ఆ పిలుపు ఇచ్చింది. ఇంతకు ముందు తనని చాలాసార్లు అడిగా బావ అని పిలవవే అని, సిగ్గుతో పిలవలేదు.

చిన్నగా తన దగ్గరకి వెళ్ళాను. నేను కింద కూర్చుని, చేతులు మంచం మీద ఉంచి, నా మొహాన్ని అరి చేతుల మీద ఉంచి తనని చూస్తూ కూర్చున్నా.

**ఇక గుస గుసలు మొదలయ్యాయి.**

"ఏంటి అలా చూస్తున్నావు"

“ఇప్పుడు ఏమని పిలిచావు”

“నీకేమి వినబడిందో అదే పిలిచా..! ఏం వినపడలేదా”

“వినపడింది కానీ, మళ్ళీ వినాలని ఉంది.”

“బావా...”

“మళ్ళీ అను”

“బావ బావా బావా...”

“నువ్వు నన్ను బావ అంటుంటే నా జీవితం ధన్యమైనట్టు ఉందే”

“హ హ, అయిన పనోడిలా కింద కూర్చున్నావు ఎందుకు?”

“నేను ఎప్పటికీ నీ పనోడినే కదే...”

“చాలులే గాని రా మంచం మీద పడుకో.”

“బాగోదు లేవే, వద్దులే.”

“తను కప్పుకున్న దుప్పటి తీసి, రా పడుకో, నీకు ఒకటి చూపిస్తా.”

“ఏం చూపిస్తావే.”

“ముందు వచ్చి పడుకో.”

“మంచం చిన్నది అవటం వల్ల ఇద్దరికీ ప్లేస్ సరిపోవట్ల. తను నా చేతి మీద పడుకుంది. ఇద్దరం ఆకాశం వైపు చూస్తున్నాం. తన సువాసన నాకు తెలుస్తుంది. తన స్పర్శ నాకు ప్రేమని చూపుతుంది. ఎన్నో ప్రేమ అనుభూతులని కలిగిస్తుంది.

“అక్కడ రెండు చుక్కలు కనపడుతున్నాయి కదా, అవి నేను కొన్ని రోజుల నుండి చూస్తున్నా, అవి కలిసి ఉంటున్నాయి. అన్ని

చుక్కలు మాయమవుతున్నాయి ఎప్పుడు పడితే అప్పుడు, కానీ ఆ రెండు చుక్కలు ఒకేసారి వస్తున్నాయి, ఒకే సారి పోతున్నాయి. చూడు ఒకసారి."

"హా అవును. ప్రేమ చుక్కలేమో మనలాగా."

**తను మొహం నా వైపు తిప్పింది. తన మొహం అంత దగ్గరగా చూడడానికి నా రెండు కళ్ళు సరిపోవటం లేదు.**

"ఇంత అందంగా ఎలా పుట్టావే."

"నేను అంత అందంగా ఏమి లేను, నీకు అలా కనపడుతున్నానేమో."

"ఎందుకు రమ్మన్నావే అసలు ఈ టైం లో."

"హా హా.. చెప్తాలే ఆగు."

"ఒకసారి ఆ చుక్కల అమరిక చూడు, ఎంత బాగుందో."

"ఇంతకూ ముందు నేను కూడా పైన ఉన్న చుక్కలని చూసేవాడిని, నిన్ను చూశాక, ఆ చుక్కలు నాకు మరి అంత అందంగా కనపడట్లేదు. పైన ఉన్న చుక్కల కంటే నా పక్కన ఉన్న చుక్క చాలా అందంగా ఉంది."

"చేతులతో మొస్తున్నావుగా, మాటలతో మోయామాకు బావా."

"ఆహా, ఇక నా జీవితానికి ఏం వద్దే. ఇన్ని సార్లు బావ అనమాకే, గుండె ఆగిపోద్ది, అసలే మా అయ్యకు ఒక్కడే కొడుకుని."

"నేను కాలేజీకి వెళ్తున్నా అని, మా నాన్న కొత్త ఫోన్ కొనిపెట్టాడు, మన ఇద్దరం ఒక ఫోటో దిగుదాం."

రెండు ఫోటోలు దిగాము. ఒకటి చుక్కలని చూస్తూ, రెండో ఫోటో చుక్కలతో కలిపి ఫోటో.

ఆ తరువాత, తను మంచానికి ఆనుకొని కూర్చుంది. నేను తన కాళ్ళ మీద పడుకొని ఆకాశం వంక చూస్తున్నాను. తను, వరుసగా ముచ్చట్లు చిన్నగా చెప్తూనే ఉంది. పూర్తిగా కనపడని ఆ చందమామ, మెరుస్తున్న చుక్కలు, తన కాళ్ళ మీద నేను, నా తల మీద తన చేతులు, అలా తను ముచ్చట్లు చెప్తుంటే, నాకు తనలో మా అమ్మ కనిపిస్తుంది.

కొంచెంసేపు నేను కూర్చుని ఉంటే, తను నా కాళ్ళ మీద పడుకుంది. కానీ ముచ్చట్లు మాత్రం తనే చెప్తుంది. మూడు గంటలు దాకా ఏవేవో మాటలు కొనసాగాయి. పల్లెటూరు కదా, 4 గంటలకు కొంతమంది నిద్ర లేస్తారు.

అందుకే, "ఇక వెళ్తాను" అన్నాను.

"కొంచెం సేపు ఉండొచ్చు కదా."

"ఉండాలని ఉంది, ఎవరైనా చూస్తే ఇద్దరికీ ఉంటుంది. సరేలే ఎందుకు రమ్మన్నావు."

"ఇంకా అర్థం కాలేదా...?"

"లేదుగా..."

"ఒకటి ఎప్పటి నుండో బావ అని పిలవమన్నా నేను పిలవలేదుగా, ఈ రోజు పిలిచాగా...

రెండు, ఫోటోలు తీసుకున్నగా నా గుర్తు కోసం...

మూడు, నీ వొళ్ళో పడుకొని ఐ లవ్ యూ చెప్పాలని."

"అది ఎప్పుడూ చెప్పావే? చెప్పలేదుగా ఇంకా, చెప్పు చెప్పు ప్లీజ్ చెప్పవే."

**"ఐ లవ్ యూ బావ"** అని సిగ్గుతో చెప్పినప్పుడు ఒక్క క్షణం ఊపిరి ఆగి మళ్ళీ వచ్చింది.

తన వైపు చూస్తూ **"ఐ లవ్ యు నే."**

"ఓయ్ పైకి చూడు, చందమామ మనల్ని చూస్తుంది బావ..."

"ఆ మామ చూస్తే ఏం కాదులే, కానీ మా మామ అదే మీ నాన్న చూస్తే, జరిగేది నాకు పెళ్ళే..."

"ఏం కాదులే, నాకే ఇచ్చి చేస్తాడులే..."

"హ హ...!"

"హా..."

"సరే వెళ్ళాలి, నువ్వు కాలేజీకి వెళ్ళాక కలుస్తాలే."

చిన్న కొంటె నవ్వుతో, నిద్ర మొహం తో, అమాయకంగా "సరే" అని తన సైగ ఇప్పటికి నా మనసులోనే ఉంది.

**మూడు గంటలు తనతో ఉన్నాను ఆరోజు రాత్రి. చుట్టూ ఎవరూ లేరు. సమయం ఎలా గడిచిందో తెలియదు, మాటలతో గడిచిపోయింది, ప్రేమలతో నిండిపోయింది. సగం చందమామ సాక్ష్యంతో, చుక్కలతో కలిసిపోయింది.**

**ఇది ఇంటర్వెల్ అనుకోని కొంచెం గ్యాప్ ఇవ్వు చదవడానికి...!**

**********

# 11

# రెయిన్ బో పిల్ల

తన కాలేజీ కి సెలవులు ఇచ్చారు, ఇంటికి వెళ్ళడానికి తోడు రమ్మంది. నేను వర్క్ చేస్తున్న ప్లేస్ నుండి నాలుగు గంటలు జర్నీ. మిడ్ నైట్ బస్సులో జర్నీ. ప్రయాణం మొదలైంది. ఉదయం ఎక్కువ వర్క్ ఉండటం వల్ల పడుకున్నాను. తనని నిజంలో చూడకముందే నా కలలోకి వచ్చింది.

తన కాలేజీ ఉన్న ఊరిలో ఉదయం ఐదింటికి దిగాను. నేను ఒక చిన్న కవర్, దాంట్లో ఒకజత బట్టలు మాత్రమే తీసుకెళ్ళాను. లెస్ లగేజ్ మోర్ కంఫర్ట్ అని నా ఫీలింగ్. బస్టాండ్ లో ఫ్రెష్ అప్ అయ్యాను. ఉదయం ఆరు ఇంటికల్లా వెంకటేశ్వర స్వామి గుడి దగ్గరకి వచ్చాను. తన హాస్టల్ నుండి రైల్వే స్టేషన్ కి వచ్చే దారిలో ఉంటుంది.

తనకి మెసేజ్ చేశాను. గుడి దగ్గర ఉన్నాను అని. తను రిప్లై ఇచ్చింది ఆటోలో ఉన్నాను, రెండు నిమిషాల్లో వస్తా అని మెసేజ్ చేసింది. గుండె వేగం పెరిగింది. తనని చూడటం అంటే నాకు బాగా ఇష్టం. అదొక వ్యసనంలా అయింది నాకు.

అప్పుడే రవి తన కిరణాలతో ఉదయిస్తూ ఉన్నాడు. తను ఆటో దిగుతుంది. పర్పుల్ డ్రెస్ లో చాలా మెరుస్తుంది. తను ఒక బ్యాక్ ప్యాక్ తగిలించింది. కాంతి కిరణాలు తన మీద పడుతుంటే, దివిలోని తారక మెరిసినట్టు మెరుస్తుంది.

గుడిలో గంటలు మోగుతున్న సమయంలో నన్ను చూసి నవ్వుతూ చెయ్యి ఊపింది. తన నవ్వుకి నా మనసులో గంటలు మోగినట్టు ఉంది. తను దగ్గరకి వస్తున్న కొద్ది, అలంకరించిన దేవతలా అనిపిస్తుంది. పర్పుల్ టాప్, పర్పుల్ చున్నీ, పర్పుల్ పాంట్ ఇలా పర్పుల్ డ్రెస్ లో మొదటిసారి తనని చూడడం.

తను భలే పద్ధతిగా రెడీ అవుతుంది. ఎప్పుడు పంజాబీ డ్రెస్సులు చున్నీ వేసుకుంటుంది.

తను చిన్నగా రోడ్ క్రాస్ చేసి నా దగ్గరికి వచ్చింది. నాకు తెలియకుండానే తన బ్యాగ్ లో నా చేతిలో ఉన్న కవర్ పెట్టేశాను. రవి ఉదయానికి, శ్రావణి అందం మరింత ఉదయానిచ్చింది. తన మ్యాజిక్ కి, నా మనసులో ఏదో మ్యూజిక్ స్టార్ట్ అయింది. మాటలు రావట్లేదు.

తను నా దగ్గరికి వచ్చి కళ్ళు ఎగరేసి ఎలా ఉన్నాను అని సైగ తో, చిన్న నవ్వుతో అడిగింది. నేను కూడా అద్భుతంగా ఉన్నావు అని సైగలతోనే చెప్పాను. తను నా చేయి పట్టుకొని గుడిలోకి తీసుకొని వెళ్ళింది. తను వాళ్ళ ఫ్రెండ్స్ రెగ్యులర్ గా ఆ గుడికి వెళ్తారు. తనతో పాటు అడుగులు వేస్తుంటే, ఏడు అడుగులు ఎప్పుడు వేస్తానా అని కుతూహలంగా ఉంది.

ఇద్దరం గుడిలోకి వెళ్ళాం. చిన్న క్యూ, తను ముందు, నేను వెనుక. మధ్య మధ్యలో నన్ను చూస్తుంది నవ్వుతూ ఉంది. ఏదో చెప్తుంది కానీ అర్థం అవ్వడం లేదు నాకు. తనని చూసిన ఆనందంలో నేను ట్రాన్స్ లోకి వెళ్ళాను. గుడి చుట్టూ పదకొండు ప్రదిక్షణాలు చేశాము. నాకు బొట్టు పెట్టి తను కూడా పెట్టుకుంది. అక్కడే గుడిలో కూర్చున్నాము. తను ఏదో చెప్తుంది కానీ ట్రాన్స్ లో ఉండటం వల్ల నాకు అర్థం కావడం లేదు. చిన్నగా చెంప మీద ఒకటి ఇచ్చింది. ట్రాన్స్ లో నుండి బయటకి వచ్చాను.

"ఏంది రా, ఏం మాట్లాడటం లేదు"

"నువ్వు పర్పుల్ డ్రెస్ లో పవర్ఫుల్ గా ఉండటం చూసి షాక్ లో కి వెళ్లాలే…"

"డ్రెస్ అంత బాగుందా?"

"డ్రెస్ కాదు డ్రెస్ లో నువ్వు బాగున్నావు."

"కథలు చెప్పకు"

"కథలు కాదు కవితలు వస్తున్నాయి నిన్ను చూస్తుంటే."

"ఏం కవిత వస్తుందేంటి బావ గారికి ఇప్పుడు" అని కొబ్బరి చిప్ప పగలగొడుతూ అడిగింది.

"కొబ్బరి లాంటి నీ నవ్వు, కొబ్బరి లౌజ్ లాంటి నీ ముక్కు, కొబ్బరిపాల లాంటి నీ బుగ్గలు, కొబ్బరి టెంక పదునుతో నీ కళ్ళు, కొబ్బరి నీళ్ళు ఆరోగ్యానికి ఎంత మంచిదో, నువ్వు నా పక్కన ఉంటే నాకు అంత మంచిది. అసలు ఈ గుడి శ్రీ వెంకటేశ్వర స్వామి గుడిలా కాదు, నా దేవత అయిన శ్రావణి గుడి లాగా ఉంది.

“ఆహా, ఇక కొబ్బరి పురాణం ఆపరా ప్లీజ్. నువ్వు పొగుడుతుంటే సిగ్గు గా ఉంది.”

“ఎందుకో నిన్ను చూసినా, తలిచినా నాకు ఏదో అయిపోతుందే...”

“హా హా, అవును మనం ఇంటికి ఎన్నింటికి వెళ్తాము.”

“మామూలుగా వెళ్తే, ఆరు గంటలు.”

“మామూలుగా వెళ్లకపోతే?”

“అర్థం కాలేదు.”

“ఇంట్లో అమ్మ నాన్న లేరు, ముందు వెళ్లినా ఒక్కదాన్నే, అందుకే చిన్నగా సాయంత్రానికి వెళ్ళేటట్లు జర్నీ చేద్దాం.”

“అయితే రైల్వే స్టేషన్ కి వెళ్ళి ట్రైన్ ఎక్కుదాం.”

“నీకు తెలుసా నేను ఇంతవరకు ట్రైన్ ఎక్కలేదు.”

“పద ఇప్పుడు ఎక్కుదాం.”

ఇద్దరం కలిసి నాలుగు గంటల జర్నీ నీ, పన్నెండు గంటలు ఎలా చేయాలో డిసైడ్ అయ్యి బయలుదేరాం.

రెండు గంటల ట్రైన్ జర్నీ, సైడ్ లోయర్ అండ్ అప్పర్ స్లీపర్ టికెట్స్ దొరికాయి లక్కీ గా. ఇద్దరం లోయర్ బెర్త్ లో కూర్చున్నాం. ట్రైన్ కదిలింది. తను చాలా సంతోషంగా ఉంది.

“ఫస్ట్ టైమ్ ట్రైన్ ఎక్కాను, పైగా నీతో, బాగుంది.”

“నేను ట్రైన్ చాలా సార్లు ఎక్కాను కానీ, ఎప్పుడు పెద్దగా ఫీల్ అయింది లేదు. మొదటి ట్రైన్ ప్రయాణం అప్పుడూ కూడా. నేను

వెంకట్ గాడైతే టికెట్ లేకుండా కూడా జర్నీ చేశాం. కానీ నీతో ఈ రైలు ప్రయాణం నాకు కొత్తగా ఉంది. నువ్వు పక్కనుంటే ఎడారి అయిన నాకు సరస్సులు లాగా అనిపిస్తుంది.”

“ప్లీజ్ రా, కవిత భాషలో నుండి బయటకి వచ్చి నీ భాషలో మాట్లాడు ఇక.”

“సరే నీ ఇష్టం రాణి గారు, ట్రైన్ జర్నీ ఎంజాయ్ చెయ్.”

గాలికి ఎగురుతున్న తన కురులు, ఆ కురులను సరి చేసుకుంటున్న తన చేతులు, విండోలో నుండి తన చూపు పడుతున్న ప్రదేశాలు, అప్పుడే విరుస్తున్న రెయిన్ బో, సీన్ మాత్రం నాకు భలే ఉంది. తననే చూస్తున్నా.

“అలా చూస్తున్నావు ఏంటి”

“నిన్ను తొందరగా పెళ్లి చేసుకోవాలని ఉందే”

“ఏం చేస్తావేంటి.”

“చేసేవన్నీ పెళ్ళి తరువాతలే.”

“హ హా...“

“మరెందుకు అలా దొంగ చూపులు”

“ఈ దొంగ చూపులు నిన్ను చిన్నపాటి నుండి చూస్తున్నా కానీ, ఈ రోజు ఇంకొంచెం స్పెషల్ గా కనిపిస్తున్నావు.”

“నువ్వు కొనిచ్చిన డ్రెస్ కదా, ఉదయం మా ఫ్రెండ్స్ కూడా అన్నారు, నీకు ఈ డ్రెస్ మ్యాచ్ అయినట్టు ఏ డ్రెస్ అవ్వలేదని. నేను

చిన్నప్పటి నుండి ఎప్పుడు పర్పుల్ డ్రెస్ వేసుకోలేదు, కొనలేదు. ఒక సారి ఇటు రా…”

“ఏంటి…? “

“నీ చెవి దగ్గరకి పెట్టు…”

“హా చెప్పు అంత సీక్రెట్ ఏంటి…?”

“నేను ఇప్పటివరకు పర్పుల్ డ్రెస్ మాత్రమే కాదు పర్పుల్ డ్రాయర్ కూడా వేసుకోలేదు. నీకు ఎలా తెలుసు నాకు ఇలాంటి కలర్ డ్రెస్ లేదని.”

“నేను నిన్ను చిన్నప్పటి నుండి చూస్తున్నా, ఎప్పుడూ ఈ కలర్ వేసుకున్నట్టు అనిపించలేదు. కళ్ళతో ఊహించా ఎలా ఉంటావో అని, బాగుంటావు అనిపించింది.”

“అవునా, ఇంకా ఏం ఊహించావు”

“ఊహించినవి అన్ని చెప్తే తిడతావులే కానీ”

“ఎందుకు తిడతా”

“డర్టీ థాట్స్ లేవే వదిలేయ్.”

“ఏంటి…?”

“ఏం లేదులే కానీ బ్యాగ్ లో ఏమి ఉన్నాయి. కొంచెం బరువుగా ఉంటే.”

“ఏముంటాయి, అన్ని డ్రెస్ లే.”

"అవును కొలతలు అన్ని ఇస్తేనే, టైలర్ సరిగా కుట్టరు, అలాంటిది ఇంత పెర్ఫెక్ట్ గా ఎలా కుట్టించావు."

"నిన్ను చిన్నప్పటి నుండి చూస్తున్నాను ఆ మాత్రం తెలుస్తుంది లే..."

"అబ్బో..."

ఈ లోపు ట్రైన్ లో టీ వస్తే తీసుకున్నాం. తను టీ తాగుతూ, విండో నుండి రెయిన్ బోనీ చూస్తూ ఆనందపడుతుంటే, నేను టీ తాగుతూ, తనని చూస్తూ సంతోషపడుతున్నాను.

"కృష్ణా ఒకసారి రెయిన్ బో ను చూడు"

"చూస్తున్నా"

"నన్ను కాదురా, బయట ఉన్న రెయిన్ బో చూడు"

"నీకు ఆ రెయిన్ బో చూడాలనిపిస్తుంటే, నాకు ఈ రెయిన్ బో నీ చూడాలనిపిస్తుందే"

"ఎలాగ ఎలాగా..."

"రెయిన్ బో లో ఎన్ని రంగులు ఉంటాయి?"

"ఏడు, అయితే..!"

"నేను అంత కన్నా ఎక్కువ రంగులతో నిన్ను చూశాను."

"అర్థంకాలా...!"

"రెయిన్ బో లో ఉన్న రంగులలో మొదటిసారి నిన్ను ఎప్పుడు చూశానో తెలుసా?"

“చెప్పు చెప్పు ఎప్పుడు, ఎక్కడ, ఎలా చూశావు?”

“మొదటగా నేను చూసిన ఆరెంజ్ పిల్ల ఎలా ఉంటుంది అంటే...!”

“ఎలా ఉంటుంది ఏంటి?”

“రవి అస్తమించే చివరి నిమిషాల సమయాన్ని, నువ్వు పొలాల మీద నుండి చూసినా, కొండల మధ్యలో నుండి చూసినా, సముద్రం మీద నుండి చూసినా, అప్పటిదాకా ఎరుపెక్కిన సూర్యుడు, నీకు ఆ సమయంలో ఆరెంజ్ కలర్ లో కనిపిస్తుంది. ఆ సమయంలో ఆ వర్ణం అదొక అద్భుతంగా అనిపిస్తుంది. కానీ, నీ పెద్దమనిషి ఫంక్షన్ రోజు, నిన్ను మొదటిసారి ఆరెంజ్ ఓణి లో చూశాక, అప్పటివరకు నేను చూసిన ఆరెంజ్ అంటే అద్భుతం అనుకున్నా, నిన్ను చూశాక మహా అద్భుతం అనిపించింది.”

“అబ్బో, హా, ఇంకా...”

“ఎర్ర పిల్ల గురించి చెప్పనా?”

“చెప్పు వింటా...!”

“ఎర్రగా మండే సూర్యుడు, లోకంలో ఉన్న చీకటిని చెరిపేస్తూ, వెలుగును ఇస్తాడు. మొదటి సారి నిన్ను చినుకుల జల్లుల్లో చెట్టు కింద చూశాను. ఆరోజు నువ్వు ఎరుపు డ్రెస్ వేసుకొని ఉన్నావు. నిన్ను చూసిన ఆ క్షణం, ఆ సమయంలో నా మనసులో ఉన్న చీకటిని తొలగించి, వెలుగును ఇచ్చావు. లోకానికి వెలుగు నిచ్చిన సూర్యుని కంటే, నా మనస్సు కి వెలుగు నిచ్చిన నువ్వు నాకు గొప్ప.”

“మహానుభావా...”

"విడదీసి పలుకు"

"మహాను బావా... బావా..."

"ధన్యుడిని, ఇండిగో పిల్ల ఎవరో తెలుసా నీకు?"

"తెలియదు గా..."

"అయితే విను..! ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫైనల్ ఎగ్జామ్ రోజు నువ్వు వేసుకున్న కలర్ ఇండిగో. నీలం కాదు, కానీ నీలానికి దగ్గరగా ఉంటుంది. నేను కాలేజీలో నీ కోసం ఎదురు చూస్తున్నాను. సమయం ఉదయం ఎనిమిది అవుతుంది. నువ్వు ఆ రోజు మీ ఫ్రెండ్స్ అందరితో కలిసి వస్తున్నావు. నేను చిన్నప్పుడు మా ఇంటి ఆరుబయట పడుకొని ఆకాశాన్ని, చుక్కలని బాగా చూసేవాణ్ణి. కొన్నిసార్లు, అమ్మ పక్కన పడుకొని చుక్కలు లెక్కవేస్తూ, ఆకాశాన్ని చూస్తూ నిద్రపోయేవాన్ని. రాత్రిపూట ఆకాశం చాలా బాగుంటుంది కానీ నిన్ను ఆ రంగులో చూశాక, రాత్రిపూట ఉండే ఆకాశం దాని రంగు చిన్నపోయింది."

"మరి ఎక్కువ పొగుడుతున్నావు..."

"మనసు చెప్పే నిజం చెప్తున్నా. పసుపు పిల్ల వెలుగు గురించి చెప్తా, విను..."

నేను నీతో, నువ్వు నాతో మొదటిసారి మాట్లాడిన రోజు నీ పుట్టినరోజు. ఆరోజు నువ్వు లైట్ పసుపు కలర్ డ్రెస్ వేసుకున్నావు. ట్యూషన్ మధ్యలో కరెంట్ పోయింది. నువ్వు కొవ్వొత్తి వెలిగించావు. ఆ కొవ్వొత్తి వెలుగు, డ్రెస్ రిఫ్లెక్షన్ నీ మోముపై పడి ఎరుపు తెలుపు కలర్ లో ఉండే నీ మేని ఛాయ, పసుపు లో కనపడింది. పసుపు

అందరికీ శుభం మరియు యాంటీ బయాటిక్ కానీ నా మనసుకి నువ్వే శుభం, నువ్వే యాంటీబయాటిక్."

"యాంటీ బయాటిక్...! ఏంటి డిస్టెన్స్ లో డాక్టర్ కోర్సు చేశావా?"

"చేయలేదులే కానీ, నీ ప్రేమలో చేస్తున్నాగా నాకు అది చాలులే, పచ్చని పిల్ల పచ్చదనం చూస్తే నాకు పరమానందం."

"చా..."

"అడవుల్లో ఉండే పచ్చదనం, వాన కురిసే రోజుల్లో కొండ మీద ఉండే పచ్చదనం, కొమ్మకు ఉండే ఆకుల పచ్చదనం ఇవన్నీ నాకు నచ్చుతాయి. కానీ ఒక సంక్రాంతికి నువ్వు వేసుకున్న లేత ఆకుపచ్చ డ్రెస్ లో నిన్ను చూశాక, ప్రకృతిలో ఉన్న ఆకుపచ్చ అంతా, నీ ముందు సరిపోదు అని అనిపించింది. అందరూ సంక్రాంతి ముగ్గులు చూస్తుంటే, నేను ఆ రోజు ఈ ముద్దు గుమ్మ నీ చూస్తూ ఉండిపోయాను. నేనే కాదు, ఆ రోజు నీకు లైన్ వేసే బ్యాచ్ అంతా నిన్ను చూడడమే."

"ఎలారా ఇలా...".

"నీలి పిల్ల మరదలు మనసులోకి నేను వెళ్ళిన దగ్గరనుండి"

"ఎప్పుడూ వెళ్ళావేంటి నీ మరదలు మనసులోకి"

"నాకు ట్యూషన్ లాస్ట్ రోజు, ఆ రోజు నిన్ను బ్లూ డ్రెస్ లో మొదటిసారి చూశాను. గుర్తుందా, ఆరోజు నేను ట్యూషన్ కి సైకిల్ తెచ్చాను, నిన్ను సైకిల్ మీద మీ ఇంటి దగ్గర వదిలిపెట్టాను. ఆ రోజు నీ స్పర్శ నాకు మొదటిసారి తెలిసింది. ఎన్ని జన్మలు ఎత్తిన ఆ స్పర్శని ఎప్పటికీ మర్చిపోలేను. ఆ క్షణం నా మనసు

నీలాకాశంలో తేలినట్టు ఉంది. బ్లూ కలర్ కనబడితే నాకు గుర్తుకు వచ్చేది ఆ స్పర్శ మాత్రమే.

నువ్వు ప్రేమను ఒప్పుకున్న తర్వాత, మొదటి సారి నిన్ను చూసిన రోజు నువ్వు వేసుకున్న డ్రెస్ ఇంకో రకమైన నీలం రంగు. ఆరోజు నాకు నిన్ను చూస్తుంటే, స్వేచ్ఛమైన నీలి సముద్రం ఎలాగ అయితే, కొన్ని రకాల జీవాలకు స్థావరం అయిందో, స్వేచ్ఛమైన నీలి నింగి ఎన్నో గ్రహాలకు, తారలకు నెలవైందో, అలానే నీ స్వేచ్ఛమైన మనసులో నాకు చోటు కల్పించావని అర్థమైంది."

"ఇంకా."

'వైలెట్ పిల్ల నాలో చేసిన వయోలెన్స్ నీకు తెలియదు..."

"వయోలెన్సా...!"

"హా..., ప్రేమలో వయోలెన్స్"

"ఎలా?"

"ఈరోజు, నువ్వు వేసుకున్న ఈ పర్పుల్ డ్రెస్, ఇంద్ర ధనుస్సులో వైలెట్ రంగు ఒకటే. గుడి దగ్గర ఇదిగో ఈ వైలెట్ పిల్ల నీ చూసి మనసు నన్ను వదిలి నీతో విహార యాత్ర చేసింది. ఇలా రెయిన్ బో లో ఉన్న ప్రతి వర్ణాన్ని, నేను నీలో చూశాను. ఆ వర్ణాలు, ఆ రెయిన్ బో కంటే నీకే బాగుంటాయి. పైగా రెయిన్ బో ని ఏడు రంగుల్లోనే చూస్తాము, కానీ నిన్ను ఇంకా చాలా రంగుల్లో చూశాను. ఎన్ని రంగుల్లో నిన్ను చూసినా, డ్రెస్ రంగు మారింది కానీ నీ అందం మారలేదు."

"బావ, బావ, బావ, బావ....."

“మందార పువ్వు చాలా రంగుల్లో ఉంటుంది. గులాబీ పువ్వు చాలా రంగుల్లో ఉంటుంది. పొద్దుతిరుగుడు పువ్వు చాలా రంగుల్లో ఉంటుంది. పువ్వులు ఏ రంగు లో ఉన్న అందంగా ఉంటాయి. ఎందుకంటే, రంగు కన్నా, పువ్వుల అమరిక బాగుంటుంది. అలాగే నువ్వు ఏ రంగు డ్రెస్ వేసుకున్న బాగుంటావు. రంగు నీకు అందాన్ని ఇవ్వడం లేదు, రంగుకే నువ్వు మరింత అందాన్ని ఇస్తున్నావు.”

“నువ్వు నన్ను ఇలా పొగుడుతుంటే, గాల్లో ఉన్నట్టు ఉంది. నీకో విషయం తెలుసా, నువ్వు ఇలా పొగడటం వల్ల నాలో పొగరు వస్తుంది.”

“నువ్వు పొగరు చూపించినప్పుడే ఎక్కువ అందంగా ఉంటావే...”

“బావ గారు ఇక ఆపండి మీ రెయిన్ బో రంగుల కథ...”

“ఆ కథ ఆపలేను కానీ, ట్రైన్ ఆగుతుంది, మనం దిగాల్సిన స్టేషన్ వచ్చేసింది.”

టైమ్ తొమ్మిది అవుతుంది. చిన్నగా బయటకి వచ్చి టిఫిన్ చేశాము. స్టేషన్ కి దగ్గరలో ఒక కళ్యాణ మండపం ఉంది. అక్కడ ఒక పెళ్లి జరుగుతుంది.

“పెళ్ళికి వెళ్దామా అని అడిగాను.”

“మనకి తెలియదు వాళ్ళు, బాగుండదు వద్దులే”

“రేపు పెళ్లి అయ్యాక మన ఇద్దరం జంటగా ఫ్రెండ్స్ పెళ్ళిళ్ళకి, బంధువుల పెళ్ళిళ్ళకి వెళ్ళాలి కదా. ఇది కూడా అలానే అనుకో”

“బానే ఉంది, కానీ భయం గా ఉంది కృష్ణ”

“అసే రా, ఏం కాదులే”

బ్యాగ్ లాకర్ లో పెట్టి కళ్యాణ మండపానికి వెళ్ళాము, వాతావరణం చూస్తుంటే నాకు కూడా తొందరగా పెళ్లి చేసుకోవాలని అనిపించింది. నిండుగా నగలు ధరించిన ఆడవాళ్లు, రక రకాల డ్రెస్సుల్లో పిల్లలు, నా లాంటి కుర్రోళ్ళు, కొంత మంది అమ్మాయిలు. పెళ్లి మండపంలో చాలా మంది ఉన్నారు. ఒకే లైన్ లో రెండు కుర్చీలు ఖాళీగా లేకపోవడం వల్ల, ఇద్దరం చెరొక లైన్ లో కూర్చున్నాం. మధ్య మధ్యలో ఒకరినొకరు చూసుకుంటూ, చిన్నగా పెళ్ళి తంతులో లీనమైపోయాము. అదే సమయంలో, ఒకడు శ్రావణి వైపు అలానే చూస్తున్నాడు, బహుశా సైట్ కొడుతున్నట్టు ఉన్నాడు. శ్రావణి పెళ్లిని చూస్తూ ఉంది. అప్పుడే నా పక్కన సీటు ఖాళీ అయింది, శ్రావణి నీ పిలిచే లోపు వాడు వచ్చి నా పక్కన కూర్చున్నాడు.

“బ్రో..”

“బ్రో నా, అంటే...?”

“బ్రదర్ బ్రో...!”

“బాగా బలిసిన ఫామిలీ అనుకుంటా...!”

“హ, ఎలా తెలుసు బ్రో ?”

“నీ భాష చెప్తుంది”

“వెటకారం బానే ఉంది నీ దగ్గర” అని వాడు శ్రావణి వైపు చూస్తున్నాడు.

“ఏం బ్రో..., నచ్చిందా...! తెగ చూస్తున్నావ్ ఆ పిల్ల వైపు”

"అవును బ్రో, భలే ఉంది ఆ అమ్మాయి. నేను ఇప్పటివరకు చూసిన అమ్మాయిల్లో, ఇంత నేచురల్ అందం నేను చూడలేదు. పర్ఫుల్ ఏంజెల్ లా ఉంది"

వాడు శ్రావణికి సైట్ కొడుతున్నందుకు కోపం వచ్చిన, తనని పొగుడుతున్నందుకు ఆనందంగా ఉంది.

"ఆ అమ్మాయి నీకు ఏమైనా తెలుసా బ్రో"

"లేదు ఏం..?"

"నేను పెళ్లి కొడుకుకి తమ్ముడు వరుస అవుతాను. చుట్టాలు అందరూ నాకు తెలుసు. కానీ ఈ అమ్మాయిని ఎప్పుడూ చూడలేదు."

"అమ్మాయి తరుపున అయ్యింటారులే"

"అయ్యుండొచ్చు, కానీ ఏముంది బ్రో పిల్ల, కవిత్వం వస్తుంది"

వీడికి కూడా, నా లాగా తనని చూస్తే కవిత్వం వస్తుందా...! అని మనసులో అనుకున్నాను.

"ఏం కవిత్వమో చెప్పు, నాకు కూడా టైమ్ పాస్ అవుతుంది."

"తను ఎలా కనిపిస్తుందంటే...!

"ఇప్పటివరకు నేను చూసిన అందమైన అమ్మాయిలను మిక్స్ చేసి బయటకి తీసినా, తనంత అందంగా ఉండరు...! తన మొహం చూస్తుంటే, ఎంతో హాయిగా ఉంది. తన కళ్ళను చూస్తే, నా కళ్ళు పోయిన పర్వాలేదు, తను పక్కన ఉంటే చాలు అనిపిస్తుంది...!"

అదే సమయంలో శ్రావణి నా వైపు తిరిగి నవ్వింది

“చూడు బ్రో, ఆ అమ్మాయి నా వైపు చూసి నవ్వింది, నా మనసులో మాటలు తనకి వినిపిస్తున్నాయి కావొచ్చు...!”

ఆ మాటకి వాడి వైపు కి చూసి నేను కూడా నవ్వాను..

“తన నవ్వులో ఏదో ప్రపంచ వింత ఉంది బ్రో, ఎంత ప్రేమగా నవ్వింది. ఈరోజు తనకి ఎలాగైనా ప్రపోజ్ చేస్తా !”

“ఇప్పుడే చెయ్ పో”

“ఆ చేస్తా..., అవును అడగడం మర్చిపోయా, మీరు ఎవరి తరుపు?”

“శ్రావణి తరుపు...!”

“శ్రావణి ఎవరు ?”

“హా, నువ్వు ఇప్పుడు దాకా లైన్ వేస్తున్నావ్ గా ఆ పిల్ల తరుపు...!”

వాడు కొంచెం షాక్ అయ్యి, “నీకు ఏమవుతుంది తను?” అని అడిగాడు

“నువ్వు ఏదైతే కాకూడదని మనసులో అనుకుంటున్నావో అదే వరుస తను నాకు”

“లవ్”

“నేను నమ్మను”

ఈలోపు నా పక్కన ఇంకో సీటు ఖాళీ అయింది, శ్రావణి చూసి, నా దగ్గరికి వచ్చి కూర్చొని, నా చెయ్యి పట్టుకొని పెళ్ళి గురించి చెప్తుంది.

వీడు షాక్ లో ఉండి పోయాడు…!

కొంచెం సేపటికి తను వాష్ రూమ్ కి వెళ్ళింది. వీడు మళ్ళీ మాట్లాడటం స్టార్ట్ చేశాడు.

“సారీ బ్రో…”

“తప్పుగా మాట్లాడలేదు కదా, సారీ అవసరం లేదు.”

“ఎలా పడింది బ్రో…!”

“కవిత్వానికి”

“ఈ అమ్మాయి నాకు ముందే కనిపించి ఉంటే, ఖచ్చితంగా నీకన్నా బాగా కవిత్వం చెప్పి పడేసేవాణ్ణి బ్రో. ఏమి అనుకోకు, ఇది నా నెంబర్, పొరపాటున మీకు బ్రేకప్ ఐతే, నాకు చెప్పు బ్రో…”

“అలా జరగదు ఎప్పటికీ”

“లవ్ ఎట్ ఫస్ట్ సైట్ బ్రో…! బ్రేకప్ అవ్వకపోతే నువ్వు హ్యాపీ, అయితే నేను హ్యాపీ”

“నువ్వు నా కన్నా వేస్ట్ గా ఉన్నావు, చెప్తాలే బ్రేక్ అప్ అయితే” అని చాలా ఓవర్ కాన్ఫిడెన్స్ తో చెప్పాను

ఈలోపు శ్రావణి వస్తుంది…!

“ఒక బ్రో, నేను వెళ్తున్నాను, నేను ఇప్పటివరకు చూసిన లక్కీ పర్సన్ లో నువ్వే లక్కీ యస్ట్…, నిన్ను చూస్తే జెలసి వస్తుంది, బై బ్రో…!”

ఈ లోపు శ్రావణి వచ్చేసింది.

“హా నీకు ఇక్కడ కూడా తెలిసిన వాళ్ళు ఉన్నారా, తెగ మాట్లాడుతున్నావు ఎవరితోనో...”

“నాకు తెలిసిన వాళ్ళు కాదు, నీ ఫ్యాన్స్ నాలాగా...!”

“అర్థంకాలేదు”

“వాడు నీకు సైట్ కొడుతున్నాడు, నా దగ్గరికి వచ్చి నీ మీద కవిత్వాలు చెప్తున్నాడు”

“ఓయ్, నువ్వు గొడవ పెట్టుకోకు”

“నేనెందుకు పెట్టుకుంటా, వాడు నిన్ను పొగుడుతుంటే, నాకు భలే ఉంది...!”

“ఆహా,”

“హా,”

రెండు గంటలు అక్కడే ఉన్నాము తెలియకుండా. ఆ పెళ్ళి తంతు చూస్తుంటే, భలే ముచ్చట వేసింది. ఆ పెళ్లిలో వాళ్ళ జంటకి బదులు మా జంట ఎలా ఉంటుందో ఊహించుకుంటే అత్యంత అద్భుతంగా ఉంది. తెలియని పెళ్ళికి జంటగా వెళ్ళాము, చిన్నగా పెళ్ళి భోజనం చేసి బయటకి వచ్చాము. నేను నార్మల్ గా తిన్నాను. తను కొంచెం భయంతోనో, సిగ్గుతోనో చాలా లైట్ గా తినింది. బ్యాగ్ తీసుకున్నాక, ఆటో లో బస్టాండ్ కి వెళ్ళాము. బస్టాండ్ లోపలికి వెళ్తుండగా పానీ పూరి బండి కనపడితే అది తిందాం అని గోల. ఆడ పిల్లలు అన్నింట్లో నీట్ గా ఉంటారు కానీ, సైడ్ కాలువ దగ్గర పానీ పూరి దగ్గర మాత్రం లొట్టలేసుకుంటూ తింటారు. తను తినింది, నాకు వద్దు అన్నాను. రెండు వాటర్ బాటిల్స్ తీసుకొని

చిన్నగా బస్ ఎక్కాము. బస్ జర్నీ గంటన్నర, మధ్యలో ఆపేది లేదు, దారి మొత్తం ఊరికి అవతల ఉన్న పోలాలే. రోడ్ మొత్తం గతుకులే గతుకులు. నలభై ఐదు నిమిషాల తర్వాత,

“కృష్ణా దిగి పోదాం”

“ఏమైంది”

“అర్జెంట్ రా...”

“ఏం అర్జెంట్..? ఒకటి కా...!”

“కాదురా...”

“ రెంటికా...”

“హా” అని గొణిగింది.

వెళ్లి కండక్టర్ నీ నార్మల్ గా కనుక్కుంటే, ఇంకా నలభై నిమిషాలు పడుతుందని చెప్పాడు. దారి మొత్తం ఊర్లకి దూరంగా ఉన్న పోలాల మధ్యలోనే వెళ్ళాలి.

“అరగంట ఆగుతుందా, ఆపుకోగలవా” అని అడిగాను.

“ఐదు నిమిషాల కూడా ఆగేట్టు లేదురా” అని చిన్నగా చెవిలో చెప్తుంది.

బస్సు ఆపమంటే, కండక్టర్ “ఇక్కడ నుండి మీకు వేరే వెహికల్స్ దొరకవు ఈ సమయం లో” అని అన్నాడు. “తప్పనిసరి పరిస్థితుల్లో దిగుతున్నాం లే” అని చెప్పాను. కండక్టర్ నా వంక ఆడో రకం గా చూశాడు. ఆ చూపుల అర్థం నాకు తెలుసు. బస్ వెళ్ళిపోయింది.

“ఎక్కడకి వెళ్ళాలి రా” అని టెన్షన్ గా అడుగుతుంటే నవ్వొస్తుంది.

“ఉండు పూజారికి ఫోన్ చేస్తా, మంచి ప్లేస్ చెప్తాడు పోవడానికి”

“ప్లీజ్ ప్లీజ్ చెప్పరా..”

“అదుగో ఆ చెట్టు కనపడుతుంది గా దాని వెనక్కి పో” అనగానే ఫాస్ట్ గా వాటర్ బాటిల్ తీసుకొని పోయింది.

టైం మధ్యాహ్నం అవటం వల్ల ఎండకి ఎవరు రావట్లేదు. ఈ వెహికల్స్ కూడా రావటం లేదు. ఒక అయిదు నిమిషాల నిశ్శబ్ద విప్లవం తర్వాత తను వచ్చింది.

“మళ్ళీ పానీ పూరి తింటావా మేడం గారు” అనగానే సిగ్గుతో చచ్చిపోయింది పాపం.

“నీ దిష్టే తగిలింది, నా బ్యాగ్ లో సబ్బు ఉంటుంది ఇవ్వు.”

“సబ్బా.. సబ్బు కూడా బ్యాగ్ లో ఉందా.”

“ఆడాళ్ళ బ్యాగ్ లో ప్రపంచంలో ఉండే అన్ని ఉంటాయిలే.”

“సూపర్ ఉమెన్ మీరు.”

చాలా సేపు వెయిట్ చేసాం, ఏ వెహికల్ రావటం లేదు. సరేలే అని చిన్నగా ఒకరి చేయి ఒకరు పట్టుకొని మాట్లాడుకుంటూ, పాడుకుంటూ నడవడం స్టార్ట్ చేశాము. పది నిమిషాల నడక తరువాత, అన్లోడ్ అయ్యేసరికి అమ్మాయి గారికి నీరసం వచ్చి...,

“నేను నడవలేను కృష్ణ. వెయిట్ చేద్దాం” అని అనింది.

“వెయిట్ చేసిన ఎవరు రారులే కానీ, ఉప్పు ఎక్కుతావా,?”

“ఆనందంగా “హా హా” అని చెప్పింది.

అది బ్యాగ్ మోస్తుంటే, నేను దాన్ని అంటే యాభై రెండు కేజీలని మోస్తున్నాను. విచిత్రం ఏంటంటే ఒక్కడినే నడుస్తుంటే నాకు కొంచెం అలసట అనిపించింది. తనని మోస్తుంటే అలసట కన్నా, ఆనందం ఎక్కువ వస్తుంది. అలా చిన్నగా అర గంట నడిచాక ఆనందం ఆవిరై కాళ్ళు, నడుము నొప్పి స్టార్ట్ అయ్యాయి.

“దిగవే శ్రావణి, ఓపిక అయిపోయింది. ఇక నడువు నువ్వే, కుదిరితే నన్ను కూడా మోయి.”

“సరే దా”

దొంగ ముండా నిజంగానే, నన్ను మోసింది. దానికి బలం ఎక్కువే. రెండు నిమిషాల తర్వాత ఒకతను బైక్ మీద వస్తున్నాడు.

“దించవే శ్రావణి, ఏదో బైక్ వస్తుంది.”

ఆపాను బైక్.

“భయ్యా, ఇక్కడ బస్టాప్ ఎంత దూరంలో ఉంది.”

“ఇంకో ఆరు కిలోమీటర్లు.”

“ఆరు కిలోమీటర్లా” అని శ్రావణి నిరాశపడింది.

“అయినా ఇక్కడెందుకు దిగారు మీరు”

“అర్జెంట్ గా వస్తుంటే దిగాం అన్నా” అని అన్నాను.

“నీకు అర్జెంట్ అయితే నువ్వు ఒక్కడివే దిగకుండా పాపం ఆ అమ్మాయినీ కూడా దించావా...”

“నాకు తోడు లేకపోతే భయం అన్న, అందుకే దించవలసి వచ్చింది.”

“చూడండి ఈ రోడ్ అసలే మంచిది కాదు.”

“అన్నా, మమ్మల్ని డ్రాప్ చేయొచ్చు కదా”

“నాకు పొలంలో పని ఉంది. మీరు ఈ బైక్ తీసుకొని వెళ్ళండి. బస్టాండ్ దగ్గర టెలిఫోన్ బూత్ లో మా ఫ్రెండ్ ఉంటాడు, వాడికి కీ ఇవ్వండి. వాడు తర్వాత నన్ను తీసుకెళ్తాడు.”

అతనికి ఓ ముప్పై ఐదు సంవత్సరాలు ఉంటాయేమో. బైక్ కీ ఇవ్వగానే హాగ్ చేసుకొని అతనికి థాంక్స్ చెప్పాను. బైక్ స్టార్ట్ చేశాను, శ్రావణి బైక్ ఎక్కగానే, రవి మబ్బుల చాటుకి వెళ్ళాడు. ఫస్ట్ టైమ్ తనని బైక్ ఎక్కించుకోవడం. ఆ అవకాశం ఇచ్చిన ఆ అన్నకి ఎన్ని థాంక్స్ చెప్పిన తక్కువే. నా మొబైల్ నెంబర్ ఇచ్చి తన నెంబర్ తీసుకున్నాను.

బైక్ జర్నీ మొదలైంది..

రవి మబ్బుల చాటునే ఉన్నాడు. ఎండ పోయి, చల్లగా మారింది. గాలి మా అలసటని, చెమటని తగ్గిస్తుంది. తను నా వెనుక కూర్చొని నన్ను గట్టిగా పట్టుకుంది.

మరీ జేడీ చక్రవర్తి మహేశ్వరి టైప్ రైడ్ కాకపోయినా,లవర్ తో ఫస్ట్ టైమ్ బైక్ జర్నీ అంటే, ఇద్దరికి స్పెషల్ కదా. తను గట్టిగా నన్ను పట్టుకుని నా వీపుకు ఐ లవ్ యూ అని చెప్తుంది. ఆ ఫీలింగ్ నర నరాల్లో చేరుతుంది. అలా ఇరవై నిమిషాల ప్రయాణం తర్వాత, చిన్నగా బస్టాండ్ కి చేరే లోపు పెట్రోల్ బంక్ వస్తే ఫుల్ ట్యాంక్ చేయించాను, నా మనసును ఫుల్ చేసిన కృతజ్ఞతతో. కీ ఇచ్చాను తను చెప్పిన వాళ్ళకి. తనకి ఫోన్ చేసి థాంక్స్ చెప్పి ఒక మాట అడిగాను.

“అన్నా, మేము నీకు తప్పుగా కనపడలేదా ఆ టైం లో అక్కడ మేము ఇద్దరమే ఉన్నాము”

“తమ్ముడు మీరు తప్పు చేసేవాళ్ళు అయితే మీ దగ్గర ఏదో ఒక వెహికల్ ఉండాలి ఎందుకంటే ఆ రోడ్ లో బస్సులు లేక నాలాగా పొలం పనులు ఉన్నవాళ్లు మాత్రమే వస్తారు. పైగా కొంచెం కరువు, పొలం పనులు కూడా సరిగా లేవు. మధ్యలో దిగారంటే ఏదో అవసరం ఉండి దిగి ఉంటారు. నువ్వు ఏదో కారణం చెప్పావు కానీ నేను నమ్మలేదు. ఇంకేదో కారణంతో దిగారు అని అర్థం అయింది. పైగా మిమ్మల్ని చూస్తుంటే అలా అనిపించలేదు”

ఆ మాట విన్నాక, లోకంలో నాలాంటి మంచోళ్ళు ఇంకా ఉన్నారని పించింది. ఇక మళ్ళీ బస్ ప్రయాణం మొదలైంది. మా ఊరి ఆటో స్టాండ్ దగ్గర దిగాము. ఒకే ఆటో ఎక్కాము. ఇక అక్కడినుండి మాటలు లేవు. ఓన్లీ మెసేజెస్. తను మెసేజ్ ఇంటికి రమ్మని.

సమయం ఏడు అవుతుంది. ఇప్పుడా? అని మెసేజ్ పెట్టాను.

“ఏం కాదులే రా..” అని రిప్లై

“నువ్వు అడిగితే వస్తాలే...!”

ఊర్లో ఎంటర్ అయ్యేసరికి కరెంట్ లేదు, కరెంట్ కోతల వల్ల, కరెంట్ ఎనిమిదికి వస్తుంది. ప్రకృతి సహాయం చేస్తుంది మళ్ళీ. తనకంటే ముందే, వాళ్ళ ఇంటికి నేను వెళ్ళాను. ఇద్దరం అలిసిపోయాం బాగా. తను వెళ్ళి స్నానం చేసి వచ్చాక, నేను వెళ్ళి స్నానం చేశాను. ఈ లోపు కరెంట్ వచ్చింది. చూస్తే తను నా షర్ట్ వేసుకుంది. తను డోర్స్ అన్ని క్లోజ్ చేసింది.

"నా షర్ట్ వేసుకున్నావు ఏందే"

"ఏం వేసుకోకూడదా...?"

"నిన్న వేసుకున్న షర్ట్ అది, చెమట వాసన వస్తుందని"

"నాకు రావట్లేదు గా"

"వద్దులేవే నా షర్ట్ ఇచ్చేయ్"

"నేను ఇవ్వను, కావాలంటే నువ్వే తీస్కో"

"హా హా, వద్దులే ఉంచుకో"

"అయితే ఉంచుకుంటాలే" నవ్వుతూ చెప్పింది.

ఆ తర్వాత, తను పెద్ద వంట వచ్చిన దానిలా అన్నం వండి బెండకాయ కూర చేసింది.

తను తింటూ నాకు పెట్టింది. చాలా రోజుల తరువాత నేను మిస్ అవుతున్న మా అమ్మ చేతి ముద్ద గుర్తుకు వస్తుంది.

"కూర ఎలా ఉంది" అని అడిగింది.

నిజానికి కూర బాగా లేదు, మా అమ్మ వంటంతా టేస్ట్ లేకపోయినా కానీ, ఫీలింగ్ మాత్రం మా అమ్మని గుర్తుచేస్తుంది తన చేతి ముద్ద తో.

"బాగానే ఉంది" అని అన్నాను

"ఒక్కటి ఇచ్చింది తల మీద..."

"హా సూపర్ ఉంది అన్నా..."

తిన్నాక, ఇక వెళ్తా అంటే ఎక్కడికి వెళ్ళేది నాకు ముచ్చట చెప్పు అన్నది.

ఇద్దరం ఒకటే మంచం. ఒకరి చేతుల మీద ఒకరం. తనే చెప్పడం స్టార్ట్ చేసింది.

"ఈరోజు చాలా హ్యాపీ గా ఉంది. ఫస్ట్ టైమ్ ట్రైన్ జర్నీ పైగా నీతో, ఇంకా ఆటో జర్నీ, బస్ జర్నీ అన్నింటికంటే ముఖ్యంగా బైక్ జర్నీ. అంత ఒక కలలా ఉంది కదా కృష్ణా..."

"నాకు నీతో ఉన్నంతసేపు ఎప్పుడూ కలలాగే ఉంటుంది."

"కృష్ణ, ఐ లవ్ యూ, బాగా అలసిపోయాను. నిద్ర వస్తుంది. ఇలానే నీ చేతి మీద పడుకుంటాను. నువ్వు వెళ్ళేటప్పుడు లేపు."

అలారం మూడింటికి పెట్టి, నేను కూడా పడుకున్నాను. ఆరోజు ఎప్పటికీ నాకు ప్రత్యేకమే. కొంచెం సేపటి తరువాత, తన ఎద పైన తల పెట్టి, తన పక్కన నిద్రించిన ఆరోజు, తన మొహాన్ని చూస్తే మా అమ్మ గుర్తుకు వచ్చింది. నిద్రలోకి వెళ్ళిపోయాను కూడా. మూడు గంటలకు అలారం మోగింది. చిన్నగా లేచేసరికి తను నా మీద పడుకొని ఉంది. తనని లేపాను.

"ఒసేయ్ నా షర్ట్  ఇవ్వవే ఇప్పటికైనా"

"నేను ఇవ్వను గాక ఇవ్వను కావాలంటే నువ్వే తీస్కో"

"నేను తీసుకునే టైం తర్వాత ఉందిలే కానీ మీ ఇంట్లో చూస్తే ఈ షర్ట్...?"

"నేను మేనేజ్ చేసుకుంటాలే రా" అని నన్ను గట్టిగా హాగ్ చేసుకొని మిస్ యూ బావ అని నుదుట మీద ముద్దు ఇచ్చింది. ఇంకా కొన్ని

రోజులే, ఆ తరువాత మన పెళ్ళి, ఎప్పటికీ కలిసి ఉంటాము బావ" అని చెప్పింది.

**అలా తనతో, ఒక రోజు మొత్తం గడిపాను. తనని ఎంత సేపు చూసినా బోర్ కొట్టదు. తనని ఎప్పుడూ చూసిన, ఎలా చూసినా మొదటిసారి చూసినప్పుడు కలిగిన ఫీలింగ్ కలుగుతుంది. అలాంటి తనతో, ట్రైన్ లో, బస్ లో, ఆటో లో, బైక్ మీద చేసిన ప్రయాణం, కలిసి చూసిన పెళ్లి, నడిచిన నడక, తను నన్ను మోయడం, నేను తనని మోయటం, తనతో తన పక్కనే పడుకున్న నిద్ర ఎప్పటికీ మరువలేను.**

**********

12

# ప్రేమ చెట్టు కింద వర్షపు ముద్దు

నేను తన పుట్టినరోజుకి ఇచ్చిన గిఫ్ట్ తనకి బాగా నచ్చింది, నచ్చింది అనడం కంటే తన మాటల్లో తనకి తనని పరిచయం చేశాను అంటే బాగుంటుంది. ఆనందమో, ఆశ్చర్యమో లేక ప్రేమతోనో, అడగకుండానే, నాకు వరమిచ్చింది.

గడియారంలో సమయం సాయంత్రం ఏడు గంటలు. అప్పటి వరకు జోరున కురిసిన వర్షం ఆగిపోయింది. గాలులు బలంగా వీస్తున్నాయి, వాతావరణం చాలా చల్లగా ఉంది.

చుట్టాలు ఎవరో పోయారని వాళ్ళ ఇంట్లో వాళ్ళు అక్కడికి పోయారు, రావడానికి తొమ్మిది దాటుతుంది. కరెంటు పోయింది, ఎప్పుడు వస్తుందో తెలియదు.

భయంగా ఉంది, కానీ ఏదో తెలియని అనుభూతి వల్ల నా అడుగులు ముందుకు పడుతున్నాయి. ఏమవుతుందో తెలియదు, కానీ వలపుల ఆలోచనలు వసంత గానం చేస్తున్నాయి. కరెంటు లేకపోవడం వల్ల చాలా సులువుగా తన ఇంటికి వెళ్ళాను. వాళ్ళ ఇంటి వెనుక వైపున ఒక చెట్టు ఉంది కదా, మొదటిసారి తనని

చూసిన ఆ చెట్టు కిందే చూశాను. కొన్ని సంవత్సరాల తర్వాత, ఇప్పుడు అదే చెట్టు కింద మొదలకి అనుకొని తన కోసం ఎదురు చూస్తున్నాను. వర్షం కురిసిన తరువాత వచ్చే మట్టి యొక్క సువాసన నాకు తెలుస్తుంది. ఒక్కప్పుడు ఈ చెట్టు వాళ్ళ ఇంటి బయటకి ఉండేది. ఇప్పుడు కాంపౌండ్ వాల్ కట్టడం వల్ల ఇంట్లోకి వచ్చినట్టు ఉంది. సమయం సాయంత్రం ఏడు గంటల పదిహేను నిమిషాలు అవుతుంది.

తను చీకట్లో నడుస్తూ వస్తుంది. కారు చీకటిగా ఉన్న, తన నడక, తన రూపం నా కంటికి చాలా స్పష్టంగా కనిపిస్తుంది. తను దగ్గరికి వస్తున్న కొద్దీ, ఏదో మదిలో అలజడి, గొంతు తడి ఆరిపోతుంది. సన్నగా చినుకులు మొదలయ్యాయి, తను కొంచెం త్వరగా పరిగెడుతూ చెట్టు కిందకు వచ్చింది.

ఒకరి ఎదురుగా ఒకరం, ఇద్దరిలోను బిడియం, భయం, ఆతృత ఇంకా చాలా రకాల అనుభూతులు మా మోహంలో కనిపిస్తున్నాయి.



వాన చినుకులు, చెట్టు కొమ్మల మీద నుండి ఆకుల మీద కి, అక్కడి నుంచి తన కురుల మీద పడి, తన మొహం మీదకి

జారుతున్నాయి. ఈ లోపు ఒక మెరుపు మెరిసింది, ఆ మెరుపులో, తన బుగ్గ మీద ఉన్న వాన చినుకు నాకు కనపడింది. నా రెండు చేతులతో, తన మొహాన్ని దగ్గరకి తీసుకున్నాను. తన బుగ్గ మీద ఉన్న చినుకుని ముద్దాడాను. ఉప్పగా ఉండే చినుకు, నాకు అమృతంలా అనిపించింది, మనసు నిండినట్టు అనిపించింది.

తన మొహం ఇంకా నా చేతుల్లోనే ఉంది. ఎర్రబడిన తన బుగ్గ, చీకటిలో కూడా కనిపిస్తుంది. తన అధరాలు చిన్నగా వణుకుతున్నాయి, ఈ సారి ముద్దు, వణుకుతున్న పెదవుల మీద నాకే తెలియకుండా పెట్టాను.

నా చేత్తో, తన నడుముని పట్టుకుని, దగ్గరకు లాగాను. తన నడుము వంపు లోని మాయ, నా చేతికి ఊతం అయింది.

తన రెండు కాళ్ళు, నా రెండు కాళ్ళ మీద పెట్టింది. తన ప్రేమ బరువు నాకు మరింత ఉత్తేజాన్ని ఇచ్చింది. ఎదలు స్పర్శించుకుంటున్నాయి, ఒకరి గుండె సడి మరొకరికి తెలుస్తుంది.

పెదవులు పెనవేసుకున్నాయి. సన్నటి చినుకులు పెద్ద వాన లాగా మారింది. గట్టిగా ఉరుముతున్న ఉరుములు, పెదవుల బంధానికి బలం అవుతున్నాయి. మెరుస్తున్న మెరుపులలో పెదవులు పెన వేసుకుంటుంటే, కళ్ళు మాయని చూసుకుంటున్నాయి. **ఊపిరి నిండా తనే.**

జోరు వర్షంలో తడిసి ముద్ద అవుతున్నా కానీ, ముద్దు వీడలేదు. ఒకరి పెదాలు మరొకరి పెదవులని వానకు తడవకుండా ముడి వేసుకుంటున్నాయి. అంతగా వర్షానికి తడుస్తున్న, చలి గాలులు వీస్తున్న, తన ముద్దు చలి మంటలాగా వెచ్చగా చేస్తుంది నన్ను.

సమయం తెలియట్లేదు, పెదవులు పెళ్లి లో మునిగి తేలుతున్నాయి.

ఆ సమయంలో, వాన తగ్గుముఖం పట్టింది, కరెంటు వచ్చింది. వెలుగుకి, అంధకారంలో ఉన్న పెదవులు, ముద్దు నీ వీడాయి. సమయం చూస్తే ఎనిమిదిన్నర దాటింది. అర్థమైంది ముద్దులో గంట పైన గడిపామని. **తన ప్రేమ బరువు నా కాళ్ళ మీద నుంచి దిగింది, కానీ కళ్ళలో ఇంకా ఏదో మాయ ఇంకా కొంచెంసేపు అని.**

కళ్ళ తోటి వీడ్కోలు చెప్పి, తను వెళ్ళిపోతుంది. నా కళ్ళు తననే చూస్తున్నాయి మాయలో. తను ఒక్కసారిగా మళ్ళీ వెనక్కి వచ్చి హగ్ చేసుకొని ముద్దు ఇచ్చి వెళ్ళిపోయింది. అప్పుడు అనిపించింది స్వర్గం అంటే ఇలాగే ఉంటుంది ఏమో అని...!

**వర్షానికి మట్టికి పట్టిన తేమ పోతుందేమో కానీ, తన పెదవులతో నాకు ఇచ్చిన ప్రేమ తేమ నా శ్వాస ఉన్నంతవరకు ఉంటుంది.** అలా ప్రేమతో నిండిన ముద్దు అనుభూతితో అక్కడనుండి ఇంటికి వచ్చాను. ఒక గంట తర్వాత మెసేజ్ చేసింది తిన్నావా అని. మిగతా మాటలన్నీ ప్రేమ మాటలే ఎప్పటిలాగా.

**“రొమాంటిక్ గా ఫీల్ అవుతున్నావా..., అయింది చాల్లే కానీ వెళ్లి మంచి నీళ్లు తాగి రా, ఇక అసలు కథ చెప్తా...”**

ఇలాంటి ఎన్నో ఫీలింగ్స్, ఎమోషన్స్ తర్వాత అనుకోకుండా అనుకోని ఒక రోజు వచ్చింది. ఇంత మంచిగా, ఎలాంటి అంతరాయం లేకుండా, గొడవలు లేకుండా, ఎన్నో మధురానుభూతులను కలిగి ఉన్న మా ప్రేమకి కలలో కూడా రాదు అని అనుకున్న ఒక రోజు వచ్చింది. **ఆ రోజు ఎలా వచ్చిందో కానీ, నా జీవితాన్ని తలకిందులు చేసింది.**

**********

# 13

# ఒక రోజు

ప్రేమలో సమయం చాలా తొందరగా గడిచిపోయింది. డిగ్రీ అయిపోయిన తర్వాత ఒక సంవత్సరానికి ఒక చిన్న కంపెనీ లో జాయిన్ అయ్యాను, అది కూడా ఎనిమిది వేలకు. మా నాన్న పరిస్థితి అర్థం చేసుకున్నాక చాలా జాగ్రత్తగా ఉన్నాను. రూపాయి రూపాయి దాస్తూ మా నాన్నకు ఇస్తున్నాను. నాన్నకి కూడా వ్యవసాయం కలిసి వచ్చింది. అప్పులన్నీ తీర్చేశాము. చివరి అప్పు తీర్చి ఇంకా ఏ అప్పు లేనప్పుడు మా నాన్న నాకు ఫోన్ చేశాడు...

"చెప్పు నాన్న ఫోన్ చేశావ్..?"

"నీతో మాట్లాడాలని అనిపించి చేశారా"

"ఓహో, తమరికి అలా కూడా అనిపిస్తుందా?"

"వినరా ముండా చెప్పేది ముందు, నిన్న డబ్బులు పంపావు కదా, నా దగ్గర ఉన్నవి కూడా కలిపి మన చివరి అప్పు తీర్చేశాను."

"నన్ను మళ్ళీ అప్పు చేయమంటావా అయితే..!"

“కాదురా, చాలా రోజుల తర్వాత గుండెలో బరువు అంతా తగ్గి, సంతోషంగా ఉంది.”

“సుగుణ పిన్ని దగ్గరకి వెళ్ళావా ఏంటి?”

“నేను నీ అయ్యని, ఎక్కువ తక్కువ మాట్లాడితే అక్కడికి వచ్చి తంతా నా కొడకా”

“ఎందుకో అంత సంతోషం మరి?”

“మీ అమ్మ కి బాగా లేనప్పుడు మొదలైన అప్పులు ఈరోజుకి తీరాయి. గుండెలో భారం దిగిపోయింది. అప్పు అనేది రోగం కన్నా ఎక్కువ ఇబ్బంది పెడుతుంది. అది మన లాంటి కుటుంబాలు అప్పు లేకుండా ఉండాలంటే ఎంతో పుణ్యం చేసుకొని ఉండాలి. పొరపాటున కూడా అప్పు జోలికి వెళ్లకుండా ఉండు సాధ్యమైనంతవరకు.”

“నేనేమీ అప్పు జోలికి వెళ్ళను గాని ఇంకా ఏంటి ఊర్లో సంగతులు?”

“అంతా మాములే. అవును మనకి ఎవరైనా ఏదైనా కావాల్సింది ఎవరైనా ఇస్తే, మనకి ఎవరైనా సహాయం చేస్తే, ఏమని చెప్తారు వాళ్ళకి ఇంగ్లీష్ లో.”

“హా, ఐ లవ్ యూ అని చెప్తారు.”

“కానీ అది ఏదో చిన్న పదం రా, ఇదేమో పెద్దగా ఉంది”

“అదే లే ఇది, ఏదో పెద్ద ఇంగ్లీష్ వచ్చినోడిలాగా చిన్న పదం అంటా”

“మనం ఈరోజు అప్పు లేకుండా ఉన్నామంటే కారణం నీ వల్లే రా. పెద్దపెద్ద చదువులు కాలేజీలు అని డబ్బులు పెట్టించలేదు నా చేత, కానీ అప్పులు తీర్చడానికి, నెల నెల నువ్వు పంపే డబ్బులు దాస్తూ, సమయానికి కాలం కూడా కలిసి రావడం వల్ల, అప్పులు అన్ని తీరాయి. ఐ లవ్ యూ రా”

“సరే సరే”

ఇంకా చాలా విషయాలు సంతోషంగా మాట్లాడాడు. ఒక అరగంట తర్వాత...

“బాగా ఆనందంగా ఉన్నట్టు ఉన్నావు, గుండె ఆగిపోతది ఏమో, నాకు పెళ్లి చేసిన దాకా అయిన ఉండు...”

“గూబ గుయ్ అంటది రా ఒక్కటి పీకితే..!”

“సరేలే..! జాగ్రత్త, నాకు కొంచెం పని ఉంది నాన్న తర్వాత చేస్తాలే.”

“సరే ఐతే, ఐ లవ్ యూ ఇంకోసారి”

**డాడీ అని పిలిస్తేనే చితక్కొట్టిన నాన్న ఈరోజు ఇలా మాట్లాడేసరికి కొంచెం ఫీల్ వచ్చింది...!**

శ్రావణి చదువు కూడా అయిపోయాక, తనకి వెంటనే జాబ్ వచ్చింది. విశేషం ఏంటంటే తన మొదటి శాలరీ ఇరవై వేలు. మూడు సంవత్సరాల తరువాత ఇప్పుడు నా శాలరీ పదిహేను వేలు. కానీ నాకు తన మీద జెలసి లేదు, తనకి నేనంటే చులకన లేదు. మరో సంవత్సరం అంతా బానే గడిచింది.

ఒక రోజు వచ్చింది ఎలా వచ్చిందో ఎందుకు వచ్చిందో కానీ, నా మీద నాకే నమ్మకం పోయేలా చేసింది ఆ రోజు.

శ్రావణి ఇంటి నుండి వచ్చాక కాల్ చేసింది. నిన్ను కలిసి నీతో మాట్లాడాలి అంది. ఇద్దరం వేరు వేరు చోట్ల జాబ్ అవ్వడం వల్ల సండే కలుద్దాం అని అడిగాను. సరే అంది. ఆ తరువాత నార్మల్ గానే మాట్లాడింది కానీ ఏదో వెలితి తన మాటల్లో తెలుస్తుంది.

“బాగానే ఉందా నీకు”

“హా బానే ఉంది ఎందుకు అలా అడిగావు”

“ఏమో, నీ మాటల్లో కొంచెం వెలితో, బాధో తెలుస్తుంది.”

“అలాంటిది ఏమి లేదు. సరే తర్వాత మాట్లాడతా”

“సరే” అన్నాను.

ఆ తర్వాత రెండు రోజులు, కొంచెం పొడి పొడిగా మాట్లాడింది. ఏదో సమస్య ఉందని అర్థమైంది కానీ చెప్పలేదు. ఆ తరువాత రెండు రోజులు తనకి కాల్ కలవలేదు, తన ఫోన్ స్విచ్చాఫ్ ఆఫ్ అని వచ్చింది. ఈ ఐదారు సంవత్సరాలలో తన నాతో మాట్లాడకుండా ఒక్క రోజు కూడా లేదు. అలాంటిది రెండు రోజులు. ఏమైందో అని కంగారు పడ్డాను. వాళ్ళ ఆఫీసు కి కాల్ చేద్దామంటే ఏం అనుకుంటారో అని చేయలేదు. నాకు తెలిసిన అన్ని విధాలుగా ట్రై చేశాను, తనతో మాట్లాడుదామని, కానీ కుదరలేదు.

ఇక బయల్దేరుదాం అనే సమయానికి, శనివారం సాయంత్రం తనే మెసేజ్ చేసింది, రేపు వస్తున్నావా అని అడిగింది. వెంటనే కాల్ చేశాను.

“ఏమైంది రెండు రోజుల నుండి” అని చాలా కంగారు పడుతూ అడిగాను”

"ఫోన్ పాడైతే రిపేర్ కి ఇచ్చాను" అని చాలా నార్మల్ గా చెప్పింది.

**తను అబద్ధం చెప్తుంది అని అర్థమైంది కానీ అడగలేదు తనని.**

"రేపు కలుస్తాను"

"సరే అయితే" అని కాల్ కట్ చేసింది.

నాకు నైట్ సరిగా నిద్ర పట్టలేదు, ఏంటి నేనేమైనా ఇబ్బంది పెట్టాన లేక హార్ట్ చేశానా తనని, లేక ఏమై ఉంటుందో అని. ఆదివారం వచ్చింది. తన కోసం ఎప్పటిలాగే ఎదురు చూస్తున్నాను. తనని ఎప్పుడు చూసినా నాకు ఎంతో ఆనందంగా ఉంటుంది. కానీ ఈరోజు తను ఆటో దిగి వస్తుంటే, తన మొహం లో ఆ వెలుగు కనపడట్లేదు కానీ తనని చూసి నా మనసు మెరిసిపోయింది. తనకి ఎదురుగా వెళ్ళి చేయి పట్టుకున్నాను. అలా నడుచుకుంటూ వచ్చి కూర్చున్నాం.

"ఏదైనా తింటావే"

"వద్దు"

"ఏమైందే నీకు అలా ఉన్నావు? బాలేదా?"

"బాగానే ఉంది."

"మరి ఎందుకు అలా ఉన్నావు"

"నీకు నేనంటే చులకన కదా"

"చులకనా...! అర్థంకాలేదు, ఏం అంటున్నావు కొంపతీసి పిరియడ్స్ లో ఉన్నావా?"

"లేదు"

“ మరి ఎందుకు అలా ఉన్నావు.”

“ఎలా ఉన్నా?”

“సంతోషంగా లేవు, మొహంలో తెలుస్తుంది”

“నేను సంతోషంగా లేక చాలా సంవత్సరాలు అయింది”

“ఒసేయ్ ఏమైంది నీకు అలా మాట్లాడుతున్నావు?”

“సరే కొన్ని నిజాలు మాట్లాడదామా”

“నిజాలా…! అవే కదా మాట్లాడేది.”

“ఎప్పుడూ మాట్లాడే నిజాలు కాకుండా, కొన్ని ప్రాక్టికల్ గా ఉండే నిజాలు మాట్లాడుకుందాం.”

“సరే మొదలుపెట్టు నువ్వే?”

“నేను ఈ రెండు రోజులు నీతో మాట్లాడలేదు కదా ఎలా అనిపించింది?”

“ఎలా అనిపించింది అంటే, కంగారుగా అనిపించింది. కనీసం 100 సార్లు పైన కాల్ చేశా, ఆఫీసు కి చేద్దామనుకున్న కూడా, మళ్ళీ ఏమనుకుంటారో అని చేయలేదు.”

“నాకు మాత్రం చాలా సంతోషంగా అనిపించింది. నేను ఏం మిస్ అయ్యానో నాకు అర్థమైంది.”

“ఇన్ని రోజులు ఏం మిస్ అయ్యావే”

“నా సంతోషాన్ని.”

“నా మీద ప్రాంక్ ఏమన్నా చేస్తున్నావా?”

“ఇప్పటికీ నీకు నిజాలు అర్థం కావడం లేదు.”

“హా.. ఏంటమ్మా ఆ నిజాలు.”

“నాకు ఒక టీవీ ఇష్టం అని చెప్పా గుర్తుందా?”

“షాప్ లో చూపించినదే కదా”

“హా, దాని ఖరీదు ఎంత?”

“అరవై డెబ్భై వేలు.”

“నీ జీతం ఎంత?”

“తెలియదా నీకు, పదిహేను వేలు.”

“అది కొనాలంటే ఎన్ని నెలలు జీతం కావాలి?”

“నాలుగైదు నెలలు.”

“నీకు చాలా సార్లు చెప్పాగా, ఎలాంటి ఇల్లు కావాలో నాకు? దానికి ఖర్చు ఎంత అవుతుంది?”

“నేనేమన్నా తాపీ మేస్త్రి నా తెలియడానికి”

“నీ జీవితాంతం కష్టపడిన కూడా అలాంటి ఇల్లు కట్టలేవు.”

“సరే, అయితే?”

“అయితేనా, నీకు నా మీద ప్రేమ ఉంటే, నువ్వు జీవితాన్ని చాలా సీరియస్ గా తీసుకునే వాడివి.”

“సరే, ఇప్పుడూ ఈ డైలాగ్స్ ఎందుకు?”

“నాకిష్టమైనవి నాకు కావాలంటే నువ్వు నా దగ్గర ఉండకూడదు”

"అర్థం కావట్లేదు నువ్వు ఏమని అంటున్నావో?"

"ఇందులో అర్థం కాకపోవడానికి ఏముంది? నువ్వు వద్దు అని అనుకుంటున్నా"

"వద్దా? ఏం చేశానే నేను?"

"అదే కదా చెప్పేది నువ్వేమీ చేయలేవు, చేయవు. నీకు నేనంటే చులకన, జీవితాన్ని ఎప్పుడు సీరియస్ గా తీసుకోలేదు. మూడేళ్ల నుండి జాబ్ చేస్తున్నావు, నీ జీతం ఇప్పటికే పదిహేను వేలే. ఎదగాలి అన్న తపన నీకు లేదు. నాకు జాబ్ వచ్చి ఒక సంవత్సరం. ఇప్పుడు నా జీతం ముప్పై ఐదు వేలు."

"సరే, దాంట్లో ఏముంది. మన జాబ్ ప్రొఫైల్ అలాంటివి మరి."

"ఇక్కడ జాబ్ కాదు ముఖ్యం, ఎదగాలి అని ఆలోచన"

"ఎందుకే ఇప్పుడు ఇంత క్లాస్ ఇస్తున్నావు. సరే వేరే జాబ్ ట్రై చేస్తాలే కాకపోతే కొంచెం సమయం పడుతుంది."

"సమయం పడుతుందా? ఇప్పటికే సమయం చాలా వృధా అయింది, ఇక వృధా చేయడానికి నా దగ్గర సమయం లేదు."

"అసలు ఏంటే, సడన్ గా"

"సరే చెప్తున్నాను, నువ్వంటే నాకు ఇష్టం లేదు, తెలిసీ తెలియని వయసులో తీసుకున్న ఒక చెత్త నిర్ణయం నేను నీకు ఒకే చెప్పడం."

"చెత్త నిర్ణయమా, నువ్వేనా మాట్లాడేది?"

"ఇవన్నీ ఎందుకులే గాని, నాకు పెళ్లి కుదిరింది."

"పెళ్లా .. నిజంగా"

"నిజంగానే.."

"నిజంగానా, ఎప్పుడూ?

"లాస్ట్ వీక్ ఊరు వెళ్ళినప్పుడు"

"మరి నువ్వు మీ నాన్నకి చెప్పలేదా? మనం ప్రేమలో ఉన్నామని."

"నాన్నకి చెప్పలేదు, అయిన చెప్పాలనేంత గొప్ప నీలో ఏముంది. ప్రేమలో ఉన్నామా, **నన్ను వాడుకుంది చాలు ఇక వదిలేయ్."**

షాక్ లో ఉండిపోయాను ఆ డైలాగ్ కి.

"చూడు, నా లైఫ్ మా నాన్న కుదిరించిన వాడితో బాగుంటుంది. అన్నింట్లో నీకన్నా బెటర్, బెటర్ అంటే ఆయనికి అవమానం, నువ్వు అసలు పోలికే కాదు."

అప్పటి దాకా ఎంతో ఓపికతో, ప్రేమతో ఉన్న నాకు, ఫస్ట్ టైమ్ తన మీద కోపం వచ్చింది. కానీ తన మీద ఉన్న మితి మీరిన ప్రేమ వల్ల ఏమి అనలేదు.

"నిజంగా నువ్వేనా ఇలా మాట్లేడేది."

"నాకు తెలియదు నన్ను వదిలేయ్."

"నువ్వు నిజంగా అంటున్నావో, నన్ను ప్రాంక్ చేస్తున్నావో నాకైతే అర్థం కావడం లేదు. అయినా, అన్నీ కోరికలు ప్రేమించిన వాళ్ళు తీర్చాలంటే ఈ ప్రపంచంలో ఉన్న మగాళ్ళందరూ నిన్ను ప్రేమించినా, నీ కోరికలు అన్ని తీర్చలేరు శ్రావణి."

“ఈ లాజిక్స్ అన్ని నాకు తెలియదు, ఇప్పుడు నువ్వంటే ఇష్టం లేదు, దయచేసి నా సంతోషాన్ని చెడగొట్టవద్దు. ఎందుకంటే నీ గురించి నాకు తెలుసు, నన్ను వదిలేయ్, **నన్ను సంతోషంగా బ్రతకనివ్వు. నా కంటికి కనపడొద్దు.**”

“సరే కనపడను?” అని అసహనంతో అన్నాను.

“అలా అని చచ్చి ఆ పాపం నాకు తగిలించమాకు”


“చచ్చి పోయేంత పిరికి వాడిని కాదులే.”

“మంచిది. నీలాంటి వాడితో ఇలా నేను ఉండలేను, బ్రతకలేను. సరే వెళ్తున్నా”

“ఒక్క నిమిషం ఆగవే, నిజంగా నువ్వేనా, అసలు ఏమైంది నీకు? జాబ్ నీకు సమస్య అయితే, ఎలా అయినా కష్టపడి మంచి జాబ్ చూసుకుంటానే, నన్ను వదిలి వెళ్ళిపోమాకే, ప్లీజ్.”

“కృష్ణా, నువ్వు నన్ను ఏదైనా అనుకో, నువ్వు మాత్రం నాకొద్దు. నిన్ను చూస్తుంటే నాకు భయంగా ఉంది ఎక్కడ నా పెళ్లి చెడగొడతావేమో అని. ఈ రెండు రోజులు నేను అనుభవించిన సంతోషం నాకు ఈ జన్మంతా కావాలి. నన్ను వదిలేయ్, **నువ్వు నాకు దూరంగా ఉంటేనే నేను సంతోషంగా ఉంటా.** ఇక వెళ్తాను” అని వెళ్ళిపోయింది.

తను వెళ్తుంటే, ఏం జరిగిందో అర్థం కాక ఏం జరుగుతుందో తెలియక అక్కడే కూర్చొని ఉండిపోయాను చాలా సేపు.



ఒక్కటి మాత్రం నిర్ణయించుకున్న తనకి మాత్రం కాల్ చేయకూడదని. తను నా గురించి ఏం మాట్లాడిన మర్చిపోతాను కానీ, నేను దూరంగా ఉంటేనే తను సంతోషంగా ఉంటాను అన్నది కదా అక్కడ నిర్ణయించుకున్నా, ఇక ఎప్పటికీ తనని కదిలించ కూడదు అని. కష్టంగా ఉంటుంది కానీ ఇష్టమైన వాటిని వదిలిపెట్టడం కొన్ని సార్లు తప్పదు.

బస్సు లో తిరిగి వెళ్తుంటే అన్ని తన ఆలోచనలే. ఆకులు రాలిన చెట్టు ని చూస్తుంటే, ప్రేమ రాలిన నేను నాకు గుర్తుకువస్తున్నా. అడవి మొత్తం తగలబడిపోయినట్టు నా మనసు తగలబడి పోతుంది, ఆపలేము ఆ మంటని. గాలి పీలుస్తూ బ్రతుకుతున్నాను కానీ గ్రావిటీ లేని గ్రహం మీద ఉన్నట్టు ఉంది ఈ క్షణం. నా కాళ్ళలో, నా చేతుల్లో లేని ప్రయాణం, నా కళ్ళతో చూడలేని ఈ ప్రయాణం ఎటువైపు వెళ్తుందో అర్థం కావట్లేదు.

ఎండిపోయిన నదిలో రాళ్లు రప్పలు కనబడినట్టు, తను వెళ్ళిపోయాక నా జీవితంలో ఉన్న రాళ్లు రప్పలు కనపడుతున్నాయి. **ఒకటి మాత్రం నిజం, ఎడారిలో ఎంత ఇసుక ఉందో, సముద్రంలో ఎంత ఉప్పు ఉందో నా జీవితంలో అంత దరిద్రం ఉంది.**

**పౌర్ణమి ఇచ్చే చందమామ, అమావాస్యని ఇచ్చినట్టు, వెలుగునిచ్చే సూర్యుడు, చీకటికి కారణం అయినట్టు, సంతోషాన్ని ఇచ్చిన తన, ప్రేమ బాధని ఇచ్చింది.** చేసే పని కూడా సరిగా చేయలేకపోతున్నాను. ఆఫీస్ లో ఎప్పుడో చనిపోయిన మా అమ్మ ఇప్పుడు చనిపోయిందని రెండు నెలల సెలవు పెట్టి ఇంటికి వచ్చాను. నెల గడిచింది, మా నాన్న కూడా నన్ను ఏమి అడగలేదు. ఈ నెలలో మా నాన్నని మర్చిపోయా, అందరిని మర్చిపోయా, సమయాన్ని మర్చిపోయా. సరిగా నిద్ర కూడా పొవట్లేదు.

**తనకి చెప్పాలనిపిస్తుంది...,**

"ఎదురుగా నీవుంటే, నవ్విన నా మనసు, నువ్వు వద్దంటుంటే విలపిస్తోంది. హృదయానికి ఊపిరి అందుతున్నా, విలువ లేకుందే...!

నీతో చేసిన చెలిమిని, నిప్పుల కొలిమిలో వేయమాకే, **చీకటి దేశానికి నా మనసును పంపమాకే...!**

నేను నడిచే దారిలో ప్రేమ లేదు, వేసే అడుగుల్లో జీవం లేదు, చూసే చూపుల్లో వెలుగు లేదు, **నా బాధని ఓదార్చే దారి లేదు, నా గమనానికి కావాల్సిన గమ్యం లేదు, ప్రేమకి కావాల్సిన నువ్వే లేవు…,** భరించటం, బాధపడటం తప్ప, ఏమి చేయలేను నేను…!"

**అన్ని తన ఆలోచనలే అయిన తనకి కాల్ చేయలేదు అది కూడా తన మీద ప్రేమ వల్లే.** నా మదిలో కలలన్ని, నేను తయారు చేసుకున్న స్వర్గానికి వెళ్ళకుండా, పీడకల గా మారి నన్ను ఉలిక్కిపడేలా చేస్తున్నాయి.

మా నాన్న అన్ని చూస్తున్నాడు కానీ ఏమి అనట్లేదు, అడగట్లేదు. వెంకట్ గాడికి కూడా చెప్పలేదు. రెండు మూడు సార్లు కాల్ చేస్తే కట్ చేశా. ఎవరికీ ఏమి చెప్పకుండా, నాలో నేనే నలిగిపోతున్నా, కుమిలిపోతున్నా. ఏడుపు వచ్చినా కూడా ఎడవలేకపోతున్నా. ఉదయం అవుతుంది, రాత్రి అవుతుంది మధ్యలో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. రోజులు కఠినంగా, నిదానంగా నడుస్తున్నాయి.

పది సార్లు కంటిన్యూ గా కాల్ చేసిన తర్వాత, ఈసారి వెంకట్ గాడి కాల్ లిఫ్ట్ చేశాను.

"ఏందిరా ఆ పిల్లకి పెళ్లి కుదిరిందా" అని అడిగాడు.

"హ, నీకు ఎలా తెలుసు"

"నాకేంటి రా ఊరు అందరికీ తెలుసు పెళ్లి కార్డు చూడలేదా"

"చూడలేదు రా.."

"ఏం జరిగింది బే అసలు?"

తప్పక వాడికి జరిగింది చెప్పాను. వాడు రోజు కాల్ చేయడం స్టార్ట్ చేశాడు, దరిద్రాలు షేర్ చేసుకుంటుంటే కొంచెం రిలీఫ్ గా అనిపిస్తుంది. వాడి మాటలతో నాలో ఉన్న పెయిన్ కొంచెం కొంచెం గా తగ్గుతుంది. **మనకి ఎన్ని కష్టాలు వచ్చినా, నిజాయితీగా పంచుకునే వాళ్ళు మన జీవితంలో ఒక్కరు ఉన్నా, ఎంతటి కష్టం చేసే నష్టం అయినా తట్టుకోగలిగే శక్తి నీకు వస్తుంది. మన జీవితంలో చాలా సార్లు చాలా కోల్పోతాం, చెప్పుకోలేని బాధలు వస్తాయి. అలాంటి సమయంలో ఖచ్చితంగా ఎవరో ఒకరి అటెన్షన్ మనకి కావలసి వస్తుంది. అలాంటి అటెన్షన్ నాకు మా నాన్న రూపంలో, వెంకట్ గాడి రూపంలో దొరికింది.**

వాడు నెక్స్ట్ వీక్ ఊరికి వస్తా అన్నాడు...

**********

# 14

# నాన్న మరియు స్నేహితుడి అర్థమైన అర్థంకాని ఓదార్పు

రేపు తన పెళ్లి, ఏదో రకంగా ఉంది, ఏం చేయాలో అర్థం కావట్లేదు. తను నాతో మాట్లాడక నెల దాటింది. చివరి మాటలు చాలా కఠినంగా ఉన్నాయి. ఎలా తట్టుకోవాలో అర్థం కావట్లేదు. సమయానికి వెంకట్ గాడు కూడా ఊర్లో లేడు.

సన్నటి వెన్నెల కాస్తుంది. ఆరుబయట మంచం వేసుకున్నాను. ఆకాశం వైపు చూస్తున్నాను. మనసులో ఏదో ఆశ ఆకాశాన్ని చూసినప్పుడు, ఎందుకంటే నాకు రెండు చుక్కలు కనిపిస్తున్నాయి. వాటి వైపు అలానే చూస్తూ ఉన్నాను. రోజులు తరిగే కొద్ది, సమయం గడిచిపోయే కొద్ది, ఒక చుక్క కాంతి తగ్గుతూ, చివరికి ఈ క్షణాన మాయమైపోయింది. భవిష్యత్ అర్థమైంది, తను నాది కాదు అని తలచినప్పుడు, మనసు చెమ్మగిల్లుతుంది. ఏం తప్పు చేశానో తన విషయంలో గాని, తనని ఇంకొకడితో ఊహిస్తేనే, ఏడుపు తన్నుకొస్తోంది. ఆపుకోలేక పోయాను, ఏడుపు వచ్చేసింది. మా నాన్న రావడం గమనించాను. కదలకుండా పడుకొని ఉన్నాను.

"అరేయ్ కిట్టిగా" అని పిలిచాడు.

నిద్రపోతున్నట్టు నటిస్తున్నాను.

"ఏడ్చింది చాల్లేగాని, లే ముండా" అని అన్నాడు.

చాలా సంవత్సరాల తర్వాత ఏడవటం కదా, నాకే తెలియకుండా గట్టిగా ఏడ్చి ఉంటానని అర్థమైంది. రెస్పాండ్ అయితే ఏడ్చినందుకు మళ్ళీ తిడతాడు. అందుకే సైలెంట్ గా ఉన్నాను.

"ఆడదానిలా ఏడ్చింది చాల్లే..., పోయి తిను పో."

"ఆడదానిలా కాదు, ఆడదాని వల్ల ఏడుస్తున్నాను నాన్న" అని కోపం గా అన్నాను.

"శ్రావణి కోసమా" అని అడిగాడు.

"నీకెలా తెలుసు" అన్నట్లు మొహం పెట్టాను.

"పోయిన వారం ఆ పిల్ల వాళ్ళ నాన్న కలిశాడు."

"నిన్నా...! ఎందుకు కలిశాడు ఆయన?"

"ఒక ప్రశ్న అడిగాడు, దానికి సమాధానం ఇచ్చాను."

"ఎందో ఆ కోటి రూపాయల ప్రశ్న?"

"నా కూతురిని చాలా అపురూపంగా పెంచాను. ఏ లోటు రాకుండా చూసుకున్నాను. దానికి ఇప్పుడు మంచి సంబంధం వచ్చింది. నా స్థానంలో ఉండి చెప్పు, నీ కొడుకు ఉన్న స్థితిలో నా కూతురిని ఇవ్వొచా?" అని అడిగాడు

"నేనైతే ఇవ్వను అని చెప్పా నిజాయితీగా"

“మీ లాంటి మొరటు మట్టి బుర్రలకు ఏం తెలుసు, నిజాయితీగా చెప్పాడంట నిజాయితీగా. నువ్వు ఎమన్నా న్యాయదేవతకి తమ్ముడివా? బర్రెల దగ్గర పేడ ఎత్తే మొహాలు మీరును. అసలే నీ కొడుక్కి ఊర్లో పరువు తక్కువ, తమరు మళ్ళీ ఇంకా తీయండి, అసలు నేను నీ కొడుకునేనా లేక దిబ్బల్లో దొరికితే పెంచావా?”

“దూలానికి వేలాడదీస్తా నా కొడకా ఇంకొక్క మాట నీ నోటి నుండి వచ్చిందంటే”

భయంతో కూడిన గౌరవం వలన మౌనంగా ఉండిపోయాను.

“అసలు తమరి సగం తెలివి తేటలకి, బుర్ర తక్కువ చదువుకి, మనం చేసే ఉద్యోగానికి, చేసే తిక్కల పనులకి ఆ పిల్ల కావాలి రా నీకు? అసలు తమరి కున్న ఆస్తి, అర్హత ఏంటి రా ?”

“వాళ్ళ నాన్న కన్నా, నువ్వే ఎక్కువ బాధపడుతున్నావు. అసలు వాడి కూతురా, లేక తమరి కూతురా…!”

“ఆయన కూతురేగా, ఎందుకు అనుమానం నీకు?”

“అసలు నీలాంటోడికి మా అమ్మని ఇచ్చి తాత తప్పు చేశాడు”

“మీ తాత చేసిన తప్పు, మీ మామ చేయట్లేదుగా సంతోషించు వెదవా…!”

“పేడ పిసుక్కుంటూ, మట్టి తవ్వుకుంటూ, బస్తాలు మోసుకుంటూ నీ చేతులు కాదు, నీ మనసు మొద్దుబారింది నాన్న. అయినా ఆస్తులు ఆ పిల్ల సంపాదించలా, వాళ్ళ నాన్న సంపాదించాడు. నువ్వేమి ఇచ్చావు నాకు.”

“వాళ్లకి కలిసి వచ్చింది. నేను ఎంతైతే సంపాదించానో అంతకు ఇరవై రెట్లు మీ అమ్మకి ఆరోగ్యం బాగలేకపోతే ఖర్చుపెట్టారా. ఆ అప్పులు ఎలా తీర్చమో గుర్తుందా నీకు. ఈ రోజుకి ఎవరి మీద ఆధార పడటం లేదు మనం. నువ్వు వాళ్ళ అమ్మాయిని గెలికిన కూడా, నాతో అసభ్యంగా మాట్లాడలేదు అది మీ నాన్నంటే. నీకు తెలియదు నేనంటే ఏంటో.”

“ఈ ఎచ్చులు ఏదో ఒక ఆంటీ దగ్గర పడి ఉంటే, నాకు పిన్ని అయిన వచ్చేది గా. అయినా నేనేమీ ఆ పిల్ల నీ గెలకల, ప్రేమించా. నీకు అమ్మ మీద ప్రేమ ఉంది కాబట్టే గా ఇంకో పెళ్లి చేసుకోలేదు. ఆ ప్రేమే నాకు ఆ పిల్ల మీద ఉంది.”

“బొక్కెంకాదు, పోయిన వాళ్ళ మీద ప్రేమ పెట్టుకొని పీకేది ఏమి లేదు, కేవలం నీ కోసం. మీ అమ్మ పోయే సమయానికి నాకు 35 ఏళ్లు. చాలా మంది చెప్పారు పెళ్లి చేసుకోమని. వచ్చేది ఎలాంటిది వస్తుందో తెలియదు కదా. అయినా **మన జీవితంలోకి కొత్తగా వచ్చేవారు పాత గాయాలను మాన్పుతారు, వెళ్ళేటప్పుడు కొత్త గాయాలు చేస్తారు.** అది నీకు అర్థం కావాలంటే కొంత సమయం పడుతుందిలే.”

“ఏదో ఒకటి చేసి ఆ పెళ్లిని ఆపు నాన్న..., నాకు ఆ పిల్ల కావాలి.”

“ఆ పిల్లకి నువ్వు కావాలా ?”

నేనేమీ మాట్లాడలేదు ఆ మాటకి.

“ఆ పిల్ల బాధ్యతతో ఆలోచించింది కాబట్టే, పెళ్లి చేసుకుంటుంది. నువ్వు నిర్లక్ష్యం గా ఉన్నావు కాబట్టే నువ్వు అనుకునే ప్రేమని

వదిలేసింది. పెళ్ళికి పో, యాభయ్యో, వందో చదివించి పప్పన్నం తినిరా, అసలే పెళ్ళికి కూడా రమ్మన్నాడు వాళ్ళ నాన్న."

"పెళ్లి చెడగొట్టు నాన్న అంటే, పెళ్లికి పోయి పప్పన్నం తినమంటావు, చూడు ఆ పిల్ల నన్ను పెళ్లి చేసుకుంటా అని మాట తప్పింది."

"మాట తప్పిందా...! ఆ పిల్లలో లోపాలు వెతకమాకు, ఎందుకంటే లోపం, ప్రతి మతంలో ఉంది, ప్రతి కులంలో ఉంది, ప్రతి మనిషిలోనూ ఉంది, నీలో ఉంది, నాలో ఉంది."

"స్కూల్లో పంతులు చెప్పినట్టు పాఠాలు అర్థం కాకుండా చెప్పకు నాన్న."

**"పాఠాలు చెప్పేది, పంతులు మాత్రమే కాదు, జీవితంలో పండిన వాళ్ళు చెప్తారు, నీకొచ్చే పరిస్థితులు చెప్తాయి."**

"జీవితంలో ఏదో కోల్పోయినట్టు ఉంది నాన్న. నాకేమి అర్థంకావట్లేదు. ఏం చేస్తున్నానో, ఏం చేయాలో తెలియట్లేదు. చాలాసార్లు ఓడిపోయాను కానీ, ఎప్పుడూ లేనిది, ఇలా ఇప్పుడు ఎందుకంటే నా దగ్గర సమాధానం లేదు నాన్న." అని ఫస్ట్ టైం నాన్నని గట్టిగా హాగ్ చేసుకున్నాను

"లే ముండా, నన్ను కరుసుకుంది చాలు, లే, నేను ఏమైనా ఆడదాన్ని అనుకున్నావా?"

ఆ మాటకి ఏడుపు ఆగిపోయింది నాలో, ఎలా రియాక్ట్ అవ్వాలో అర్థంకాలేదు మళ్ళీ నాకు.

“అరేయ్ కృష్ణ, ఓడిపోయిన, ఏదైనా కోల్పోయిన దానికి గల కారణాన్ని ఒక వైపు నుండి మాత్రమే చూడొద్దు రా, ఇంకో వైపు నుండి కూడా ఆలోచించ కలిగితే, పరిష్కారం నీకు దొరికినట్టే. నువ్వు పాస్ మార్కులతో పాస్ అయినప్పుడు, మొదట వచ్చిన వాన్ని చూసి కుళ్ళు కోలేదు కదా, ఎందుకంటే నువ్వు ఆలోచించావు, వాడి వైపు నుండి కూడా వాడు బాగా చదివాడు అని, నువ్వు అంతగా చదవలేదని. ప్రశ్న నీకు సంబంధించినది అయితే, సమాధానం ఎవరి దగ్గరో, ఎక్కడో దొరకదు, నీ దగ్గర ఉంటుంది.

అరేయ్, ఈరోజు దాకా నిన్ను చాలా సార్లు కొట్టాను. కానీ ఏ రోజు నువ్వు తిరిగి ఒక్క మాట కూడా అనలేదు, ఎందుకంటే, నీ వయసు కు మించి ఎక్కువ బాధని మోస్తావు, భరించటం తెలుసు. అందరి ముందు తక్కువ చేసుకుంటావు. ఎవరి మీద పగతో ఎప్పుడూ నువ్వు మాట్లాడలేదు. ఈ విషయంలో కూడా అలానే ఆలోచించు. నేను నీ చదువుకి పెద్దగా డబ్బులు పెట్టింది లేదు, నువ్వు అడిగింది లేదు. కానీ నేను చేసిన అప్పులు తీరాయి అంటే, నువ్వు కూడా కారణమే రా...! మన దగ్గర డబ్బు లేకపోతే, బంధువుల చులకన మాటలు మాట్లాడేవారు. అయినా నువ్వు వాళ్ళని తప్పు పట్టలేదు. మన పరిస్థితికి నువ్వు బాధపడలేదు. ఎన్నోసార్లు ఎన్నో అవమానాలు, అయిన ఎవరిని నిందించలేదు, నీకు దేన్ని అయిన తట్టుకొని నిలబడే ధైర్యం ఉంది రా. ఇప్పుడున్న మన పరిస్థితికి ఆ అమ్మాయి తీసుకున్న నిర్ణయమే కరెక్ట్ రా. అది నీకు కూడా తెలుసు కానీ మీతి మీరిన ఇష్టంతో తీసుకోలేకపోతున్నావు...!

చివరిగా ఒకటి గుర్తు పెట్టుకో, **బరువు అనుకున్నావా అయితే దించేయ్, కానీ మళ్ళీ ఎత్తగలిగే బలం కూడగట్టు. అలుపు వచ్చిందా ఆపేయ్, కానీ కదలడానికి మళ్ళీ ప్రయత్నించు.** అంతే కానీ ఇలా చండాలంగా ఏడవ మాకు ఆడపిల్ల కోసం, అదేదో మళ్ళీ దొరకనట్టు."

చెప్పాల్సినవి చెప్పి ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

ఆరోజు రాత్రి మా నాన్న ఇచ్చిన క్లాస్ కి, ఆయన ఏం చెప్పాడో పూర్తిగా ఎక్కకపోయినా, నా గతమంతా గుర్తుకు వచ్చింది. చాలా సార్లు మా నాన్నని బాధపెట్టాను, కానీ ఎప్పుడూ తక్కువ చేయలేదు. తన శక్తికి మించి చేశాడు. ఎన్నో ఏళ్ల నుంచి మా నాన్న ప్రేమని సరిగా అర్థం చేసుకోలేకపోయాను కాదు గుర్తించలేకపోయాను. అన్ని ఆలోచించుకుంటూ, తెలియకుండా నిద్ర పోయాను ఎప్పటికో.

పొద్దున్నే వెంకట్ గాడు వచ్చి నన్ను లేపాడు.

"ఎప్పుడు వచ్చావు రా ?"

"ఎప్పుడు వచ్చావు అన్నది ఇక్కడ ముఖ్యం కాదు, ఇక్కడ అర్జెంట్ గా వస్తుంది, డబ్బా తీసుకొని రా."

"డబ్బా దేనికి రా, చెరువు లో నీళ్ళు ఉన్నాయి గా"

"సరేలే, రా తొందరగా వెళ్దాం."

పల్లెటూరి ఫ్రెండ్షిప్ అంటే నీకు తెలుసుగా, ఎవడికి వచ్చిన ఇంకొకడు తోడు రావాలి.

మొత్తానికి ఊరికి దూరంగా, చల్లటి గాలికి కడుపులో నుండి వదిలితే ఉంటుంది, ఆ సుఖమే వేరబ్బా. నేను ఆ సుఖంలో

మునిగి ఉండగా, వెంకట్ గాడు ఏదైతే గెలకకూడతో అదే గెలికాడు.

“ఒరేయ్ ఈరోజే ఆ పిల్ల పెళ్ళంట కదరా...”

గుర్తుచేశాడు దొంగనాకొడుకు. రాత్రి మా నాన్న క్లాస్ కి ఎందుకో తన గురించి కొన్ని నిమిషాలు మర్చిపోయాను. కడుపులోది దిగి సుఖంగా ఉన్నప్పుడు, మెదడులో, గుండెలో ఆలోచన మొదలై బాధ మొదలైంది.

“ఏం మాట్లాడవు ఏందిరా, ఆ పిల్ల పెళ్ళంటే”

“సాయంత్రం పెళ్లికి వెళ్దాం రా”

“పెళ్ళికా...! చెడగొట్టే ప్లాన్ ఏమైనా వేశావా, నాకేం పాత్ర ఇచ్చావు దాంట్లో” అని ఆత్రంగా అడిగాడు.

“మన చెడిపోయిన బ్రతుకులకు చెడగొట్టే బలం, చేడు చేసే ఆలోచన లేదులే కానీ, నూట డెబ్బై రెండు రూపాయలు ఇంట్లో నుండి తీసుకొని రా. యాభై ఆరు రూపాయలు నీకు, నూట పదహార్లు నాకు.”

“మరి ఎందుకు బే వెళ్ళేది.”

“చదివింపులు ఇవ్వాలంట. మా అయ్యా వెళ్ళమంటున్నాడు.”

“చదివింపులు ఇవ్వాలన్నా, మనం సరిగా చదువుకోలేదు గా, మీ అయ్యా కంటే మ్యాటర్ తెలీదు కాబట్టి ఓకే, నీకేమైంది రా చెత్త నాయాలా.”

“మా అయ్యకు అంతా తెలుసులే, అయినా చదివింపులు ఇవ్వాలంటే చదువుకోవలసిన అవసరం లేదు”

“ఎలా తెలిసింది రా ?”

“చదువుకోవలసిన అవసరం లేదనా, లేక మా నాన్నకి ఎలా తెలిసింది అనా ?”

“మీ బాబుకి ఎలా తెలిసింది అని”

‘శ్రావణి వాళ్ళ బాబు చెప్పాడంట, అందుకే మాట రాకూడదు అని వెళ్ళమని మా బాబు ఆర్డర్ వేశాడు.”

“ఆ పిల్ల నువ్వు గొడవ చేస్తావేమో అని అనుకోని వాళ్ళ బాబుకు కూడా చెప్పింది అన్నమాట. నాకు అయితే ఏం అర్థం కావట్లేదు రా, ఇంత బాధ పెట్టుకొని ఎలా వెళ్తావు రా...!”

“తప్పదు వెళ్ళాలి.”

“ఇప్పటికే చాలా సమయం ఆ అమ్మాయి కోసం వేస్ట్ చేశావు, గుర్తు పెట్టుకోరా, నువ్వు వెచ్చించే సమయం దేనికోసం వెచ్చిస్తున్నావో నీకు తెలిస్తే, ఆ సమయాన్ని నువ్వు సరిగ్గా ఉంచుకున్నట్టే.”

“ఒరేయ్ వెంకట్ గా, గంట నుండి ఇక్కడే కూర్చుని ముచ్చట్లు చెప్తున్నావు, ఇది సమయం వేస్ట్ కాదారా...!”

“ఇది నేచురల్ కాల్ రా, ఎంత టైమ్ అయినా కూర్చోవచ్చు, కానీ అక్కడ నాచురల్ డిజాస్టర్, దూరంగా ఉండాలి రా. నువ్వు బాధ పడతావు.”

“నా కొడకా అప్పుడేమో, ఆ పిల్లను మిస్ చేసుకోకు అని కథలు చెప్పి, ఇప్పుడు టైంవేస్ట్ చేసుకోకు అని కథలు మింగుతున్నావు…!”

“అలా చెప్పానా అప్పుడు?”

“అలానే చెప్పావురా దొంగ నా కొడకా”

“నీకేదో రెండు మంచి మాటలు చెబుదామని హైదరాబాద్ నుంచి వచ్చేశా బే”

**ఫ్రెండ్ అంటే, నీ బాధకి ఓదార్పు ఇచ్చేవాడు, బెస్ట్ ఫ్రెండ్ అంటే నీ బాధని గుర్తు చేసి, నువ్వు బాధపడేలా చేసి, అపుడు ఓదారుస్తాడు. నాకు వెంకట్ గాడిలా మీకు ఎవరైనా ఉంటే నోట్ చేసుకోండి.**

“ఏం చెప్పాలనుకుంటున్నావు రా?”

“నీకు నేను ఇచ్చే మోటివేషన్ కి ఆ పిల్లని మర్చిపోతావు చూడు.”

“ఒరేయ్ వెంకట్ గా, మర్చిపోయిన దాన్ని గుర్తు చేసి, మళ్ళీ మర్చిపోయేలా చేస్తా అంటున్నావు ఏంటి రా”

“విను బే, నీకు బొంబాయి హారిక గుర్తుందా, తను ఏ తిరునాళ్ళలో ప్రభ దగ్గర డాన్స్ వేస్తే అక్కడికి వెళ్ళే వాళ్ళం, ఎన్ని ఊర్లు తిరిగాం, తను చేసిన డాన్సులు చూపించే అందాల కోసం. కొన్ని రోజుల తర్వాత తను ఏమైందో తెలియదు. అక్కడితో ఆగమా ? బొంబాయి హారిక పోతే, చెన్నై సారిక ని చూడడానికి వెళ్ళేవాళ్ళం. నేను నిజం చెప్తే ఏడుస్తావు, బొంబాయి హారిక, నీ శ్రావణి కన్నా పది రెట్లు బాగుంటుంది. అలాంటిది హారికానే నువ్వు మర్చిపోయా వంటే, శ్రావణి ఎంత రా?”

“ఒరేయ్ నువ్వు చెప్పింది నిజమే కానీ, అసలు దానికి దీనికి పోలిక ఏంట్రా?”

“శ్రావణి కోసం నువ్వు ఏదైతే చేశావో, హారిక కోసం మన ఇద్దరం అదే చేశాము. శ్రావణి కోసం తన చుట్టూ తిరిగావు, హారిక కోసం ఊర్లకు ఊర్లు తిరిగాము. శ్రావణి కోసం ఎన్నో చేశావు, హారిక కోసం గొడవ కూడా పడ్డాము అప్పుడే నీ చెయ్యి విరిగింది గుర్తుందా?”

“అరేయ్ చేయి విరిగింది హారిక కోసం కాదురా, నువ్వు కోటప్పకొండ తిరునాళ్లలో దేన్నో గెలికితే వాళ్ళు నీతో పాటు నన్ను రెండు మింగారు, అప్పుడు విరిగింది”

“మధ్యలో డిస్టర్బ్ చేయకురా, శ్రావణి మీద నీకుంది ప్రేమ అయితే, హారిక మీద మనకుంది ప్రేమేరా...”

**“నీకు పిచ్చి పట్టిందో, నాకు పిచ్చి ఎక్కిందో కానీ, నువ్వు ఏంచెప్పాలనుకుంటున్నావో నాకు అర్థమవుతుంది, కానీ అర్థం కావట్లేదు రా...!”**

“సరే, బ్యాలెన్స్ మోటివేషన్ శ్రావణి పెళ్లి తర్వాత చెప్తా.”

**********

15

# ప్రీ క్లైమాక్స్ - పెళ్లి లో తను - ప్రేమలో నేను:

మొత్తానికి పెళ్లికి వెళ్ళడానికి రెడీ అయ్యాము. పెళ్ళి దగ్గరలో ఉండే టౌన్ లోనే. వెంకట్ గాడు బండి తీసుకొని వచ్చాడు. వెంకట్ గాడు డ్రైవింగ్ చేస్తున్నాడు. వెనుక కూర్చున్న నాకు, వెళ్ళే దారిలో రకరకాల ఆలోచనలు, నన్ను చూసి తను పెళ్లి పీటల నుండి లేచి వచ్చి నన్ను హగ్ చేసుకుంటే, లేదా నా మీద ప్రేమతో తను ఏమైనా సూసైడ్ లాంటివి చేసుకుంటే, నా మనసులో ఏదో చిన్న ఆశ, తను నన్ను చూస్తే, పరిగెత్తుకుంటూ వచ్చి ఏడుస్తూ నన్ను లేపకపో అని అంటుందేమో. ఇలాంటి ఎన్నో ఆలోచనలతో కళ్యాణ మండపం దగ్గరికి వెళ్ళాను, సారీ వెళ్ళాము.

పది నిమిషాల క్రితం నా మదిలో మెదిలిన ఆలోచనలు అన్ని వేస్ట్ అని, బయట ఉన్న ఫ్లెక్సీ చూసినప్పుడే అర్థమైంది. ఫ్లెక్సీ లో ఇద్దరు బాగున్నారు, ఈలోపు వెంకట్ బండి పార్క్ చేసి వచ్చాడు.

“బలే ఉన్నారురా ఇద్దరు నవ్వుతూ, జంట మాత్రం అదిరింది. మీ మామ బలే అందగాన్ని పట్టాడు రా” అని వాడు అనగానే, నా మొహంలో ఫ్యూజులు ఎగిరి మాడిపోయింది.

“నాగేంద్ర వెడ్స్ శ్రావణి మాత్రం రామకృష్ణ వెడ్స్ శ్రావణి కన్నా బాగుందిరా”

వాడు, నన్ను ఇంత బాధపెడుతున్నా నేను ఏమి అనలేకపోతున్నాను వాన్ని, ఎందుకంటే ఇద్దరికి చిన్నప్పటి నుంచి బాధలని సీరియస్ గా తీసుకునే అలవాటు లేదు. ఎన్నో సార్లు అవతల వాళ్ళ బాధలు మాకు నవ్వు తెప్పించేవి. కాకపోతే ఇప్పుడు కొంచెం కలుక్కు మంటుంది వాడు అలా అంటుంటే.

సమయం ఎనిమిది అవుతుంది, లోపలకి వెళ్ళాము. ఫ్లెక్సీ చూసి ఫ్యూజులు ఎగిరితే, మండపంలో వాళ్ళ ఇద్దరినీ చూసి ట్రాన్స్ఫార్మర్ కాలిపోయింది. తన నవ్వు, సంతోషం చూస్తుంటే అది వాన్ని లవ్ చేసి పెళ్ళి చేసుకున్నట్టు ఉంది.

ఈలోపు వెంకట్ గాడు,

“ఎంత సేపు చూస్తావు రా వాళ్ళని.”

“వచ్చింది చూడడానికే కదరా”

“సరే చూసుకో అయితే, కుమారి వస్తుంది రోయ్”

“ఎలా ఉన్నావు కుమారి?”

“బానే ఉన్న కృష్ణ అన్నా”

“ఏం కుమారి అక్కడ చీమిడి ముక్కలు వేసుకొని ఆడుకునేది మన పిల్లలేనా?” అని వెంకట్ గాడు అన్నాడు.

“సచ్చినోడా, మన పిల్లలు ఏంది, నా పిల్లలు” అని విసురుగా చెప్పింది.

"బజారులో ముసలోళ్లు గొణుక్కుంటుంటే విన్నా, నిన్ను మీ ఆయన అదే శ్రీను గాడు రాత్రి తన్నాడు అంటగా."

"నీలాంటోడు ఎవడో మా ఆయనకు లేనిపోని మాటలు చెప్తున్నారు."

"లేనివి ఎందుకు చెప్తారులే, ఉన్నవే చెప్పి ఉంటారు."

"కృష్ణా అన్నా, నువ్వు బాగుండాలంటే ముందు వెంకట్ ని దూరం పెట్టు"

"ఉచిత సలహాల వీర వనిత, ఈ పెళ్ళి ఆగే ఛాన్స్ ఏమైనా ఉందా?"

"పెళ్ళి ఎందుకు ఆగిపోద్ది, వాళ్ళు ఇద్దరు చూడు సీత రాముల లాగా ఉన్నారు."

"నువ్వు పెళ్లి చేసుకున్నప్పుడు కూడా మీ జంటని అందరూ ఇలానే అన్నారు. ఇప్పుడూ చూడు ఆరు నెలలకు ఒకసారి నిన్ను కొడుతున్నాడు."

"ఆరు నెలలకు ఒకసారి కొడుతున్నాడు అని నీకెలా తెలుసు వెంకట్" అని సీరియస్ గా అడిగింది.

"అరేయ్ కిట్టిగా అలియాస్ రావణాసురుడా, సీతరాములని చూసింది చాలు, పదా, బకాసురుడిలా తినడానికి వెళ్దాం. బోజనాలు కూడా స్టార్ట్ అయ్యాయి. ఫస్ట్ తిందాం రా. మళ్ళీ ఐటమ్స్ అయిపోతాయి" అని ఆత్రంగా అన్నాడు.

"సరే, కుమారి తినడానికి వెళ్తున్నాం." అని అన్నాను

"అందుకేగా వచ్చింది వెళ్ళండి."

ఆ మాటకి ఎలా రియాక్ట్ అవ్వాలో నాకు తెలియలేదు.

విస్తరాకులు వేయడానికి ముందు ఒక మాట అన్నాడు వెంకట్...

"అన్ని ఐటమ్స్ టేస్ట్ చెయ్ ఎలా ఉన్నాయో, నీ పెళ్ళికి అంతకన్నా ఎక్కువ ఐటమ్స్ అంత కన్నా రుచితో నేను చేయిస్తా ఇదే నా ప్రామిస్"

కెమెరామెన్ వీడియో తీస్తున్నప్పుడు మాత్రం యాక్ట్ చేసి, తరువాత అన్ని ఐటమ్స్ టేస్ట్ చేశాను. అన్ని తిని చేతులు కడుక్కునేటప్పుడు వెంకట్ గాడు అన్న మాటలు నేనే కాదు, మీరు కూడా మర్చిపోరు.

"నా లైఫ్ లో ఇంత మంచి ఫుడ్, టేస్టీ ఫుడ్ ఎక్కడ తినలేదురా, భవిష్యత్ లో ఎవరు కూడా ఇంత గ్రాండ్ గా పెట్టలేరురా. నీ మామ కి దండం పెట్టాలని ఉందిరా. ఇది నిజం" అని అన్నాడు.

అప్పుడు అర్థమైంది నేను మామూలుగా అయితే తినను అని, నా చేత తినిపించడానికి నన్నే మాయ చేశాడు దొంగ నా కొడుకు. అందుకే ఫ్రెండ్ మాటలు, చేతలు అర్థమవుతాయి కానీ బెస్ట్ ఫ్రెండ్ పనులు, చేతలు అర్థంకాకున్న, ఎలా ఉన్నా చివరికి నీకు మంచే జరుగుతుంది. ఇద్దరం కలిసి ఎన్నో వెదవ పనులు చేశాం, మంచి పనులు చేశాం, తన్నులు కూడా కలిసే తిన్నాం. నేను సంతోషంగా ఉన్నప్పుడు వాడు సంతోషంగా ఉండేవాడు, నేను బాధలో ఉన్నప్పుడు కూడా వాడు సంతోషంగా ఉండి నన్ను సంతోష పెట్టాలనుకునే వాడు.

**నీ లైఫ్ లో కూడా నీ దరిద్రాన్ని షేర్ చేసుకునే వాళ్ళు ఒక్కరైనా ఉంటారు. చిన్న చిన్న విషయాలకి అలాంటి వాళ్ళని దూరం చేసుకోకండి.**

తిన్న తర్వాత, పెళ్లి జరుగుతున్న దగ్గరకి వచ్చాము. బట్టలు మార్చుకోవడానికి పెళ్లి కూతురు, పెళ్లి కొడుకు వెళ్ళారు. వెంకట్ గాడు, పంతుల దగ్గరికి వెళ్ళి ఏదో మాట్లాడి వస్తున్నాడు. నాకు భయం వేసింది, వీడు ఏదైనా కొలువు తెస్తాడేమో అని. నా దగ్గరికి వచ్చి కూర్చున్నాడు.

"పంతులు తో ఏం మాట్లాడావు రా."

అప్పుడు వాడు చెప్పింది వింటే, మీరైతే వాన్ని ఎగరేసి తంతారు.

"వాళ్ళ ఇద్దరికీ ఫస్ట్ నైట్ ముహూర్తం ఎప్పుడు" అని అడిగాడంట. అడగటమే కాదు తెలుసుకొని వచ్చి చెప్పాడు. "నైట్ ఒకటికి వాళ్ళు ఇద్దరు ఒకటయ్యే ముహూర్తం పెట్టారంటా" అని చెప్పాడు.

ఆ మాటకి గుండెల్లో వెయ్యి ముళ్ళు ఒకేసారి గుచ్చుకుంటే ఎలా ఉంటుందో అలా ఉంది. కళ్లు బయర్లుకమ్మాయి. అందరి మాటలు ఏదో గుసగుసలు లాగా, చిన్నగా వినిపిస్తున్నాయి. నేను ప్రేమించిన అమ్మాయి, ఇంకోడి పక్కన, ఆ ఊహ నన్ను చిత్రవధ చేస్తుంది. వాళ్ళ ఫస్ట్ నైట్, నా డెత్ నైట్ అయ్యేలా ఉంది.

ఆ సమయంలో మళ్ళీ వెంకట్ గాడు, "అరేయ్ రామకృష్ణ" అని నన్ను కదిలించాడు, చిన్నగా నార్మల్ కి వచ్చాను. మా నాన్న ఎన్నో చెప్పాడు, నేను కూడా ప్రాక్టికల్ గా ఎంత ఆలోచిద్దామనుకున్నా, ఏదో తెలియని ఫీలింగ్ నన్ను వెంటాడుతుంది. నా మనోవేదన పెళ్లి పీటలు ఎక్కుతున్న శ్రావణి కి ఎప్పటికీ అర్థం కాదు కావోచ్చు.

నన్ను బయటకు తీసుకు వచ్చాడు.

"అరే మొహం అలా పెట్టకు, ఇప్పుడు జరుగుతుంది నిజం, జరగబోయేది నీకు తెలుసు, నాకు తెలుసు, ఫీలింగ్స్ వదిలేయ్,

కనీసం వదిలేయడానికి ట్రై చెయ్. కష్టాన్ని కష్టంలాగ, అవమానం లాగా మనం ఎప్పుడూ చూడలేదు, ఇప్పుడు కూడా అలానే. ఇక శ్రావణి నీది కాదు, తనకి నువ్వు అక్కర్లేదు ఎందుకంటే నీ విలువ తనకి తెలియదు. ఊహలతో ఆలోచించకు, నిజంలోకి రా. **జరిగిన దాంట్లో నీ తప్పు లేదు, జరగబోయే దాంట్లో నీ తప్పు లేకుండా చేసుకో.**

జీవితంలో నీకు తట్టుకోలేనంత బాధ కలిగితే, గుర్తుపెట్టుకో తప్పకుండా దానిని అధిగమించడానికి నీకో అవకాశం వస్తుంది. ఆ అవకాశం ఏంటో నీకు ఇప్పుడు తెలియక పోవచ్చు కానీ, నీ ఎదురుగా వచ్చినప్పుడు మాత్రం వదిలిపెట్టకు."

వాడి మాటలు కఠినంగా ఉన్న, వాడు చెప్పిందే నిజం. తను నాది కాదు.

"చివరిసారి తనని చూసి వస్తాను" అని వాడితో అన్నాను.

"సరే, పోయి చివరి చూపులు చూసిరా"

నేను నడుస్తూ మండపం లోపలకి వెళ్తున్నాను, ఆ సమయం లో ఏదో తట్టుకొని పడబోయాను...,


**"పడ్డాం కదా అని ఆగిపోవద్దు.., ముందుకు చూడు, దారి తెలుస్తుంది. పరిగెత్తుతున్నాం కదా అని వెనక్కి చూడడం మరువకూడదు.., నీ సహాయం ఎవరికైనా అవసరం అవుతుంది."**

"హా హా..., పిచ్చ కొటేషన్, సందర్భం లేని అర్థమైన కొటేషన్ వెంకట్"

**********

16

# తనకి వినపడని నా మాటలు



మండపంలో కి వచ్చేశాను మళ్ళీ. తను నాకు స్పష్టంగా కనిపించేంత దూరం లో ఉన్న, తన మనసులో నేను లేనని వాళ్ళ చిరునవ్వులోనే తెలుస్తుంది. తను పెళ్లి చేసుకుంటుంటే, నా మనసు అంగీకరించకుండా, తనకి వినపడదు అని తెలిసినా, తనతో మాట్లాడుతుంది...!

“నువ్వు పెళ్లి బట్టల్లో చాలా ముచ్చటగా ఉన్నావు శ్రావణి, తర్వాత దిష్టి తీయించుకో.

నీ నవ్వు మండపం వెలుతురిని మరింతగా కాంతివంతం చేస్తుంది, కానీ అదే నవ్వు నా మనసును చీకటితో నింపుతుంది.

నా ఊహల్లో కట్టుకున్న ఆశలని, నీ పెళ్లి మంటల్లో వేసి బూడిద చేస్తున్నావ్.

నీ నవ్వు చూస్తే చాలు అనుకున్న, కానీ ఇప్పుడు అదే నవ్వుతో నవ్వులపాలు అవుతున్నా...

అన్నింటిలో తోడుంటానన్నావు, కానీ ఇప్పుడు ఒంటరిగా బాధ పడుతున్నా...

మన మధ్య దూరం లేదన్నావు, కొలవలేనంత దూరంగా నెట్టేసావు...

నువ్వే నా జీవితం అన్నావ్, కానీ జీవించడం కష్టమనేలా చేశావ్...

ప్రేమించానన్నావు, కానీ ఆ ప్రేమ నా దగ్గర లేకుండా చేస్తున్నావ్...

ప్రేమ గుడ్డిదో కాదో నాకు తెలియదు కానీ, నిన్ను ప్రేమించినందుకు ఈ క్షణాన్ని చూడటం కంటే గుడ్డివాడిని అయింటే బాగుండేది...

నా అడుగులు ముందుకు కదలట్లేదు...

నా మనసుకి ఊపిరి సరిగా అందట్లేదు...

బ్రతకాలంటే భారంగా ఉంది, చావాలంటే బాధ్యత గుర్తొస్తుంది...

ఈ ప్రేమ నన్ను హరిస్తుందో, దహిస్తుందో తెలియక, నా ఎదలోనే పూడుస్తున్నా...

ఈ క్షణం, కాలాన్ని ఆపి నీతో ఎన్నో చెప్పాలనుకున్నా, చెప్పలేకపోతున్న...., ఎందుకు ఇలా చేశావే అని మొహం మీద

అడగాలనుకున్నా కానీ,  అడగలేకపోతున్నా..., భయంతోనో, మొహమాటంతోనో కాదు, చెప్పలేనంత, మోయలేనంత ప్రేమ ఉండటం వల్ల.

కొన్నిసార్లు అలలు నిన్ను సముద్రం నుంచి బయటకు నెడతాయి, కొన్నిసార్లు అవే అలలు నిన్ను సముద్రం లోపలకి తీసుకెళ్తాయి. మొదటిసారి నిన్ను చూసినప్పుడు, నాలో ఉన్న అప్పటి బాధని బయటకు నెట్టేశావు, చివరిసారి నిన్ను చూస్తున్నప్పుడు, మళ్లీ బాధలోకి నెట్టేశావే. కానీ మధ్యలో నువ్వు చూపించిన ప్రేమని ఎప్పటికి మరువలేను. అవును నేను ఏడుస్తున్నాను, కానీ ఏడిపించిన నువ్వు మాత్రం జీవితాంతం సంతోషంగా నవ్వుతూ ఉండాలని, నువ్వు బాగుండాలని ఈ బాగాలేని  మనసు కోరుకుంటుంది.

నీకు ప్రపోజ్ చేసేటప్పుడు, నీ రియాక్షన్ ఎలా ఉంటుందో తెలియక, తెలివిగా ఫూల్స్ డే ని ఎంచుకున్న నేను, నీతో పూర్తిగా బ్రేక్ అప్ అవుతున్న ఈ సమయంలో, నేను నిజంగా నీ ప్రేమలో ఫూల్ అయ్యానే. ఇక మన ప్రేమ, గతానికి గుర్తు మాత్రమే, దానికి వర్తమానం, భవిష్యత్తు రెండు లేవు. ఈ  క్షణం నన్ను జీవితాంతం బాధ పెడుతూనే ఉంటుంది. బాధ్యతతో, బాధతో, ఇక్కడి నుండి, నీ జీవితం నుండి, నువ్వు చేసిన ప్రేమ గాయంతో నిష్క్రమిస్తున్నాను.

**ప్రేమలో పెళ్లి ఉంటుంది, పెళ్లిలో ప్రేమ ఉంటుంది. కానీ, నీ పెళ్లిలో నా ప్రేమ లేదు, నా ప్రేమలో మన పెళ్ళి లేదు. నా కన్నీళ్లను, ఎంత దాచాలనుకుంటున్నా, దాగట్లేదు.** నా మనసులో నువ్వు చేసిన

ప్రేమ సంతకం నువ్వే చెరిపేస్తే ఏం చేయమంటావు నన్ను? నా ప్రేమ మీద మన్ను పోసి, ప్రేమ  ఊపిరి తీస్తుంటే బాధ పడకుండా ఉండమంటావా శ్రావణి? ఆకాశంలో, మళ్ళీ ఒంటరి చుక్క అయిపోయాను. కళ్ళలో ఉండే చాలా కన్నీటి చుక్కలు తోడుగా ఉన్నాయి ఈ క్షణం నాతో.

**నాతో కలిసి నడుస్తుంటే, కడదాకా కలిసి ఉంటావనుకున్నా, కానీ నా ప్రేమను  కాటికి పంపడానికి నాతో ఇన్ని రోజులు నడిచావు అని అర్థం చేసుకోలేకపోయాను. జంటగా నడవాలి అని అనుకున్న దారిలో, ఇప్పుడు ఎటువంటి వెలుగు లేదు, అలికిడి లేదు. నిశ్శబ్దంగా, ప్రాణం లేకుండా ఉంది. చీకటిగా, నిశ్శబ్దంగా ఉన్న దారిలో ఒక్కడినే బరువైన జ్ఞాపకాలతో నడవబోతున్నాను...!**

బాధతో, ఏడుపు మొహం తో బయటకి వస్తున్నా నాకు, వెంకట్ గాడు ఆనందంతో వెల్కమ్ చెబుతున్నాడు బీర్లు, స్టఫ్ తో...!

**********

17

# తుమ్మ చెట్టు కింద

వెంకట్ గాడి కి రోడ్డుకి దగ్గరలో అర ఎకరం పొలం ఉంది. దాంట్లో తుమ్మ చెట్టు ఉంది. పైన వెన్నెల కాస్తుంది. ఫుల్ గా పెళ్ళి భోజనం చేశాక కూడా తాగడానికి సిద్ధమైన మనసులు. పది బీర్లు, చికెన్ తందూరి, చికెన్ లెగ్ పీసులు, చేపల ఫ్రై ఇంకా గని కిచిడీ. సెటప్ రెడీ.

“వెంకట్ గా నాకు ఆరు బీర్లు, నీకు నాలుగు, సరేనా?”

“ఎందుకమ్మా అలా?”

“హో, బాధ నాది రా.”

“గాడిద గుడ్డేం కాదు, డబ్బులు నావి, పైగా నువ్వు చెప్పే దరిద్రం అంత వినాలి కాబట్టి నాకు ఆరు, నీకు నాలుగు. ఇందులో ఎటువంటి మార్పు లేదు.”

“హో, డబ్బులు నువ్వు ఇచ్చావు కదా వెంకట్ గా, సారీ వెంకటేశ్వర్లు గారు, నీ అంత మంచి వాడు నా ఫ్రెండ్ గా ఉన్నందుకు గర్వపడుతున్నా రా..! పురాణ పురుషుడు అంటే పాత రోజుల్లోనే

ఉండేవారు అనుకున్నా, కానీ ఈ రోజు నువ్వు నా కంటికి పురాణ పురుషుడి లాగా, పుణ్యమూర్తి లాగా కనిపిస్తున్నావు. మహానుభావుడు కి అన్న లాంటి వాడివి రా...!"

"రేయ్, నీకు పుణ్యం ఉంటుంది, దయచేసి పొరపాటున కూడా నాకు గౌరవం ఇవ్వకు, నా మీద ప్రేమ చూపించకు, నాతో పద్ధతి గా మాట్లాడకు."

"వెంకట్ సార్..."

"వద్దురా, నాకు నీ మర్యాద వద్దు. కావాలంటే తిట్టు, అమ్మనా బూతులు తిట్టు, అంతే కానీ నా జీవితాన్ని నాశనం చేయకురా...!"

"అది కాదండీ వెంకటేశ్వర్లు గారు..."

"నీ జీవితంలో నువ్వు గౌరవించి, ప్రేమించి, పద్ధతి గా మాట్లాడింది ఇద్దరితోనే. అందులో ఒకరిని పైకి పంపించావు, ఇంకొకరిని కంటికి కనపడనంత దూరం పంపావు. నాకు ఇప్పుడిప్పుడే జీవితం మీద ఆశలు వస్తున్నాయి" అని వెంకట్ గాడు దండం పెడుతూ చెప్పాడు.

"బాధపడకు పొగడనులే"

అంతే, ఇక "మొదలు పెడదాం" అని మొదటి బీర్ తీసుకొని, వెంకట్ గాడు నవ్వుతూ చీర్స్ కొట్టాడు.

"దొంగ నాకొడకా, అసలే బాధలో ఉంటే నవ్వుతూ చీర్స్ కొడతావా బే"

“ఎహె, బాధని మర్చిపోయి సంతోష పడడానికి కొట్టే చీర్స్ బే ఇది. నీ బాధని మొత్తం బయటకి పంపిస్తా. అందుకే గా ఈ సెటప్ అంతా.”

“అరేయ్ వెంకట్ గా, మనం ఇలా మందు కొట్టి చాలా రోజులు అయింది రా. నువ్వు ఎక్కడో ఒక జాబ్, నేను ఎక్కడో జాబ్, అసలు ఈ జాబ్ లు మన టాలెంట్ కి సరిపోయినవి కాదురా.”

“కిట్టిగా, మన మొహాలకి, తెలివితేటలకి ఈ జాబ్ లు రావటమే గొప్పరా”

“అది నీకు రా, నాలాంటి స్కిల్స్ ఉన్న వాన్ని సమాజం గుర్తించటం లేదురా.”

“తాగి నీకు అర్థం కావడం లేదు కానీ, నీకున్న స్కిల్స్ మూడు చెప్పురా” అని వెటకారం గా అన్నాడు

మౌనంగా ఉండిపోయాను అవమానంతో

“సరే ఒకటైన చెప్పు రా”

“హా, హార్డ్ వర్కింగ్ రా”

“అయితే మూటలు మోయి, లేదా ట్రక్ లోకి బస్తాలు ఎక్కించు.”

“సరే ఒప్పుకున్నాలే, మనకి టాలెంట్ తక్కువ. ఇంకో మాటలో చెప్పాలంటే, మూడు రంగుల జెండా కనపడితే చాలు, రంగు తో పనిలేకుండా అది జాతీయ జెండా అని అనుకునే తిక్కల గుయ్యాలం. అంతేనా?”

“హ ఇది నిజమే కిట్టిగా, బాధలో ఉన్నావు, పైగా తాగి నీ గురించి నువ్వు ఎక్కువ ఊహించుకుంటున్నావు కాబట్టి, మన కుల దైవం గురించి నీకు గుర్తు చేయాల్సిన సమయం వచ్చింది. మనం పుస్తకాల్లో చదువుకున్న మూడు చేపల కథ నీకు గుర్తుందా?

“ఉంది రా”

“దీర్ఘదర్శి లాగా ముందు చూపు ఉందా మనకి?”

“చూపే సరిగా లేదు, ఇక ముందు చూపు ఎలా ఉంటుంది.”

“ప్రాప్తకాలజ్ఞుడిలా సమయ స్ఫూర్తి ఉందా?

“స్ఫూర్తి లేదు, సమయ స్ఫూర్తి లేదు”

“ఇక మిగిలింది, మన కుల దైవం, మన ఇలవేల్పు, మన స్నేహితుడు. పేరేంటి?”

“దీర్ఘసూత్రుడు…”

“మన జీవితానికి మనం దీర్ఘసూత్రుడు, పీకేది ఏమి లేదు, ఏం జరిగిన చూస్తూ ఉండటం తప్ప” అని ఇక వాడి కష్టాలు చెప్పడం మొదలు పెట్టాక, మనసుకి ఆనందంగా ఉంది. ఎందుకంటే అవతల వాడి బాధలు మనకి ఎప్పుడూ ఎంటర్టైన్ గానే ఉంటాయి.

వాడి జాబ్, వాడి దరిద్రాలు విన్నాక, మనసు ఊగిసలాడి పోతుంది. సరిగ్గా, ఆ సమయంలో మా ఊరి పిల్ల బ్యాచ్ ఎవరో సిట్టింగ్ కోసం ఇక్కడికి వస్తున్నట్టు ఉన్నారు.

వెంకట్ గాడు “అరేయ్ వాళ్ళని భయపెడదాం రా” అన్నాడు.

సరే అని వింత వింత అరుపులు చేసుకుంటూ, వాళ్ళ దగ్గరికి పరిగెత్తుకుంటూ వెళ్ళాము. అంతే ఆ పిల్ల బ్యాచ్ హడలిపోయి, కేకలు వేసుకుంటూ పొలాల్లో ఎటు పడితే అటు ఉరికెత్తారు.

నవ్వుకుంటూ, చిన్నగా సిట్టింగ్ ప్లేస్ కి వచ్చాము. వెంకట్ గాడి దరిద్రాలు వింటూ, ఆ  పిల్ల నాయల్ల ఆర్తనాదాలు గుర్తుకు వస్తుంటే, శ్రావణి కి పెళ్లి అయిందని, నేను బాధ పడాలని మర్చిపోయి నా మనసు ఆనందంతో తాండవిస్తుంది.

సరిగ్గా, ఆ సమయంలో వెంకట్ గాడు "టైమ్ ఎంత రా?"

"ఒకటిన్నర దాటింది."

"అయ్యో..."

"ఏమైందిరా"

"వాడి పేరు నాగేంద్ర కదా"

"ఎవడి పేరు రా"

"శ్రావణి మొగుడు పేరు"

"హా, అవును' అని నవ్వు పోయి మొహం లోకి బాధ వచ్చింది.

"ఈ పాటికి శ్రావణి ఇచ్చిన పాలు తాగి, ఆ పిల్లని ఆ నాగేంద్ర గాడు కాటు వేసి ఉంటాడు రా"

ఆ డైలాగ్ కి దుఃఖం తన్నుకొని వచ్చింది. గట్టిగా ఏడవటం మొదలు పెట్టాను. "బ్యా.. బ్యా. బా.."

వెంకట్ గాడు "ఏడవకు రా, నేను ఉన్నాగా నిన్ను ఎంటర్టైన్ చేయడానికి" అని నవ్వుతున్నాడు.

“ఉడుత తోక నాయాల, గుర్తు చేసి ఏడిపించి ఎంటర్టైన్ చేస్తా అని నవ్వుతున్నావా రా వెంకట్ గా”

“అది కాదు బే”

“సరేలే, ఒకసారి పైకి చూడు” అని ఏడుస్తూ అన్నాను.

“ఎందుకురా, మళ్ళీ రెండు చుక్కలు కానీ వచ్చాయా?”

“కాదు బే, చూడు ఆ చందమామ ఎంత వెలిగిపోతుందో.”

“అయితే?”

“ఈ అర్ధరాత్రి ఇక్కడ లైట్ లేకుండా తాగుతున్నామంటే ఆ చందమామ వెలుగు వల్లే కదరా. అలాంటి చందమామ వెలుగు నా జీవితంలో ఇక లేదురా.”

“అరేయ్ కిట్టిగా, నువ్వు చెప్పేది నిజమే, చందమామ వెలుగు బాగుంటుంది. కానీ ఈ రాత్రి గడిస్తే వచ్చే సూర్యుడి వెలుగు, చందమామ అంత అందంగా లేకపోయినా, దానికున్న విలువ, స్పష్టత చందమామ వెలుగు కన్నా చాలా ఎక్కువ. అందువలన, సూర్యుడి వెలుగు కోసం ఎదురు చూడు, చందమామ వెలుగుని ఇక మర్చిపో.”

“రే వెంకట్ గా, నువ్వేమన్నా డాక్టర్ వారా, ఇన్ని నీతులు చెప్తున్నావు.”

“అవును రా, నేను డాక్టర్ నే, అందుకే, ప్రేమ అనే రోగంతో ఉన్న నీకు, ఈ మందును పోస్తున్నా.”

ఇద్దరం మూడు మూడు బీర్లు తాగం. ఇంకా నాలుగు మిగిలాయి.

"ఒరేయ్ వెంకట్ నేను ఒక్కడినే బాధపడటం నాకు ఇష్టం లేదురా"

"నేను కూడా బాధ పడాలా ఏంటి ?"

"అవసరం లేదు, ఇంకొక నిజమైన ప్రేమికుడు కాంటాక్ట్ నెంబర్ నైన్ ఉన్నాడు"

"ఇంకెందుకు ఆలస్యం ఫోన్ కలుపు"

నా కాంటాక్ట్ లిస్ట్ నుండి ఆ నెంబర్ కి కాల్ చేశాను, రింగ్ అవుతుంది కానీ ఎత్తలేదు. మళ్ళీచేశా, ఎత్తలేదు, మూడోసారి ఎత్తాడు.

"హలో"

"హ హలో ఎవరు ఈ టైం లో"

"నువ్వు నెంబర్ నైన్ కదా"

"తాగి కాల్ చేశారా?"

"కాదు, తాగుతూ కాల్ చేశాను."

"ఎవడ్రా నువ్వు?"

"మన ఇద్దరం ఒక పెళ్ళిలో కలుసుకున్నాం లే, అప్పుడు నీకు నైన్ నెంబర్ ఇచ్చాలే."

"ఒరేయ్ ఎవరివో కరెక్ట్ గా చెప్పు రా, నైన్ నెంబర్ ఏంది?"

"నాకు తెలిసి శ్రావణి కి లైన్ వేసే వాళ్ల సంఖ్య లే, పేరు గుర్తుందా?"

"హ, బ్రో, నువ్వా? కాల్ చేశావంటే బ్రేక్ అప్ అయిపోయింది"

"అవును రా నీ దిష్టే తగిలినట్లు ఉంది"

"ఆ పిల్ల అడ్రస్ చెప్పు బ్రో, మా నాన్న ని తీసుకొని వచ్చి మాట్లాడుతా."

"బాగా తొందరగా ఉన్నావు రా"

"చెప్పాగా బ్రో లవ్ యట్ ఫస్ట్ సైట్, ఆ పిల్ల పేరు చేతి మీద టాటూ కూడా వేయించా"

"నా మనసులో బొమ్మ గీస్తేనే వెళ్ళిపోయింది, నీ టాటూ ఎంతరా"

"పర్లేదు బ్రో, తన అడ్రస్ పంపు, కుదిరితే ఆ పిల్ల నెంబర్ కూడా పంపు"

"అబ్బా"

"ఆరాటం బ్రో, నీ లవ్ ఫెయిల్ అయ్యి నాకు కాల్ చేయాలని వెళ్లిన ప్రతి గుడిలో మొక్కుకున్నా బ్రో"

"చూడు రా వెంకట్, ఈ సమాజం లో ఎటువంటి మనుషులు ఉన్నారో..."

"వెంకట్ ఎవరు బ్రో"

"స్నేహితుడి రూపంలో ఉన్న నా శత్రువు"

"ఓహో, తొందరగా నెంబర్ ఇవ్వు బ్రో"

"నెంబర్ తనది కావాలా లేక వాళ్ళ ఇంట్లో వాళ్ళది కావాలా?"

"నీ ఇష్టం బ్రో, ఏది ఇచ్చినా ఓకే"

"సరే వాళ్ళ ఆయన నెంబర్ ఇస్తా తీసుకో ! "

"ఆయన...! ఏ ఆయన?"

“హ శ్రావణి మొగుడు”

“ఎప్పుడు పెళ్లి అయింది బ్రో”

“ఎప్పుడు అయిందో గుర్తులేదు కానీ ఇప్పుడు మాత్రం శోభనం అవుతుంది లేదా అయిపోయి ఉండొచ్చు.”

వాడు ఏం మాట్లాడట్లేదు

“హలో మాటలు రావటం లేదు ఎందుకు రా. ఏడుస్తున్నావా నెంబర్ నైను, నా లవ్ పోయిన దాకా గుడికి వెళ్లావు, ఇప్పుడు వాళ్ళ ఆయన పోవాలని గుడికి పో, పోయే దాకా వెయిట్ చెయ్...! ఇక ఉంటా, బాధపడు, బాయ్...”

“ఒరేయ్ వెంకట్ గా, నాకు తోడు దొరికాడురా ఏడవటానికి, పద టాయిలెట్ పోసుకుందాం”

టాయిలెట్ పోసుకునేటప్పుడు,

“మనం ఇద్దరం బెస్ట్ ఫ్రెండ్స్ రా, చూడు ఒకేసారి ఒకే వేవ్ లెంగ్త్ లో పోస్తున్నాం”

“నిజమేరా వెంకట్ గా. **అయిన నేను ఏం తక్కువ చేశారా దానికి? సైకిల్ ఎక్కించా, బైక్ ఎక్కించా, ఆటో ఎక్కించా, బస్ ఎక్కించా, ట్రైన్ కూడా ఎక్కించా కదరా వెంకట్.”**

**“ఫ్లైట్ ఎక్కించావా, లేదు కదా అందుకే ఫ్లైట్ లో పోతుంది.”**

నా నోరు మూగబోయింది.

ఆ తరువాత సిట్టింగ్ ప్లేస్ కి వచ్చాము.

“వెంకట్ గా నువ్వు ఎప్పుడూ ఏ అమ్మాయిని ప్రేమించలేదా బే. పైగా హైదరాబాద్ లో ఉంటున్నావు, అందమైన అమ్మాయిలు, హా, హా..”

“ఎప్పుడూ, ఎవరిని ప్రేమించాలి అనిపించలేదు కానీ, ఒక రోజు ఒక క్షణం నాకు ఒక అమ్మాయి నచ్చింది రా.”

“ఎవరు రా ఆ అప్సరస?”

“కుమారి రా”

“కుమారి నచ్చిందా...! ఏం కనపడింది రా ఆ పిల్లల తల్లిలో”

“నీ లవర్, సారీ ఎక్స్ లవర్ పెద్దమనిషి ఫంక్షన్ లో కుమారి ఒక డైలాగ్ చెప్పింది గుర్తుందా. ‘ఈ మధ్య అందరూ నా వెనకాలే పడుతున్నారు, ఆడపిల్లగా పుట్టడం పాపం అయింది’ అని. ఆ కాన్ఫిడెన్స్ కి ఆ క్షణం పడిపోయారా. అందుకేరా, ఆరు నెలలకి ఒకసారి, కుమారి వాళ్ళ మొగుడికి ఫోన్ చేసి, ఆ పిల్లంటే నాకు ప్రాణం, నువ్వు ఎందుకు పెళ్లి చేసుకున్నావురా అని రక రకాల నెంబర్ ల నుండి ఫోన్ చేసి తిడతాను. నేను వాన్ని తిట్టిన రోజు, దానికి తన్నులు.”

“ఎందుకురా అలా..”

“ప్రేమ గాయాలు రా”

“చెత్త నా కొడకా”

వెంకట్ గాడు ఏదో చెప్పబోయి నా పక్కనే ఏదో కనపడినట్లు, “పా, పా......” అని అంటూ భయంతో, మత్తులో అలానే పడుకున్నాడు.

“చచ్చింది గొర్రె, చెత్త వెధవ, మూడు బీర్లు తర్వాత పడుకొనే గాలోడుకి ఆరు బీర్లు కావాలంటా. లేవే, లే” అని ఎంత పిలిచినా మత్తులో కదులుతున్నాడు కానీ లెవట్లేదు.

మిగిలిన బీర్లు బాధ్యత నేనే తీసుకున్నాను. ఆ సమయంలో నా బాధని ఎవరితో షేర్ చేసుకోవాలో తెలియక మదన పడుతున్న టైమ్ లో పక్కన చూస్తే, పడగ విప్పిన పాము ఉంది.

“హే, పాము నువ్వా, నిన్ను చూసేనా, పా పా అని వెంకట్ గాడు పడుకున్నాడు. ఏంటి కదలట్లేదు నువ్వు. పడగ విప్పి చచ్చిపోయావా? పడగ మూయి. అయిన ఇంకా నువ్వు చచ్చిపోలేదా? నా చిన్నప్పటి నుండి ఈ పొలంలోనే తిరుగుతున్నావు?”

బుస కొట్టింది గట్టిగా.

“బుస కొడుతున్నావు ఏంటే?”

అది వెళ్ళ బోతుంటే...

“ఆగవే ఎక్కడికి వెళ్తున్నావు” అని దాని దారిలో వెళ్లి అడ్డంగా కూర్చున్నా.

“ఈరోజు నువ్వు నా బాధలు షేర్ చేసుకోవాల్సిందే” అని పాముతో చెప్పాను. దానికి ఏం అర్థమైందో కానీ, అడ్డంగా పడుకుంది.

మిగతా నాలుగు బీర్లు తాగుతూ నా బాధని, గతాన్ని, ఇంకా ఏమి చెప్పానో గుర్తులేదు కానీ, దానికి చాలా విషయాలు షేర్ చేశాను.

"మై డియర్ ఫ్రెండ్ పాము గా, నా మనసులో ఉన్న విషాన్ని, విషం కలిగి ఉన్న నువ్వు పంచుకున్నావంటే, నువ్వు నాకు దొరికిన ఇంకో మంచి మిత్రుడివిరా. కాటెయ్యకు రా వెంకట్ గాడిలా...!"

ఆ తర్వాత, మైండ్ లోకి టక్కున నాగేంద్ర గాడు గుర్తుకు వచ్చాడు. "ఒరేయ్ పాము, నిన్ను నాగేంద్ర అని కూడా పిలుస్తారు కదా. నాకు ఆ పేరు నచ్చలేదు అని కోపంగా చెప్పాను. ఆ పేరు పెట్టుకున్న నువ్వు కూడా నచ్చలేదు. అనవసరంగా నీకు గతమంతా చెప్పా. నువ్వు వేరే వాళ్ళకి ఎవరికైనా చెప్తే, కర్ర తీసుకుని వస్తాను" అని అనగానే పడగ విప్పింది.

"ఏంటి రా స్నేక్ గా, నన్ను భయపెడుతున్నావా?"

అవును అన్నట్లు తల నేలకేసి కొట్టింది.

"పో, ఇక్కడినుంచి. లేకపోతే ఆ నాగేంద్ర గాడి పేరు నువ్వు పెట్టుకున్నందుకు నిన్ను లేపేస్తా, పీక మీద కాలేసి తొక్కుతా, తోక పట్టుకొని చెట్టుకేసి బాదుతా. అనవసరంగా నిన్ను చంపానని చెడ్డ పేరు నాకు తేవొద్దు."

ఏమనుకుందో ఏమో, అక్కడి నుండి చిన్నగా, చెట్టు పక్కన ఉన్న బొక్కలోకి పోయింది. ఆ తర్వాత ఎప్పుడూ పడుకున్నానో తెలియదు.

చాలా రొమాంటిక్ మ్యూజిక్ ప్లే అవుతుంది రాత్రి సమయంలో, మ్యూజిక్ ని ఎంజాయ్ చేస్తూ మెట్ల మీద నడుస్తూ, డాబా మీదకి చేరుకున్నాను. ఆకాశం వంక చూస్తే, చాలా చుక్కలు ఉన్నాయి. చందమామ నిండుగా ఉండి వెన్నెలని వెదజల్లుతుంది. అక్కడ ఎవరో ఒక జంట చందమామ వైపు చూస్తూ కబుర్లు

చెప్పుకుంటున్నారు. అమ్మాయి లెహంగా వేసుకుంది, అబ్బాయి షేర్వాణీ వేసుకున్నాడు. నా అడుగులు చప్పుడు విని అమ్మాయి వెనక్కి తిరిగింది, శ్రావణి...! మ్యూజిక్ లో రొమాన్స్ పెరిగింది.

ముద్దొచ్చే ముద్ద మందారం లాగా ఉంది, చందమామ పక్కనుండి తనని చూస్తుంటే, నవ్వుతున్న చంటి పిల్ల లా ఉంది, చుక్కలు అన్ని కలిస్తే వచ్చే వెలుగు శ్రావణి మోములో మెరిసినట్టు ఉంది, తన పెదవులలో నుండి వచ్చే స్వచ్ఛమైన చిరునవ్వుని చూడగానే, తనని హగ్ చేసుకోవాలనిపించి తన వైపు కి సంతోషంగా నడుస్తున్నాను. ఆ సమయంలో అబ్బాయి నా వైపు తిరిగాడు. అప్పటిదాకా ప్లే అయిన రొమాంటిక్ మ్యూజిక్, హర్రర్ మ్యూజిక్ గా మారింది. నాగేంద్ర గాడు...!

ఉలిక్కిపడి నిద్ర లేచాను. నా మనసుకు మానవత్వం లేదు, అది కన్న కల కనికరం లేకుండా ఉంది. **నా జీవితంలో నేను హీరోని కాను, చివరికి నా కలలో కూడా నేను హీరోని కాను. కలలో, ఇంత మంచి రొమాంటిక్ సిట్యుయేషన్ లో శ్రావణి నాతో కాకుండా ఎవరితోనో ఉంటే...,**

**ఏంటి నీ ఊహకి ఆ సీన్ అందకపోతే, బుక్ కవర్ పేజీ చూడు, అప్పుడు నీకు నొప్పి తెలుస్తుంది...! బుక్ కవర్ పేజీ మీద ఉంది, నేను, శ్రావణి అని నువ్వు అనుకున్నావు కదా, మనకి షేర్వాణి, గీర్వాణీలు మనకు నచ్చవు, చూస్తే పంజాబీ డ్రెస్ లాగే ఉంటాయి, నేనైతే వేసుకోను. అయినా, నా జీవితంలో, నా కలలో నేను హీరోని కానప్పుడు బుక్ కవర్ పేజీలో నేనెందుకు ఉంటాను...!**

**మిగతా కథ చెప్తాను, పద...!**

నేను లేచేసరికి, వెంకట్ గాడు లేచి, బీర్ బాటిల్స్, మిగిలిన ఫుడ్ అంత ఎవరికీ కనపడకుండా, రోడ్ కి వేరే వైపు పడేశాడు. చెరువుకి పోయి, ఆ తరువాత ఇంటికి పోయి, రెడీ అయ్యి, నేను మళ్ళీ జాబ్ కి వెళ్లాలని నిర్ణయించుకున్నాను.

నాన్నకి చెప్తే సంతోషపడతాడని, జాబ్ కి వెళుతున్నా నాన్న అని చెప్పా.

“వెళ్తున్నావా, మంచిది, లేకపోతే రేపటి నుండి పొలం పనుల్లోకి పంపుతామనుకున్నా” అని వెటకారంగా అన్నాడు.

నా పరిస్థితికి నవ్వొచ్చింది.

**రెండు రోజుల తర్వాత, ఇక జాబ్ కి వెళ్తున్న రోజు.**

పొద్దున్నే వెంకట్ గాడు వచ్చాడు.

“ఒరేయ్ కృష్ణా, సిట్టింగ్ వేసినప్పుడు నీకు ఒకటి చెప్పాలని అనుకున్నారా, ఎందుకో చెప్పలేకపోయా.”

“పిచ్చి నీతులు చెప్పకు రా ప్లీజ్”

‘పిచ్చి నీతులు కాదు బే”

“సరే చెప్పు, వద్దంటే మాత్రం అగుతావా ఏంటి.”

“అరేయ్ నువ్వు రైతువి రా”

‘నేనా, నాకు ఎరువు ఎత్తడం కూడా రాదు.”

“అయిన నువ్వు రైతువే రా”

“ఎలా రా?”

“నువ్వు కష్టపడి ఒక విత్తనం వేశావు. దానికి నీళ్ళు పోస్తూ, దానికి కావలిసినవి సమకూరుస్తూ మొత్తానికి విత్తనం ఒక చెట్టు అయింది. ఆ చెట్టుకి ఒక ఆపిల్ మాత్రమే కాస్తుంది. నువ్వు ఇంత కష్టపడింది ఆ ఆపిల్ తినడానికే. కానీ ఆ ఆపిల్ కోయడానికి రెడీగా ఉన్న సమయంలో, ఎక్కడినుండి వచ్చాడో కానీ నాగేంద్ర గాడు వచ్చి టక్కున కోసుకొని తినేశాడురా కిట్టిగా” అని గట్టిగా నవ్వాడు

“దొంగ నా కొడకా, నాకూ టైమ్ వస్తుంది రా, అప్పుడు చెప్తారా నీ సంగతి.”

“ఇక మళ్ళీ ఎప్పటికో కదా కలిసేది కిట్టిగా.”

“రే వెంకట్, ప్రేమ అనేది పెంపుడు పిల్లి లాంటిది రా, దానికి అసౌకర్యంగా అనిపించింది అనుకో, ఎటు దూకుతుందో ఎవరికి తెలియదు. అదే ఫ్రెండ్షిప్ అంటే పెంపుడు కుక్క లాంటిది, చిన్న బిస్కెట్ ముక్కతో జీవితాంతం పో అన్నా కానీ పోకుండా మన తోటి ఉంటుంది నీ లాగా. మళ్ళీ కలుద్దాం రా, నువ్వు కుమారి వాళ్ళ ఆయనకు ఫోన్ చేసి ఆ పిల్లని తన్నించ మాకు.”

“నీకెలా తెలుసు రా కుమారి గురించి”

“రాత్రి మూడు బీర్లకే చెప్పావులే వీర ప్రేమిక..!”

**********

# 18

# క్లైమాక్స్- తన ప్రేమ కథ

**వారం రోజుల తర్వాత...,**

ఆఫీసు లో పనిలో ఉన్నాను, టేబుల్ మీద ఉన్న ఫోన్ అదే పనిగా మోగుతుంది. కొత్త నెంబర్ ఎవరిదో, ఫోన్ ఎత్తగానే...,

“హలో..” అని అమ్మాయి గొంతు, హడావిడి పనిలో ఉండటం వల్ల, గొంతు గుర్తుపట్టలేదు

“హలో ఎవరు”

“గుర్తుపట్టలేదా, గుర్తు పట్టనట్టు నటిస్తున్నావా?”

“నీ గొంతు ఏమైనా పి.సుశీల గొంతా, వినగానే గుర్తు పట్టడానికి”

“శ్రావణిని...”

ఆ మాట వినగానే, సైలెంట్ అయిపోయాను కొన్ని సెకండ్స్.

“వినిపిస్తుందా?”

గొంతు సరిచేసుకుంటూ, “హా, నువ్వా... ఏదైనా పని ఉందా నాతో ? ఎందుకు కాల్ చేశావు?”

“ఎలా ఉన్నావు అని అడుగుతావుకున్నా...!”

“కొంతమందిని అడగాల్సిన అవసరం లేదు, సంతోషంగా ఉండడానికి వాళ్ళు ఎలాంటి నిర్ణయాలు అయిన తీసుకుంటారు.”

‘అవును నువ్వు చెప్పింది నిజమే, నేను బాగున్నాను, తను కూడా నీలాగే చాలా మంచోడు.”

“అయితే చచ్చిపోయాక పబ్లిక్ హాలిడే ఇస్తారులే. అయిన నాకెందుకు చెప్తున్నావు ఇవన్నీ...!”

“నీ కోపంలో నిజాయితీ ఉంది, కానీ నువ్వు అర్థం చేసుకోవాల్సింది ఏంటంటే నా నిర్ణయంలో అర్థం ఉంది. కాలం గడిచే కొద్ది జ్ఞాపకాల విలువ తగ్గిపోతుంది కృష్ణా...!”

“ఎవడి పెళ్ళాంతోనో నాకెందుకు ఉంటాయి జ్ఞాపకాలు.”

“నువ్వు ఇంతకుముందు ఎప్పుడూ ఇలా మాట్లాడలేదు నాతో.”

“నా దగ్గర ప్రేమే లేనప్పుడు, నాకు నీతో ప్రేమగా మాట్లాడాల్సిన అవసరం లేదు. నస పెట్టడం ఆపి, ఎందుకు కాల్ చేశావో చెప్పు. నాకు కొంచెం పని ఉంది.”

“అతి చేయొద్దు కృష్ణా. ఒక పది నిమిషాలు మాట్లాడు చాలు, కాదు మాట్లాడొద్దు, విను చాలు. నేను ఇక ముందు కనీసం నిన్ను చూడలేను కూడా, ఇండియా వదిలి వెళ్తున్నాను.”

“నా జీవితం లో నుండి వెళ్ళిపోయాక నువ్వు ఎక్కడికి వెళ్తే నాకెందుకు.”

“నిజమే కృష్ణ, నా పుట్టుకకు కారణమైన మా అమ్మ నాన్నలను సంతోష పెట్టడానికి నాలో ప్రేమ పుట్టించిన నిన్ను బాధ పెట్టాను.’

“తొందరగా ఏం చెప్పాలనుకుంటున్నావో చెప్పు, నాకు పని ఉంది.”

“మన పెళ్లి అయ్యాక, నేను నీతో కొన్ని విషయాలు చెప్పాలనుకున్నాను, కానీ నాకు పెళ్లి అయ్యాక చెప్పాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదు.”

“అంత రహస్యాలు ఏంటో ?” వెటకారంగా అన్నాను.

“నేను నిన్ను మొదటిసారి ఎప్పుడూ చూశానో తెలుసా?”

“తెలియదు..!”

“నేను చెప్పేది వింటే నీకు నమ్మశక్యంగా ఉండదు, కానీ ఇదే నిజం. నేను మరి చిన్న పిల్లని, వర్షం పడుతుంది. మా ఇంటి దగ్గర ఒక చెట్టు కింద భయంతో నిల్చొని ఉన్నా, అప్పుడు చూశా నిన్ను. అర్థమైందా నువ్వు నన్ను ఎక్కడైతే చూశావో అక్కడే.

ఎందుకో, ఆ వయసులో నాకు నిన్ను చూశాక మనకి నచ్చిన బొమ్మ నీ చూస్తే ఎలా కావాలి అనిపిస్తుందో అలా అనిపించింది. ఆ తర్వాత, నేను నిన్ను చాలా సార్లు చూశాను. నిన్ను చూసినా, మా నాన్నని చూసినా ఏదో తెలియని నమ్మకం, ధైర్యం వస్తుంది నాకు, బహుశా అదే నమ్మకం, ధైర్యం నిన్ను ప్రేమించేలా చేసిందేమో...!

ఆ సమయంలో, నిన్ను ఎందుకు చూడాలనుకుంటున్నానో సరైన కారణం తెలియదు కానీ, నాకు చదువు సరిగా రావట్లేదని, ప్రైవేటు స్కూల్ కి పంపుతుంటే నాన్న దగ్గర ఏడ్చి మరి నువ్వు చదువుతున్న స్కూల్ కి వచ్చాను.

నీకు గుర్తుందా, నీ ముక్కుకి బాల్ తగిలినప్పుడు అందరూ నవ్వుతుంటే, నాకు ఏడుపు వచ్చింది. ఆ తర్వాత నీతో మాట్లాడాలని చాలా సార్లు అనుకున్నాను. నువ్వు ఒకరోజు ప్రేయర్ లో పడిపోయినప్పుడు ఎందుకో నిన్ను వెంటనే చూడాలనిపించి ఏం ఆలోచించకుండా నేను కూడా కళ్ళు తిరిగి పడిపోయినట్టు నటించాను. ఆ రోజు నిన్ను చూడడానికి నీ క్లాస్ దగ్గరికి కూడా వచ్చాను. ఎదురుగా నువ్వు కనపడేసరికి నీకు ఏం కాలేదు అనే సంతోషం. నువ్వు నన్ను ఎన్నిసార్లు చూడాలని అనుకున్నావో, అంతకంటే ఎక్కువ సార్లు నువ్వు నాకు కనపడాలని అనుకున్నాను. అసలు ఆరు గంటలకు ట్యూషన్ అయితే ఐదున్నరకే రోజు వచ్చే దాన్ని నీ కోసం, నిన్ను చూడడం కోసం. ఎలాగైతేనేం నేనే నీతో ముందు మాట్లాడాను గుర్తుందా. నువ్వు పదో తరగతి, నేను ఏడోవ తరగతి, ఆ రోజు నా పుట్టినరోజు, నీకు చాక్లెట్ కూడా ఇచ్చాను కదా. ఆ చాక్లెట్ నీ కోసమే తెచ్చాను. కానీ ఉష కోసం అని చెప్పి, తను రాలేదు అని నీకు ఇచ్చా. తను ఆ రోజు ట్యూషన్ కు రాదు అని నాకు తెలుసు మరి నేనెందుకు ఆ పిల్ల కోసం తెస్తాను. నిన్ను నాతో పాటు తోడు రమ్మన్నా కదా, ఏమని చెప్పా, కుక్కలు ఉన్నాయి అని మరి ఎప్పుడైనా కుక్కలు చూశావా, మా వీధిలో అసలే ఉండవు కదా. ఎందుకు ఇష్టమో తెలియదు కానీ నువ్వంటే చిన్నప్పటి నుండి ఇష్టమే.

ఆరోజు నువ్వు నన్ను అడిగావు కదా, "ఎందుకు నిన్నే రమ్మన్నాను అని", భయం వేసింది ఏం చెప్పాలో అని, అందుకే తొందరలో తెలియకుండా అన్న అని అన్నాను. ఆ తర్వాత రెండు రోజులు చూడకపోతే అప్పుడు నాకు అర్థం అయింది అలా అనకూడదని.

ఆ తరువాత నిన్ను చూడటం అలవాటు అయింది. నీకు స్కూల్ అయిపోయాక కాలేజీ కి వెళ్ళావు. ఏదో తెలియని బాధ. ఆ సమయంలో అప్పుడప్పుడు స్కూల్ నుండి ఇంటికి వెళ్ళే దారిలో చూసేదాన్ని. అప్పటికి నాకు తెలియదు, నన్ను చూడడానికే నువ్వు వచ్చేవాడివి అని. **వింటున్నావా?**

**"హా"**

"ఒకరోజు సడన్ గా కుమారి ఎవరో లవ్ లెటర్ ఇచ్చారని చెప్పింది. కోపం వచ్చింది కానీ తను నా ఫ్రెండ్ కదా ఏమనలేక చదవడం స్టార్ట్ చేశాను, నువ్వు ఇచ్చావని తెలియకుండానే. లెటర్ లో మొదటగా ఇలా ఉంది, "నీ ఎదురుగా ఎవరో ఒకరు మోకాళ్ళ మీద కూర్చొని నీకు ప్రపోజ్ చేస్తున్నారు అని ఊహించుకో" అని. అలా ఊహించుకోగానే నాకు ఊహలో నువ్వే కనబడ్డావు.

లెటర్ చివర్లో నీ పేరు చూసి సంతోషం వేసింది, కానీ అది బయటకి చెప్తే కుమారి గురించి తెలుసు కదా, మొత్తం డప్పు వేస్తుందని కోపంగా ఉన్నట్లు నటించాను. ఒకవేళ ఆరోజు కనుక నువ్వు లెటర్, ఉష కి ఇచ్చి పంపుంటే లేక నాకే డైరెక్ట్ గా ఇచ్చి ఉంటే, ఆరోజే ఒప్పుకునే దాన్ని ఏమో...! ఇప్పటికీ ఆ లెటర్ నా దగ్గర ఉంది.

నీ వాయిస్ విందామని, నేను నీకు కొన్ని సార్లు కాల్ కూడా చేశాను. కానీ భయంతో మాట్లాడలేదు. అందుకే నువ్వు ప్రపోజ్ చేసినప్పుడల్లా రిజెక్ట్ చేశాను. కానీ నువ్వు నా కోసం అన్ని చోట్లకి వస్తుంటే, మనసులో సంతోషంగా అనిపించింది. నువ్వు నన్ను ఇష్టపడే సమయం నుండే నేను నిన్ను ఇష్టపడ్డాను. మన ఇద్దరికీ

ఒకరి మీద ఒకరికి ఆకర్షణ ఒకేసారి మొదలైంది. ఆ ఆకర్షణ ప్రేమ గా మారింది.

నువ్వు రెయిన్ బో లో రంగుల గురించి చెప్పినప్పుడు, నీతో నేను చెప్పని విషయం ఒకటుంది. నేను రోజు ట్యూషన్ కి వచ్చినప్పుడు, లేదా మనం రెగ్యులర్ గా చూసుకున్నప్పుడు నేను నిన్ను ఏ డ్రెస్ లో అయితే చూసే దాన్నో అదే కలర్ డ్రెస్ మరుసటి రోజు వేసుకునే దాన్ని. **ఎప్పుడైనా పరిశీలించావా?"**

**"చాలా సార్లు, కానీ కోఇన్సిడెన్స్ అనుకున్నా...!"**

నాతో పోలిస్తే, నీ ప్రేమ చాలా గొప్పది, ఎందుకంటే నేను నిన్ను వదిలేసినా, నువ్వు నన్ను ఇబ్బంది పెట్టలేదు. నేనంటే ఇష్టం ఉన్నా ప్రేమ చూపిస్తావు, కోపంగా ఉన్నా ప్రేమ చూపిస్తావు, నీతో ఉన్నా ప్రేమ చూపిస్తావు, నీతో లేకపోయినా ప్రేమ చూపిస్తావు.

నువ్వు ఏ ఒక్కరోజు కూడా, నేను మొదటిసారి రాసిన లెటర్ గురించి నువ్వు మాట్లాడలేదు. ఆ లెటర్ రాసింది నేనే కానీ అందులో మాటలు అన్ని కుమారి చెప్పి బలవంతంగా రాపించింది. నేను వద్దులేవే అంటే, నువ్వేంటి సపోర్ట్ చేస్తున్నావా అని రాయించింది. నువ్వు అబ్జర్వ్ చేసి ఉంటే అదే లెటర్ లో ఒక కార్నర్ లో చాలా చిన్న అక్షరాలతో దానికి కూడా కనపడకుండా సారీ అని కూడా రాశాను."

**తను చెప్తున్నప్పుడు, ఒకసారి నా పర్సులో నుండి ఆ లెటర్ తీసి చూశాను, నిజంగానే కార్నర్ లో, సారీ అని చాల చిన్న అక్షరాలతో ఉంది. తను రాసిన మొదటి లెటర్ కద, పర్సు లోనే ఉంచుకున్నాను.**

“నేను ఇంటర్ లో పది సబ్జెక్ట్స్ ఒకేసారి పాస్ అయ్యాను అంటే నీవల్లే. అది నువ్వు ఎప్పుడూ చెప్పలేదు నాతో. నాకు ఎలా తెలుసా అని అనుకుంటున్నావా..? నేను ఎం రాశానో నాకు తెలుసు, నువ్వు ఏం చేశావో అక్కడ ఉన్న ప్యూన్ ఆంటీ కి తెలుసు. నువ్వు ఆంటీ తో మాట్లాడుతుంటే చూశాను. చివరి ఎగ్జామ్ రోజూ తను చెప్పింది, నువ్వు అన్ని సబ్జెక్ట్స్ పాస్ అవుతావని. నేను బాగా రాయలేదు ఎలా పాస్ అవుతాను అని అంటే, నువ్వు అదృష్టవంతురాలు అంది. తను చెప్పక పోయిన నాకు అర్థమైంది.

కాలేజీలో సీనియర్ పరిధికి మించి టీజ్ చేసి ఏడిపించాడు అని నీతో చెప్తే, వారం తరువాత అతను కాలేజీ మారాడు అని తెలిసింది. దానికి కారణం నువ్వు. ఇది కూడా నువ్వు నాతో చెప్పలేదు, కానీ నాకు తెలుసు. థర్డ్ ఇయర్ లో ప్రాక్టీకల్స్ అప్పుడు, ఒక లెక్చరర్ నా చేయి పట్టుకొని తప్పుగా ప్రవర్తించాడు. నాకు నీ ప్రేమ తెలుసు, కోపం తెలుసు. అందుకే నీకు చెప్పలేదు, కానీ నా ఫ్రెండ్ తొందరలో నీకు చెప్పిన రెండో రోజు, కాలేజీ కి వస్తుంటే యాక్సిడెంట్ అయ్యి ఆయనికి చేయి విరిగింది, ఖచ్చితంగా నువ్వే...! ఎందుకు కృష్ణా అంత ప్రేమ?”

“యాక్సిడెంట్ అయ్యి చేయి విరగలేదు, యాక్సిడెంట్ అయ్యాక, కింద పడ్డాకా చేయి విరిచా. నిన్ను, నీకిష్టం లేకుండా ఎవరైనా ముట్టుకుంటే, నేను తట్టుకోలేను, ఎంత దూరమైనా వెళ్తా, ఎంత ఎత్తుకైనా వెళ్తా, ఎవడికైనా ఎదురు నిల్చుంటా. ఫస్ట్ రాసిన లవ్ లెటర్ లో వెదురు వనం లాగా నీ పక్కన ఉంటాను అని చెప్పాగా. **నేను నీకు చెప్పింది పోయెట్రీ కాదు, నా ప్రేమ.”**

“హద్దులు, కల్మషం లేని ప్రేమ నీది. పరిస్థితులను బట్టి మారిన ప్రేమ నాది. **నా సంతోషానికి కారణమయ్యావు నువ్వు, నీ బాధకి కారణమయ్యాను నేను.** నిన్ను నేను ఎంతగానో బాధపెట్టిన బ్రేకప్ సమయంలో కూడా, నువ్వు ఏమి అనలేదు. నేను నీ జాబ్ గురించి తక్కువ చేసి మాట్లాడాను కానీ నువ్వు నా జాబ్ రికమండేషన్ మీద వచ్చిందని తెలిసి కూడా ఏమీ అనలేదు. ఆరోజు, నేను నిన్ను చాలా అవమానించి మాట్లాడాను. కానీ నువ్వు ఒక మాట కూడా తిరిగి అనలేదు. నీలో బాగా నచ్చింది ఏంటంటే, నిన్ను నువ్వు ఎప్పుడూ తగ్గించుకొని మాట్లాడతావు. అవతల వాళ్ళు ఏమన్నా పెద్దగా పట్టించుకోవు. నువ్వు నా మీద చూపించినంత ప్రేమ, నువ్వు ఇచ్చినంత గౌరవం, నాకు ఎవరి దగ్గర దొరకలేదు, చివరికి మా నాన్న దగ్గర కూడా. బహుశా, ఇక అలాంటి ప్రేమ ఎప్పటికీ నాకు దొరకదేమో...!

మా నాన్న నీలాగే ప్రేమ చూపించడంలో, కాకపోతే కోపం చూపించటంలో ప్రేమని మించి చూపిస్తాడు. నిన్ను చేసుకుంటే, నేను కానీ, వాడు కానీ ఒకరే జీవించి ఉంటారు అన్నాడు, ఆ ఆలోచనే నేను తట్టుకోలేక పోయాను.

నాకు మూడు దారులు కనపడ్డాయి. **ఒకటి,** మా నాన్నని కాదని నీతో రావటం. కానీ ఆ తర్వాత మీ ఇద్దరిలో ఒకరు మాత్రమే ఉంటారు. **రెండు,** ఇద్దరిని దూరం చేసుకోలేక, నేను చనిపోవడం. దీని తర్వాత, ఖచ్చితంగా మీ ఇద్దరిలో ఒకరు మాత్రమే ఉంటారు. **మూడు,** నిన్ను దూరం చేసుకోవడం. నేను దూరం అయితే నువ్వు బతకలేవు, కానీ దూరం చేసుకుంటే, ఏదో ఒక రోజుకి తప్పకుండా

నువ్వు మళ్ళీ మామూలు వాడివి అవుతావు. నీకు ఎలాంటి కష్టం వచ్చిన తట్టుకోగలవు. నేను నిన్ను చిన్నప్పటి నుంచి చూస్తున్నాను.

నీకు తెలుసు కదా, మా ఇంట్లో నాకున్న ఫ్రీడమ్ ఏ ఆడపిల్లకి ఉండదు. ఒక్క ఆడపిల్లను అయినా, ఇంట్లో ఒక్కదాన్నే ఉన్నా, చాలా నమ్మకంతో ఉండేవారు. మనం కూడా హద్దులు దాటలేదు. నాతో సెక్స్ చేయలేదు, చేయమని ఒత్తిడి కూడా నువ్వు తేలేదు. ఒకవేళ, ఒత్తిడి చేసి ఉంటే నీకు వద్దు అని చెప్పేదాన్ని మాత్రం కాదు. ఎందుకంటే నాకు అందరికన్నా, అన్నింటికన్నా నువ్వంటేనే ఇష్టం. నువ్వు ఏం చేసినా ఇష్టం నాకు. నువ్వు నాకు ఇచ్చిన ప్రేమని మరువలేను. నేను చెప్పిన ఒక మాట, మా అమ్మ నాన్న నాకు చాలా ఫ్రీడమ్ ఇచ్చారు, తప్పుగా ఉపయోగించకూడదు అని నేను అన్న మాట, నేను తప్పాలనుకున్నా, నువ్వు తప్పలేదు. మనం ఏకాంతంగా గడిపిన, నీకు అవకాశం వచ్చినా, దాన్ని అడ్వాంటేజ్ గా తీసుకోలేదు. నా దగ్గర ఈ రోజుకి కూడా ఒక్క రూపాయి తీసుకోలేదు. అయిన నిన్ను చాలా కఠినమైన, అనకూడని మాట అన్నాను, నన్ను వాడుకున్నావని. **క్షమించు కృష్ణా...”**

**“ఇప్పుడు క్షమాపణలు దేన్నీ మార్చలేవు శ్రావణి”**

“నువ్వు నాకు నచ్చినట్టు, నీ మాటలు అన్ని నాకు నచ్చుతాయి. కానీ సెక్స్ గురించి నువ్వు చెప్పిన మాట...”

‘మనం కలిసి తిరిగాం, ఎన్నో మాటలు పంచుకున్నాం, చిన్నప్పటి నుంచి చాలా మంది స్నేహితులతో కలిసి పంచుకున్నట్టు. మనం కలిసి ఒక ఇంట్లో ఉన్నాం, మన కుటుంబంతో ఉన్నట్టు. మనం చేతిలో చెయ్యి వేసుకొని నడిచాం, మన నాన్నతో నడిచినట్టు.

ప్రేమగా ముద్దు పెట్టుకున్నాం, మన అమ్మ మనకి బాగా ముద్దు వచ్చినప్పుడు పెట్టే ముద్దు లాగే అది కూడా...! మనం ఎన్నో విషయాలు మంచి చెడు చెప్పుకున్నాం, బంధువులతో పంచుకున్నట్లు. కానీ భార్య భర్తలాగా ఎప్పుడూ కలిసి సెక్స్ చేయలేదు అది మన ఇద్దరి పెళ్లి అయ్యాక చేద్దాం. ఆ క్షణం నీతో గడపడం కోసం నాలో నీ రూపం చూసి, అందం చూసి ఎన్ని కోరికలు కలిగిన, నీ మనసును చూసి నేను హద్దుల్లో ఉండగలను.'

"చెప్పడం అందరూ చెప్తారు, పాటించే వాళ్ళు, కోట్లలో ఒకడు ఉంటాడు నీ లాగా. ఈరోజు పెళ్లి చేసుకున్నవాడిని మనసుతో మోసం చేశానేమో కానీ, భర్త కి మాత్రమే ఇచ్చే శరీరంతో మోసం చేయలేదు అనే ఫీలింగ్ తోనే ఈరోజు బ్రతకగలుగుతున్నాను, అది కూడా నీవల్లే...

నన్ను అన్ని విధాలుగా ప్రొటెక్ట్ చేశావు, కానీ నేను నిన్ను....." అని ఏడుస్తుంటే నేను ఎలా రియాక్ట్ అవ్వాలో అర్థంకావటం లేదు, **మౌనంగా రోదించడం తప్ప...!**

ఒక నిమిషం తరువాత మళ్ళీ మాట్లాడటం మొదలు పెట్టింది.

"కానీ ఒక్కటి మాత్రం నిజం నిన్ను బాధ పెట్టింది కూడా నీ మీద ప్రేమతోనే కృష్ణా. ఈ ప్రపంచంలో అందరికన్నా నాకు నువ్వంటే ఇష్టం, అది ఎప్పటికీ మారదు. ఎన్ని ప్రేమలు నా దగ్గర ఉన్న, నువ్వు చూపించిన ప్రేమకి సరితూగదు. మా నాన్న ఇష్టమా నువ్వు ఇష్టమా అంటే ఏది ఆలోచించకుండా నువ్వే ఇష్టమంటా కానీ ఎవరి మాట వింటావంటే మాత్రం, బాధ్యతతో మా నాన్న మాటే వింటా. ఎందుకంటే ప్రేమ కన్నా కొన్ని సార్లు ప్రేమను

కాపాడుకోవడానికి బాధ్యతతో తీసుకున్న నిర్ణయాలు తాత్కాలికంగా నొప్పిని కలిగించిన, చివరికి మంచే జరుగుతుందని చిన్న నమ్మకం.

నా పెళ్ళిలో నిన్ను చూశాను, నీ బాధని చూశాను, కానీ బాధని చూపించలేని పరిస్థితి నాది. నువ్వు అంతగా ప్రేమించిన అమ్మాయి పెళ్లి జరుగుతుంటే వచ్చి అలానే చూస్తుంటే, ఒక్క క్షణం అనిపించింది అన్ని వదిలేసి నీ చేయి పట్టుకొని నీతోనే జీవితాంతం నడుద్దామని. కానీ సగటు ఆడపిల్ల లాగా భయంతో, మరేదో తెలియని కారణంతో ఆగిపోయాను. మా నాన్నని ఒప్పించడానికి చాలా ట్రై చేశాను, బ్రతిమిలాడాను, కాళ్ళ వేళ్ళ పడ్డాను, అలిగాను, చిరాకు పడ్డాను. మొదటిసారి మా నాన్న నన్ను కొట్టాడు. కోపం చూపించాడు, బెదిరించాడు. మా నాన్న ఒప్పుకోవడం లేదని నీకు చెప్తే, నన్ను వదిలిపెట్టలేవు, వదిలిపెట్టవు కూడా. నేను ఎంత ప్రేమిస్తున్నానో నాకు తెలుసు, కానీ నిన్ను నువ్వు మర్చిపోయి నన్ను ఎంతగా ప్రేమించావు అంటే దానికి హద్దు లేదు. **హద్దు లేని నీ ప్రేమతో, ఆవేశంలో ఉన్న మా నాన్నతో కలిసి మాట్లాడే పరిస్తితి వస్తే, ఏం జరుగుతుందో నాకు తెలుసు**. అందుకే ఆ రోజు ఏం మాట్లాడాలో తెలియక అలా మాట్లాడాను. మన ప్రేమకి ఇక భవిష్యత్ లేకపోవచ్చు, కానీ నువ్వు చూపించిన ప్రేమ, నాకు భవిష్యత్తులో కూడా మరువలేని ఒక జ్ఞాపకం గా ఉండబోతుంది.

మన ప్రేమకి పునాది మా ఇంటి వెనుక ఉన్న చెట్టు. మన తొలి ముద్దు ఆ చెట్టు కిందే. నా పెళ్ళికి, ఆ చెట్టును కూడా కొట్టేశారు అడ్డు వస్తుంది అని. చెట్టుతో, పాటు మన జ్ఞాపకాలు పోతే, నా పెళ్లి

మన ఇద్దరిని దూరం చేసింది. చెట్టుని కూలి వాళ్ళు నరికితే, మన ప్రేమను నేను నరికాను. **చివరిగా ఒక మాట చెప్పాలనుకుంటున్నాను."**

**"లక్షల మాటలు మరుస్తున్న నాకు, ఒక మాట ఓదార్పును ఇవ్వదు, కోపాన్ని కలిగించదు" అని ఏడుస్తూ అన్నాను.**

"నువ్వు నా పక్కనే ఉన్నట్టు ఉంది, నీ చేయి పట్టుకున్నట్టు ఉంది ఇప్పుడు...! మనసుతో సారీ, కృతజ్ఞతో థ్యాంక్ యూ, ప్రేమతో జాగ్రత్త..., నిజం చెప్తున్నా నీ ప్రేమలో ఉన్న ప్రతి క్షణం నేను చాలా సంతోషంగా ఉన్నాను. నీ మీద ఉండే ఇష్టం ఎప్పటికీ పోదు ఎందుకంటే నువ్వు నాకు నచ్చిన తొలి ఇష్టం, అందరికన్నా ఎక్కువ ఇష్టం.

ఇక సెలవు నీకు మాత్రమే కాదు, మన ప్రేమ మాటలకి కూడా. **ఎందుకంటే ప్రేమని మోసం చేసి పెళ్లి చేసుకోవచ్చు, పెళ్లిని మోసం చేసి ప్రేమని పొందలేను నేను**" అని ఏడుస్తూ బై చెప్పింది.

**"తను బై చెప్తున్నప్పుడు, చిన్న పిలకలు వేసుకొని తను చెట్టు కింద చందమామ లాగా కనపడిన క్షణం, పిలకలు జడలుగా మారి రెండు జడలతో తనని స్కూల్ లో చూసిన క్షణం, రెండు జడలు ఒక పెద్ద జడ గా మారి తను పెద్ద మనిషి అయిన క్షణం, అల్లిన జడ కాస్త విరబోసుకున్న కురులుగా, నా భుజం మీద పడిన క్షణం ఒకటి తర్వాత ఒకటి గుర్తుకు వచ్చి మనసును చిత్రవధ చేస్తుంది. తనని పోగొట్టుకున్నాక, నా దగ్గర ఇక పోగొట్టుకోవడానికి ఏమి లేదు నా ప్రాణం తప్ప.**

పన్నెండు సంవత్సరాల క్రితం, ఒక వర్షం కురిసిన రోజు, నవ్వుతూ కనపడిన నా చెలి, నా మనసులో వెలసిన రెయిన్ బో చందమామ, ఇక మాయమయ్యే క్షణం వచ్చింది.

కన్నీటితో నిండిన,

ఎంతో వేదన తో కూడిన,

బరువైన నా హృదయం
తనకి చెప్తుంది ఇక సెలవు...!

తనకి మాత్రమే కాదు,

ఈ కథ వింటున్న నీకు కూడా సెలవు మిత్రమా...!

కోట్ల కాంతులు కురుస్తున్న ప్రేమ వీధిలో, ప్రేమగా ఒకరి చేయి ఒకరం పట్టుకొని, ప్రేమ కబుర్లు చెప్పుకుంటూ, మా ఇద్దరి ప్రేమలతో నడిచిన దారి, తన ప్రేమ లేక పతనం అయింది...! అమ్మ ప్రేమని మరిపిస్తుందనుకున్న అమ్మాయి ప్రేమ, నన్ను వదిలిపెట్టింది...! దేవుడికి కూడా చెప్పుకోలేను నా బాధ ఎందుకంటే ఏ దేవుడు కూడా ప్రేయసి ప్రేమ విషయంలో ఫెయిల్ కాలేదు కాబట్టి.

నింగిలో నా పక్కన ఉండే చుక్క రాలి, నా ప్రేమ కథ ముగిసి, ప్రేమ బరువు ఎదలో చేరి, ఎద మరింత బరువుగా మారి, మది లో గుర్తుగా మారింది, మీకు కథలాగా మారింది.

1998 లో నాకే తెలియకుండా మొదలైన నా ప్రేమ కథ, పుష్కర కాలం పూర్తి చేసి 2010 లో ముగిసింది."

**సినిమా అయిపోయింది.**

**చెప్పాలనుకున్న కథ ముగిసింది...!**

**చెప్పబోయే కథ మిగిలి ఉంది...!**

**********

# 19

# శ్రావణి - ది డెడ్ గర్ల్ - మరొక భాగానికి ట్రైలర్:

ఆ తరువాత మా ఊర్లోకి మెగా స్టార్ చిరంజీవి చెప్పినట్టు ఐశ్వర్య రాకపోయినా, తనని మర్చిపోయాను. రామకృష్ణ క్యారెక్టర్ అదే కదా..!

నాకు పెళ్లి కుదిరింది. ముహూర్తం కూడా పెట్టుకోవడానికి తయారు అవుతున్నాం. అన్నీ అనుకున్న విధంగా మంచిగా జరుగుతున్నాయి అని అనుకునే లోపు, నా దరిద్రం గురించి, నీకు తెలుసుగా, అది పరిమాణంలో కొలిస్తే సముద్రంలో దొరికేంత ఉప్పు, ఎడారిలో దొరికే ఇసుకంత అని.

**శోభనం గురించి సిగ్గు పడుతూ, పెళ్ళి గురించి ఆలోచిస్తుంటే, నన్ను పోలీసులు అరెస్ట్ చేశారు అది ఒక హత్య కేసులో. హత్యకు గురైన అమ్మాయి పేరు శ్రావణి.** నన్ను అందరూ హేట్ చేయడం, టీవీల్లో చూపించడం మొదలుపెట్టారు.

**వర్షాకాలంలో రామకృష్ణ చెప్పిన ప్రేమకథ విన్న నువ్వు, ఈ సారి అదే రామకృష్ణ చలికాలంలో చెప్పే క్రైమ్ కథ వినబోతున్నావు.**

నీకు ఈ ప్రేమ కథ నచ్చితే, క్రైమ్ కథ అంతకన్నా బాగా నచ్చుతుంది. ఒకవేళ ప్రేమ కథ నీకు నచ్చకపోయినా, క్రైమ్ కథ మాత్రం చాలా థ్రిల్లింగ్ గా ఉంటుంది.

నువ్వు ఈ ప్రేమ కథ గురించి నీకు తెలిసిన వాళ్ళకి మంచిగా చెప్పి, క్రైమ్ కథ కోసం ఎదురు చూడకపోతే, నేను నీకు రెస్పెక్ట్ ఇస్తా, నిన్ను ప్రేమిస్తా. ఆ తరువాత నీ జీవితం కూడా సముద్రంలో ఉప్పు, ఎడారిలో ఇసుక...😁

అందరికీ మంచిగా మౌత్ టాక్ పబ్లిసిటీ చేస్తావని ఆశిస్తున్నా నా శాడిస్టిక్ మనసు, అతి త్వరలో **నిన్ను మళ్ళీ కలుస్తాను అని కూడా చెప్తుంది.**

చూస్తూనే ఉండండి, చెప్పబోయే క్రైమ్ కథ కోసం...!

**ప్రస్తుతానికి సమాప్తం...,**

**మర్చిపోకుండా నీ ఫీడ్ బ్యాక్ ని పంపు...**

**నీకు నచ్చితే ఎవరికైనా చెప్పు చదవమని...**

**venuwritings@gmail.com**

**********